# శ్రీకృష్ణ దర్శనం

(గోకుల, బృందావన శ్రీకృష్ణ దివ్యదర్శనం)

## రెండవ భాగం



విశ్వపతి


Vishnu

# శ్రీకృష్ణ దర్శనం

(గోకుల, బృందావన శ్రీకృష్ణ దివ్యదర్శనం)

(రెండవ భాగం)


## విశ్వపతి

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**



श्रीं

SHRI DESIGNS

VEDIC LOGO DESIGNERS

www.lordofsevenhills.com

HYDERABAD

# శ్రీకృష్ణ దర్శనం

(గోకుల, బృందావన శ్రీకృష్ణ దివ్యదర్శనం)

రెండవ భాగం


విశ్వపతి

(తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి)



© Copyrights reserved



ప్రథమ ముద్రణ : 2026

ప్రతులకు :

వెల : రూ. 100/-

Phone : 8688616060 (WhatsApp only)

Printed at :
**VIMAL PRINTERS**
1-1-776/3/1, SBI Colony,
Gandhi Nagar, Hyderabad.
Cell : 73861 74117

# ఒక విన్నపం

మనలో చాలా మందికి ఏదైనా కొత్త పుస్తకం చదువుతున్నప్పుడు ఆ రచయిత రాసిన ముందుమాట చదవకుండా పుస్తకంలోనికి వెళ్ళిపోవడం అలవాటు. అప్పుడు ఆ రచయిత మనస్సులో ఉన్న భావాలు, ఈ పుస్తకంలో చెప్పదలచుకున్న విషయాల పరమార్థం మనకు తెలియదు. ఈ పుస్తకం చదివేముందు మీరు తరువాత పేజీలో గల నివేదన తప్పక చదవండి. అప్పుడే మీకు ఈ పుస్తకం యొక్క పరమార్థం బాగా అర్థమవుతుంది. మీ అందరికి ఇదే నా విన్నపం.

విశ్వపతి

# నివేదన

శ్రీకృష్ణుడు నిస్సంగుడు, ప్రేమతత్వ స్వరూపుడు, నిష్కామయోగి, నిష్కామ కర్మయోగి. మహాభారత శ్రీకృష్ణుని మహాపురుషునిగా, గొప్ప రాజనీతిజ్ఞునిగా మనం దర్శిస్తే, భాగవత కృష్ణుడు ఎంతో ఆనందానిచ్చే ప్రేమ స్వరూపంగా, ఎంతో దివ్యానుభూతిని ప్రసాదించే గొప్ప మనోహర మూర్తిగా మనం దర్శిస్తాం. శ్రీకృష్ణుల వారి అనేక గుణ విశేషాలపై ఇప్పటికే కొన్ని లక్షల రచనలు వచ్చి ఉంటాయి. ఆ స్వామి తన భక్తులను అంతగా అనుగ్రహించాడు మరి! .

ఇన్ని వేల సంవత్సరాలుగా కృష్ణయ్య మధురభక్తిలో ఓలలాడుతూ ఆ స్వామికే సర్వం సమర్పించి సచ్చిదానందానికి లోనైన మహనీయులు ఎందరో ఉన్నారు. ఆ కన్నయ్య పేరులో, ఆ స్వామి తత్వంలో ఉన్న మాధుర్యం అంతటిది!.

ఇప్పటిదాకా అనేక దేవతలపై ఎన్నో పుస్తకాలు రచించిన నేను కొన్ని సంవత్సరాల క్రితం శ్రీకృష్ణ వ్రతం కూడా రచించాను. ఆ పుస్తకం శ్రీకృష్ణ భక్తులను ఎంతగానో అలరిస్తోంది. ఇన్ని సంవత్సరాల తర్వాత మళ్ళీ ఈ శ్రీకృష్ణ దర్శనం! ఇది పూర్తిగా ఆ శ్రీకృష్ణుల వారి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. ఆ స్వామి అనుగ్రహంతో నేను ద్వాపరయుగంలోకి వెళ్ళి అప్పటి కన్నయ్య లీలలను దర్శించి రచించిన పుస్తకం ఇది. ఈ పుస్తకం రాస్తున్నంతసేపు నేను మాటలలో, అక్షరాలలో వర్ణించలేని అద్భుత అనుభూతికి లోనయ్యాను. ఆ స్వామితో ద్వాపరయుగంలో గోకులంలో, బృందావనంలో విహరించడం కంటే ఆనందం ఏముంటుంది?

ఒక్కోరోజు నేను కాస్త పని వత్తిడి వలన కొంచెం బద్ధకం చేసి పడుకొని ఉంటే ఎదురుగా ప్రత్యక్షమై పక్కన కూర్చొని పదపద రాసుకుందాం! అనేవాడు. ఎంతటి దివ్యానుభూతి అది! అక్కడితో నా శ్రమ మర్చిపోయి వెంటనే ఇద్దరం చెంగు చెంగున నేను రాసుకునే టేబుల్ దగ్గరకి

వెళ్ళి మళ్ళీ రాయడం ప్రారంభించేవాడిని అలా కన్నయ్య నాకు దర్శింపచేసిన ఎన్నో దివ్యలీలలు ఈ పుస్తకంలో రాసాను. జన్మ జన్మలకు మర్చిపోలేని మధురానుభూతి అది! .

ఈ పుస్తకం రాస్తున్న రోజుల్లో కృష్ణుడితో ఎన్నో అద్భుతాలు! ఒక్కొక్కసారి బాగా అలసిపోయి రాత్రి నిద్రపట్టకపోతే పక్కనే కూర్చొని ఎంతో మనోహరంగా వేణువు ఊదేవాడు. ఒక్కొక్కసారి ద్వాపరయుగ కబుర్లు చెపుతూ నాకు నిద్ర పట్టే వరకు పక్కనే కూర్చొనేవాడు. ఇలా ఆ కన్నయ్య ఎన్నో అనుభూతులు నాకు అనుగ్రహించాడు.

ఈ పుస్తకం మీరు ఎటువంటి సంశయాలు మనస్సులో పెట్టుకోకుండా చదివితే మీకు అద్భుత అనుభూతులు కలుగుతాయి. మీరు కూడా గోకులంలోను, బృందావనంలోను ఆ కృష్ణయ్యతో విహరించిన దివ్య అనుభూతి కలుగుతుంది. మనస్సు ఎంతో ఆనందంతో నిండిపోతుంది. ఈ పుస్తకాన్ని మీరు మీకు మనశ్శాంతి లేనప్పుడు చదివితే ఎంతో మనశ్శాంతి కలుగుతుంది. అంతేకాదు ఆ కన్నయ్య అనుగ్రహంతో మీ సమస్యలన్నీ పూర్తిగా తీరిపోతాయి.

కన్నయ్య చెప్పిన ఇంకో విషయం. ఈ పుస్తకాన్ని ఎవరయితే ఆ కన్నయ్యపై పూర్తి భక్తితో, ప్రేమ భావంతో చదువుతారో వారికి తాను స్వప్న దర్శనం కాని, ఒక అపరిచిత భక్తుని రూపంలోగాని తప్పక దర్శనమిస్తాడని అనుగ్రహించాడు. ఇంతకు మించిన భాగ్యం మనకి ఏముంటుంది? ఇంకా ఆలస్యం దేనికి? హాయిగా ప్రశాంతంగా చదవడం మొదలు పెట్టండి. పదండి! ఆ కన్నయ్యతో గోకులానికి, బృందావనానికి!.

ఈ పుస్తకం మొదటి భాగం ఎంతో మంది కృష్ణ భక్తులను ఎంతగానో ఆనందపరిచింది. ఈ రెండవ భాగం కూడా మొదటి భాగం లాగానే మీ అందరికీ ఎంతో ఆనందాన్ని, మధురానుభూతుల్ని ఇస్తుందని ఆశిస్తున్నాను. ఇక్కడ వ్రాసిన ప్రతీ సంఘటన అలా దృశ్యరూపంలో నాకు

ఎదురుగా కనబడుతూ ఉన్నది ఉన్నట్లు వ్రాసాను. ఆ కన్నయ్య అనుగ్రహంతో ఎంత దర్శించానో అంతమాత్రమే వ్రాసాను. అంతే తప్ప దీనిలో ఊహా, కల్పనలు ఏ మాత్రం లేవు. అంతా ఆ బంగారు కన్నయ్య అపార అనుగ్రహం తప్ప మరొకటి కాదు.

ఈ పుస్తకాన్ని ఎంతో అందంగా డి.టి.పి. చేసిన శ్రీ తామరపల్లి కృష్ణ గారికి, ఎంతో చక్కటి ముఖచిత్రాన్ని ఇచ్చిన శ్రీమతి విష్ణుప్రభ గారికి, నా పుస్తకాలన్నింటినీ ఎంతో చక్కగా ముద్రిస్తున్న విమల్ ప్రింటర్స్ శ్రీ సత్యనారాయణ గారికి నా కృతజ్ఞతలు. ఈ పుస్తక ప్రచురణలో ఎన్నో విధాల సహాయపడిన నా కుటుంబ సభ్యులకు, బంధువులకు, ఎందరో మిత్రులకు, శ్రేయోభిలాషులకు నా కృతజ్ఞతలు. వీరందరినీ, మిమ్మల్ని ఆ శ్రీలక్ష్మీ శ్రీనివాసులు ఎల్లప్పుడూ చల్లగా చూడాలని ప్రార్థిస్తున్నాను.

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు!

శ్రీకృష్ణ అనుగ్రహ సిద్ధిరస్తు!
శ్రీలక్ష్మీ శ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు!
సర్వేజనా సుఖినోభవంతుః
సమస్త కళ్యాణానిభవంతుః

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి
viswapathi@gmail.com
Ph.: 98494 43752

Hyderabad
2026

# అంకితము

నా తల్లిదండ్రులు
కీ॥శే॥ బ్రహ్మశ్రీ తిమ్మరాజు లక్ష్మీ నరసింహారావు
కీ॥శే॥ శ్రీమతి నాగరత్నాంబ గార్ల ప్రీత్యర్థముగా
శ్రీకృష్ణ దర్శనం పుస్తకాన్ని ముస్తాబాదులోని
మా వంశీకుల కులదైవం అయిన
శ్రీరుక్మిణి సత్యభామాసమేత సంతాన వేణుగోపాలస్వామి
వారికి భక్తితో సమర్పిస్తున్నాను.

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

# 1

ఆ రోజు కృష్ణుడు గోపబాలురతో కలిసి ఆడుతూ పాడుతూ గోకులానికి దగ్గరలో ఉన్న అడవి ప్రాంతం చేరాడు. గోపబాలురందరూ చెట్ల మీదనుంచి దూకుతూ ఆడుకుంటున్నారు. కృష్ణుడు ఎంత ముచ్చటగా ఉన్నాడో చూడండి! గుండ్రటి కళ్ళు, కోలముఖం, కొంచెం ఉంగరాల జుట్టు, తలపై పింఛం, చేతిలో మురళి... కన్నయ్య చూడటానికి ఎంత ముచ్చటగా ఉన్నాడో! ఆ కన్నయ్య చిరునవ్వు చూడండి! ఈ విశ్వంలో ఇంతకన్నా ఎక్కువ ఆనందాన్ని ఇచ్చేది మరేది లేదు. ఆ చిరునవ్వుతోనే విశ్వాన్ని కట్టిపడేస్తాడు. ఆ నవ్వులో జగమంతా మైమరిచిపోతుంది.

కన్నయ్య చిరునవ్వు చూసి అక్కడ ఉన్న యాదవ బాలురే కాదు, పైన చెట్లపై ఉన్న పక్షులు కూడా ఎంతో సంతోషిస్తున్నాయి. ఆనందంతో ఎంతో మధురంగా ఎన్నో విధాల కూతలు కూస్తున్నాయి. నెమళ్ళు అయితే ఇంక చెప్పనక్కర్లేదు. నెమళ్ళకి కన్నయ్య చిరునవ్వు అంటే ఎంతో ఇష్టం. ఆ నెమళ్ళు తమ పింఛాలను కన్నయ్య ధరిస్తాడని ఎంతో మురిసిపోతాయి.

ఇంతలో కన్నయ్య గోపబాలురతో కలిసి ఎంతో అద్భుతంగా నృత్యం చేయసాగాడు. కన్నయ్యకు నాట్యం అంటే ఎంతో ఇష్టం. కన్నయ్య అలా నాట్యం చేస్తుంటే ఒక్కొక్క భంగిమ ఈ జగత్తు మొత్తాన్ని ఎంతో ఆనందంలో ముంచెత్తుతుంది. కన్నయ్య చేసే నృత్య భంగిమలే ఈ సృష్టిలోని గ్రహాలను ఆయా కక్ష్యల్లో ఎటూ గతి తప్పకుండా తిరగడానికి ఆధారం. ఆ నృత్యమే ఈ సృష్టి మొత్తం సక్రమంగా, కాలప్రవాహం అలా ముందుకు సాగిపోవడానికి కారణం.

ఇంతలో ఎక్కడినుంచి వచ్చిందో పెద్ద నెమళ్ళ గుంపు వచ్చింది. ఆ నెమళ్ళు ఎంత అందంగా ఉన్నాయో చూడండి! ఇంతలో కొద్దిగా సన్నటి తుంపరలు పడసాగాయి. ఒక్కసారిగా చల్లబడిన ఆ వాతావరణానికి నెమళ్ళు ఎంతో ఆనందపడి ఒకదానితో మరొకటి పోటీ పడుతూ నృత్యం చేస్తున్నాయి. కన్నయ్య చుట్టూ నృత్యం చేస్తూ మధ్యలో నాట్యమాడుతున్న కన్నయ్యను చూసి ఎంతో మురిసిపోతున్నాయి. అలాగే తన చుట్టూ ఎంతో అందంగా నృత్యం చేస్తున్న నెమళ్ళను చూసి కన్నయ్య ఎంతో ముచ్చటపడుతున్నాడు.

కన్నయ్యతో పాటు స్నేహితులు కూడా నృత్యం చేయసాగారు. వారిలో కొందరు అయితే ఎంత అద్భుతంగా చేస్తున్నారో చూడండి! కన్నయ్య రకరకాల రీతులలో నృత్యం చేస్తుంటే ఆ చిన్ని పాదాలు భూమి మీద పడుతుంటే భూదేవి పాపుల భారం వలన కలిగిన బాధను మరిచిపోతోంది. కన్నయ్య నృత్యంలో ఉన్న కదలికలు, ఆ నృత్య విన్యాసాల వలన వచ్చిన దివ్య తరంగాలు ఎన్నో లోకాలలో ప్రసరిస్తున్నాయి. ఆ దివ్య తరంగాలను గ్రహించిన దేవతలు వారి వారి లోకాల నుంచి ఇక్కడ గోకులంలో జరుగుతున్న ఈ అద్భుత దృశ్యం చూసి ఎంతో ఆనందపడుతున్నారు.

సాక్షాత్తూ వైకుంఠవాసుడైన ఆ శ్రీమన్నారాయణుడే ఇలా చిన్ని బాలునిలాగా గోకులంలో గోపబాలురతో కలిసి చుట్టూ ఉన్న ప్రకృతి పరవశిస్తుండగా ఎంతో ముచ్చటగా నృత్యం చేస్తుంటే దేవతలు ఎంతో ఆనందంతో ఉప్పొంగిపోతున్నారు. కన్నయ్యతో పాటు నృత్యం చేస్తున్న ఆ

పిల్లలు, ఆ నెమళ్ళు ఇదంతా చూస్తున్న అక్కడి పక్షులు ఇవన్నీ ఎంత పుణ్యం చేసుకున్నాయో కదా! అని తలుస్తున్నారు.

ఇలా ఉండగా నృత్యం చేస్తున్న ఒక నెమలి ఈకల నుంచి రెండు పింఛాలు గాలికి ఎగిరాయి. అది చూసి ప్రక్కన నృత్యం చేస్తున్న మరొక నెమలి ఒక్కసారి విదిలించుకుని మరొక రెండు పింఛాలు గాలిలోకి ఎగిరేలా చేసింది. అలా మిగిలిన నెమళ్ళు కూడా రెండు రెండు పింఛాలను తాము నృత్యం చేస్తూ గాలిలోకి ఎగిరేలా చేసాయి. కన్నయ్య నృత్యం చేస్తూ, చుట్టూ ఒక వలయంలా ఆ నెమళ్ళు అన్నీ నృత్యం చేస్తూ పింఛాలు గాలిలో ఎగురుతూ ఉంటే ఆ దృశ్యం ఎంత అద్భుతంగా ఉంది చూడండి!

ఇంతలో దూరంగా ఆకాశంలో గొప్ప ఇంద్ర ధనస్సు ఏర్పడింది ఆహా! ఎంత అద్భుతంగా ఉంది ఆ దృశ్యం! దూరం నుంచి చూస్తుంటే కన్నయ్య నృత్యం చుట్టూ గోపబాలుర నృత్యం! వారి చుట్టూ అనేక నెమళ్ళు వలయాకారంలా ఏర్పడి అద్భుతంగా నృత్యం చేస్తున్న దృశ్యం! వీరి చుట్టూ వారితో ఎంతో అద్భుతంగా రంగు రంగులతో మెరుస్తూ ఎగురుతున్న నెమలి పింఛాలు! వెనకాల ఎంతో అద్భుతంగా రంగు రంగుల హరివిల్లు! దూరం నుంచి చూస్తుంటే ఎంత మనోహరంగా ఉంది ఆ దృశ్యం! వీటన్నింటికి కారణభూతుడు ఎవరు? వీటిన్నింటిని ఇంతగా అనుగ్రహిస్తున్నది ఎవరు? మన కన్నయ్యే కదా!

దేవతలందరూ ఈ అద్భుత దృశ్యాన్ని కళ్ళార్పకుండా చూస్తున్నారు. ఆనాడు అలా కన్నయ్యతో నృత్యం చేసిన ఆ నెమళ్ళ జన్మ ధన్యమైపోయింది. తమ పూర్వ జన్మలలో మానవులుగా జన్మించినప్పుడు చేసుకున్న ప్రారబ్ధ కర్మల వలన ఇలా జంతు లోకంలో జన్మించినప్పటికీ, వారు చేసుకున్న పుణ్యఫలం వలన ఈ జన్మలో నెమళ్ళుగా జన్మించిన వీరందరికీ ఆ పురుషోత్తమునితో కలిసి నాట్యం చేసే భాగ్యం కలిగింది. ఇంతటి మహాభాగ్యం లభించిన ఆ నెమళ్ళలో కొన్ని తరువాత జన్మలలో మానవులుగా జన్మించి గొప్ప నాట్యాచార్యులుగా ప్రసిద్ధి పొందారు. వీరిలో

కొందరు ఎంతో గొప్ప నాట్య శాస్త్రవేత్తలై గొప్ప నాట్యాలయాలు కూడా నెలకొల్పి అనేకమందిని నాట్యరంగంలో తీర్చిదిద్దారు. వారిలో కొందరికి ఇప్పటికీ కృష్ణుడు అంటే ఎంతో అభిమానం, ప్రేమ. కన్నయ్య వారికి సర్వస్వం. వారు నాట్యం చేస్తున్నప్పుడు వారి ఆత్మలకు తాము ద్వాపరయుగంలో గోకులంలో ఆనాడు చిన్ని కృష్ణుడితో కలిసి నాట్యమాడిన అద్భుత క్షణాలు గుర్తుకు వచ్చేవి. అక్కడితో వారెంతో ఆనందానికి లోనయ్యేవారు.

మళ్ళీ ఒక్కసారి ఆ అద్భుత దృశ్యాన్ని చూడండి! వర్షం చిన్నగా పడటం మొదలయ్యింది. సన్నటి నీటి తుంపరులు గాలిలో ఎగురుతున్న ఆ పింఛాలపై పడుతుంటే అవి ఇంకా అద్భుతంగా మెరుస్తున్నాయి. ఆ పింఛాలు గాలికి అటూ ఇటూ ఎగరటంలో వాటిమీద పడుతున్న నీటి బిందువులు కూడా కాసేపు నిలువుగా, కాసేపు ఏటవాలుగా పడుతూ వివిధ రంగులలో ప్రతిబింబిస్తూ ఎంత అద్భుతంగా ఉన్నాయో చూడండి! అసలు ఆ రంగులు ఒకదానితో ఒకటి మిళితమై మనస్సుకి ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. అదిగో ఆ పింఛంపై చూడండి! ఆ నీటి బిందువులు బంగారు రంగుతో ఎలా మెరుస్తున్నాయో! అదిగో ఆ పక్కనే గాలిలో ఎగురుతున్న పింఛంపై పడిన మరికొన్ని నీటిబిందువులు నీలి రంగులో ఎలా మెరుస్తున్నాయో చూడండి!

ఆ గొల్ల పిల్లలు చూడండి! ఆ సన్నటి తుంపరలో కన్నయ్యతో కలిసి తడుస్తూ గాలిలో ఎగురుతున్న ఆ పింఛాలను అందుకోవడానికి ఎలా ఎగురుతున్నారో చూడండి! ఒక పక్క నీటి తుంపరలు ముఖం మీద పడుతూ ఉంటే వాటిని ఎడమ చేతితో తుడుచుకుంటూ, పైకి ఎగురుతూ, కుడిచేత్తో ఆ పింఛాలను అందుకోవడానికి ఎగురుతున్న ఆ పిల్లలను చూస్తుంటే ఎంత ముచ్చటగా ఉందో! ఆ కన్నయ్యతో ఆడుతున్న ఈ పిల్లలు ఎంతటి భాగ్యవంతులో! మరి వీరు సామాన్యులు కాదు కదా! తమ పూర్వ జన్మలలో గొప్ప మహర్షులు, కొందరు వేదశాస్త్ర పారంగతులు, కొందరు మహాపురుషులు... వారి పుణ్యంఫలం చేత, వారి సంకల్ప బలం చేత, వారి

ధర్మానుష్ఠాన ప్రభావం చేత, వారి జ్ఞానం చేత ఈనాడు ఇలా ఆ పరమాత్ముని సన్నిధిలో, ఆ పురుషోత్తముడు గోవిందునిగా జన్మించినప్పుడు తాము కూడా గోకులంలో జన్మించి ఇలా ఆ పురుషోత్తమునితో ఆడుకునే మహాభాగ్యాన్ని పొందారు. వారి ఆత్మలు అద్భుత ఆనందాన్ని అనుభవిస్తున్నాయి.

ఆ రోజు అక్కడ ఉన్న పిల్లలందరూ ఎంతటి అదృష్టవంతులో కదా! ద్వాపరయుగంలో నెమళ్ళు ఇంకా అందంగా ఉండేవి. అంతే కాదు అక్కడ ప్రకృతి అంతా దివ్యంగా ఉండేది. ఆ రోజు నృత్యం చేస్తున్న కన్నయ్యను, గోపబాలురను, నెమళ్ళను చూసి ప్రకృతి పరవశించింది. ఇంతలో కన్నయ్య తన వేణువు ఊదడం ప్రారంభించాడు. ఆహా! ఎంత దివ్యంగా ఉంది ఆ వేణునాదం! అసలు కన్నయ్య వేణునాదం ఎలా మొదలవుతుందో తెలుసా? కన్నయ్య వేణువు ఊదే ప్రతిసారి ముందుగా తన కుడి చెక్కిలికి ఆనించుకుంటాడు. అలా ఒక్క క్షణం వేణువును ఆనించి తరువాత నెమ్మదిగా పెదవుల వద్దకు తీసుకువస్తాడు. దీని వెనుక ఒక అద్భుత రహస్యం ఉంది.

ఒకనాడు కన్నయ్య వేణువు ఊదుతున్నప్పుడు రాధ అలా గోముగా కన్నయ్య వంకే చూడసాగింది. కన్నయ్య ఎంతో మధురంగా వేణువు ఊదడం చూసి మైమరిచిపోయింది. అలా రాధ ఆనందంతో కన్నయ్య ముఖంలోకి చూస్తూంటే ఆ దృశ్యం చూడడానికి ఎంతో ముచ్చటగా ఉంది. అలా ఎంతో ఆనందపడుతూ ఉన్న రాధను చూసి కన్నయ్యకు ముచ్చట వేసింది.

అసలు కన్నయ్యలోని ప్రేమతత్వం అంతా ఈ రాధయే కదా! అలా మురిసిపోతున్న తన ప్రియసఖి రాధను చూసి కన్నయ్య రాధా! నేను మురళి ఎప్పుడూ ఊదినా నువ్వే గుర్తుకు వస్తావు. నిన్ను తలచుకుంటూ ఆ మధురానుభూతులతోనే నేను వేణువు ఊదడం ప్రారంభిస్తాను. నా వేణువులోని మాధుర్యానికి కారణభూతురాలైన నీకేదైనా వరం ఇస్తాను. నువ్వు మనస్ఫూర్తిగా ఏ చిన్న కోరికయైనా కోరుకో! నీ కోరిక నేను వేణువు ఊదుతున్నప్పుడల్లా నాకు గుర్తుంటుంది. అంతే కాదు! నీకు కూడా గుర్తుంటుంది. ఈనాటి నుంచి నేను ఎప్పుడు ఎక్కడ వేణువు ఊదిన నీవు

ఎక్కడ ఉన్నా ఆ దివ్య వేణునాదం నీ హృదయంలో ప్రతిధ్వనిస్తుంది. నీకు ఏమికావాలో చెప్పు! నా ప్రేమ మూర్తివి నీవు అన్నాడు.

అప్పుడు రాధ చిరునవ్వు నవ్వుతూ కన్నయ్య వంక చూడసాగింది. కన్నయ్య రాధ ఏమి కోరిక కోరుతుందా? అని అలా ఆత్రంగా చూడసాగాడు. అయినా మన అమాయకత్వం గాని రాధ ఏమడుగుతుందో కన్నయ్యకు తెలీదా! ఆ జగన్నాటక సూత్రధారి, శక్తి స్వరూపమైన ఆ రాధాదేవి ఇదంతా మన ముచ్చట తీర్చడానికే గానీ వారికి ఇదంతా తెలీదా?

రాధా కృష్ణులిద్దరూ అలా ముచ్చటించుచుండగా రాధ ఏ కోరిక కోరుతుందో! అని ప్రకృతి మొత్తం ఎంతో ఆత్రంగా చూడసాగింది. రాధ రూపమే ఈ ప్రకృతి మొత్తం కదా! అప్పుడు రాధ నెమ్మదిగా లేచి కన్నయ్య కుడి చెక్కిలిపై సన్నటి ముద్దు ఎంతో సుతారంగా పెట్టింది. కన్నయ్య ఎంతో మురిసిపోయాడు. ముద్దు ఇచ్చిన రాధ మరీ మురిసిపోయింది. ఈ అద్భుత దృశ్యం చూస్తున్న ప్రకృతి మొత్తం పరవశించింది.

అక్కడే ఉన్న ఒక లేడి పిల్ల ఆనందంతో గంతులు వేసింది. ఇది చూసిన చిన్న కుందేలు పిల్ల సిగ్గుపడుతూ పొదలలోకి పరుగెత్తింది. పక్కనే ఉన్న నెమలి ఒక్కసారి దూరంగా వెళ్ళి పురివిప్పి అద్భుతంగా నాట్యం చేయసాగింది. ఒక లేగదూడ ఎక్కడినుంచో చెంగు చెంగున ఎగురుతూ వచ్చి కన్నయ్య ప్రక్కనే నుంచుంది. కన్నయ్య ఆ లేగదూడను నెమ్మదిగా నిమిరాడు. ఆ దూడ ఎంతో ముచ్చటపడింది. పైన చెట్టుపై ఉన్న కోయిల ఒక్కసారిగా ఎంతో శ్రావ్యంగా కూయసాగింది.

అప్పుడు కన్నయ్య రాధ మోముని నెమ్మదిగా పైకి ఎత్తి ఇంతకీ ఏం కావాలి దేవీ! అని అడిగాడు. అప్పుడు రాధ సిగ్గు నటిస్తూ కన్నా! నేను ఒక్కటి అడుగుతాను అది తీరుస్తావా? అంది. అప్పుడు కన్నయ్య తప్పకుండా రాధా! అంతకంటే ఆనందం నాకేముంటుంది అని అన్నాడు.

అప్పుడు రాధ కన్నయ్యతో కృష్ణా! నేను ఇప్పుడు ముద్దు ఇచ్చిన ఈ చెక్కిలిపై ఇప్పటి నుంచి నువ్వు ఎప్పుడు వేణువు ఊదినా ఒక్కసారి అక్కడ ఆనించి అప్పుడు ఊదడం మొదలుపెట్టు. ఇదే నా కోరిక అన్నది రాధ. అప్పుడు కన్నయ్య చిరునవ్వు నవ్వుతూ తప్పకుండా రాధా! ఇప్పటి నుంచి వేణువు ఊదిన ప్రతీసారి ఆ పిల్లనగ్రోవిని ఒక్కసారి ఆ చెక్కిలికి ఆనించి ఊదుతాను. అప్పటితో ఆ వేణునాదానికి మరింత మాధుర్యం లభిస్తుంది. తప్పకుండా నీ కోరిక నెరవేరుస్తాను రాధా! అని అన్నాడు. ఇది ఎప్పటికి మర్చిపోను. నాకు నువ్వు ముద్దు ఇచ్చిన ఈ చెక్కిలి పైననే వేణువును ఒక్కసారి ఆనించి ఊదుతాను. ఇది నా రాధకు నేను ఇస్తున్న ప్రేమపూర్వక వరం. అసలు ఈ వేణునాదంలోని మాధుర్యం అంతా నీదే కదా! ఇప్పటి నుంచి నా వేణునాదంలోని ప్రేమతత్వం విశ్వం అంతా వ్యాపించి ఎంతో మాధుర్యంగా ఉంటుంది అని అన్నాడు.

అలా ఆ రోజు రాధకి మాట ఇచ్చినందువల్ల కన్నయ్య ప్రతీసారి వేణువు ఊదేముందు ఒకసారి కుడి చెక్కిలికి ఆనించి ఊదడం మొదలుపెట్టాడు. అక్కడితో ఆ వేణునాదానికి ఎంతో మాధుర్యం వచ్చి జీవకోటి మొత్తం ఆ మాధుర్య మేఘాలతో కప్పబడి అత్యంత పరవశించిపోతుంది.

రాధ తన కన్నయ్య కోరిక తీర్చినందుకు ఎంతో ఆనందపడింది. రాధ ఆనందపడితే ఈ ప్రకృతి మొత్తం ఆనందపడుతుంది. రాధలోని దివ్యత్వం అంతటిది. ఇప్పుడు కన్నయ్య రాధ ముచ్చట తీర్చడానికి వేణువును అప్పుడే రాధ ముద్దిచ్చిన చెక్కిలిపై ఆనించి పెదవుల వద్ద పెట్టుకొని ఊదడం ప్రారంభించాడు. అంతే ఆ అద్భుత తరంగాలు పధ్నాలుగు లోకాలను ఆనందపరిచాయి. అది కన్నయ్య అప్పటిదాకా ఊదిన అన్ని వేణు నాదాలకంటే అద్భుతమైంది. మహోన్నతమైనది. రాధ ముద్దు ఇచ్చిన చెక్కిలికి మొదటిసారి రాధ సమక్షంలో ఆనించి పాడిన ఆనాటి వేణుగానం ఎంతో దివ్యంగా ఉండి ప్రకృతిని మొత్తం పరవశింపచేసింది. ఆనాటి ఆ వేణుగానం

రాధాకృష్ణులిద్దరూ జీవితాంతం మర్చిపోలేదు. వారిద్దరికి అది ఒక అపురూపమైన అతి మధురమైన అనుభూతి. కన్నయ్యలోని ప్రేమతత్వం మొత్తం రాధాతత్వమే! ఈ సృష్టిలోని ప్రేమతత్వం మొత్తంలో రాధాతత్వమే ప్రకాశిస్తున్నది. ఈ సృష్టిమొత్తానికి మూలకారణం, ఆధారభూతం ఆ తత్వమే! విశ్వంలోని ప్రతి జీవి హృదయంలో ప్రేమరూపంలో ప్రకాశించేది ఆ రాధాతత్వమే! ఆ తత్వం వలననే ఈ సృష్టిలోని జీవులన్నీ ఎంతో గొప్ప ఆనందాన్ని అనుభవిస్తున్నాయి.

అప్పటి నుంచి కన్నయ్య ఎప్పుడు వేణువు ఊదినా ఒక్కసారి తన కుడి చెక్కిలి దగ్గర ఆనించి ఊదేవాడు. గోపికలందరూ ఇది కృష్ణుని ముచ్చటగా భావించేవారు. వారికి ఆనాడు జరిగిన ఆ అద్భుత సంఘటన తెలీదు. ఈ కొంటె కన్నయ్య ఏదో సరదాకి అలా తన చెక్కిలిపై ఒకసారి ఆనించి వేణువు ఊదుతున్నాడని తలిచేవారు. అప్పటి నుంచి కన్నయ్య మురళీనాదం మరింత మాధుర్యాన్ని నింపుకుంది. ఆ కన్నయ్య పరమభక్తుల హృదయాలలో ఆనాటి ద్వాపర యుగపు కన్నయ్య వేణునాదం నేటికీ ఎంతో అద్భుతంగా ప్రతిధ్వనిస్తూ ఉంటుంది.

# 2

కృష్ణుడు ఆ రోజు ఆలమందలతో, గోపబాలురతో కలిసి ఊరిబయటకు ఆడుకోవడానికి వెళ్ళాడు. ఊరి బయట ఎన్నో చెట్లు... చెట్లపై ఎన్నో రకాల పక్షులు, ఎన్నో ఫల వృక్షాలు, ఎన్నో పూల మొక్కలు. గోకులం ఎంతో అద్భుత ప్రకృతి సంపదతో విరాజిల్లుతూ ఉంటుంది. కన్నయ్యకు మామిడిపండ్లు, జామపండ్లు చాలా ఇష్టం. కన్నయ్య కోసం వచ్చే గోపికలు జామపళ్ళు ఎక్కువగా తెచ్చేవారు. కృష్ణయ్య వాటిని ఎంతో ఆనందంతో తినేవాడు. గోకులం బయట ఎన్నో మామిడిచెట్లు, జామచెట్లు ఉండేవి. పిల్లలందరూ పళ్ళు కోసుకుని తినేవారు. అలాగే చెట్లు ఎక్కి ఒక కొమ్మనుంచి మరో కొమ్మకు దూకుతూ ఆడుకునేవారు.

ఆ రోజు అలా ఆడుతూ అలసి అలసి ఒక పెద్ద రాతి బండపై కూర్చున్నారు. మధ్యాహ్నం నాలుగు గంటలయింది. ఇంకా అందరూ ఇంటికి వెళ్ళే సమయం అయింది. ఆవు, దూడలన్నీ వీరివద్దకు రాసాగాయి. వాటికి

ఇక ఇళ్ళకు వెళ్ళే సమయం అయిందని తెలుసు. కృష్ణుడు, గోపబాలురందరూ ఇళ్ళకు బయలుదేరడానికి లేచారు. అప్పుడు కన్నయ్య వద్దకు ఒక ఆవు కన్నీరుతో వచ్చి నుంచుంది. కన్నయ్యకు ఆ ఆవు అలా ఎందుకు కన్నీరు కారుస్తోందో అర్థం అయింది. పాపం దాని దూడ ఎక్కడో తప్పిపోయింది. ఆ ఆవు దూడ కోసం ఎంత వెతికినా కనపడలేదు. తన పిల్ల కోసం ఎంతో దుఃఖిస్తూ ఆవు కన్నయ్య వద్దకు చేరింది. కన్నయ్య తప్ప తనకు మరొక దిక్కు లేదని ఆవుకి తెలుసు.

కన్నయ్య నెమ్మదిగా ఆ ఆవు వద్దకు వెళ్ళి ఎంతో ప్రేమతో దాని వీపు నిమిరాడు. ఆ ఆవుకి అక్కడితో ఎంతో ధైర్యం వచ్చింది. కనుల వెంట కన్నీరు కొద్దిగా తగ్గింది. కన్నయ్య గోపబాలురులను ఇక్కడే ఈ రాయి వద్దనే ఉండమని చెప్పి, ఆలమందలన్నింటిని ముఖ్యంగా ఈ ఆవును చూస్తూ ఉండమని చెప్పి తాను అడవిలోకి వెళ్ళాడు.

అలా కొంచెం దూరం వెళ్ళిన కన్నయ్య ఒక్కసారి ఆవు రూపం ధరించాడు. ఆవు గట్టిగా అంబా అని అరవసాగింది. దట్టమైన అరణ్యం పాపం! ఆ దూడ ఎటుపోయిందో! ఇలా అంబా అంబా అంటూ ఆవు రూపంలో ఉన్న కన్నయ్య ముందుకు సాగుతున్నాడు.

అలా కొంతదూరం వెళ్ళేసరికి అక్కడ దూరం నుంచి ఎంతో దీనంగా అరుస్తున్న దూడ గొంతు వినపడింది. తల్లి కనబడక ఆ లేగ దూడ ఎంతో దీనంగా అరుస్తోంది. కన్నయ్య ఆ వైపు వెళ్ళాడు. కొంచెం దూరం వెళ్ళేసరికి ఆవు రూపంలో అంబా అంటున్న కన్నయ్య వద్దకు ఆ దూడ పరుగెత్తుకుంటూ వచ్చింది. ఒక్కసారిగా ఎంతో ఆనందపడింది. ఆవు రూపంలో ఉన్న కన్నయ్య ఆ దూడతో కలిసి అడవి బయటకు వచ్చాడు. ఆలమంద దగ్గరకు రాగానే తిరిగి కన్నయ్య తన రూపం ధరించాడు.

ఆ లేగదూడ పరుగెత్తుకుంటూ తన తల్లి దగ్గరకు వచ్చింది. తల్లి ఎంతో సంతోషపడింది. ఆ లేగదూడను నాలుకతో ప్రేమగా నాకింది.

ఆనందబాష్పాలు కార్చింది. కృష్ణయ్య తల్లీ, పిల్లను ప్రేమగా నిమిరాడు. కృష్ణయ్య స్నేహితులతో, ఆలమందలతో కలిసి అక్కడినుంచి బయలుదేరి చీకటి పడే వేళకు గోకులం చేరుకున్నారు. చూసారా! ఆ పురుషోత్తమునికి సమస్త జీవకోటి అంటే ఎంత ప్రేమనో! ఈ సృష్టిలో సమస్త ప్రాణికోటిని అత్యంత ప్రేమతో సాకేది ఆ గోవిందుడే! ఆ గోవిందుడి రక్షణలోనే సమస్త జీవులు సుఖంగా బ్రతకగలుగుతున్నాయి. మానవులే కాదు, సమస్త జీవకోటిని రక్షించే పరమ అనురాగమూర్తి ఆ గోవిందుడే!

# 3

కృష్ణుడి ఎంతో రమ్యమైన ఆటలతో గోకులం అంతా ఎంతో మురిసిపోతోంది. అసలు కన్నయ్య వచ్చిందే గోకులవాసులనందరినీ ఆనందింపచేయడం! కోసం వారిని తరింపచేయడం కోసం. గోపికలు సామాన్య మానవులు కారు. వారు మునుపటి జన్మలలో మహర్షులు, మహాపండితులు. ఆ శ్రీమన్నారాయణుడి సాన్నిహిత్యం కోరి ఈ జన్మలో ఇలా గోపికలుగా జన్మించారు. వారికి కన్నయ్యపై అపురూపమైన ప్రేమ, అనురాగం. అసలు ఇలా ఆ పురుషోత్తముని ప్రేమించడానికి, ఆరాధించడానికి, ఆ స్వామి లీలలతో అద్భుత ఆనందం పొందడానికి, ఆ స్వామి సాన్నిహిత్యంలో దివ్యానుభూతులు పొందడానికే కదా! వీరందరూ గోపకాంతలుగా జన్మించింది.

కృష్ణయ్య కూడా వారందరిని ఎప్పుడూ ఎంతో ఆనందంతో ముంచెత్తుతాడు. వారితో ఎన్ని విధాలుగా ఆడతాడో మాటలలో

వర్ణించలేము. కృష్ణయ్యకు తెలుసు తాను ఇక్కడ గోకులంలో ఎక్కువ కాలం ఉండబోను అని. అందుకే ఈ ఉన్న తక్కువ కాలంలోనే గోపికలందరికి అద్భుతమైన, అనిర్వచనీయమైన ప్రేమను పంచిపెట్టాలన్నదే కృష్ణయ్య కోరిక. అదికూడా ఎన్నెన్ని విధాలుగానో! కృష్ణయ్య అవతరించిన కారణాలలో వీరందరినీ అనుగ్రహించడం కూడా ముఖ్యమైనది.

గోకులంలో తనకోసం ఎంతో ముందుగా జన్మించి తన రాకకోసం వేయికన్నులతో ఎదురుచూస్తున్న గోపికలను ఆనందింపచేయడం మహర్షులకు తానిచ్చిన వరం. అలాగే తనను ఎంతో దివ్యకీర్తనలతో, దివ్యసాహిత్యంతో ఆరాధించినవారిని ఈ జన్మలో గోపికలుగా అనుగ్రహించి వారికి తమ సాన్నిహిత్యాన్ని తన అద్భుతమైన ప్రేమను వారికి పంచిపెట్టడం. కృష్ణయ్య గోపికలను మురిపించిన తీరు ఎంతో అద్భుతం. మూర్తిభవించిన ప్రేమతత్వమే మన కృష్ణయ్య కదా!

అలా ఒకనాడు గోపకాంతలతో ఆడడానికి ఉదయాన్నే కన్నయ్య ఇంటి నుంచి అటూ ఇటూ చిందులు వేస్తూ బయలుదేరాడు. ఆ రూపం చూడండి! ఎంత ముచ్చటగా ఉందో! కృష్ణయ్య కళ్ళు ఎంత లోతుగా మెరుస్తూ ఎంత ప్రేమతో నిండి ఉన్నాయో చూడండి! కృష్ణయ్య చేతులు ఎంతో సున్నితమై ఆ స్పర్శ తగిలిన వారికి అంతులేని ఆనందాన్ని కలుగజేస్తాయి. మరి సృష్టిలో ఆ పురుషోత్తముని కంటే ఆనందకరమైన స్పర్శ మరెవరిది ఉంటుంది?

ఆ దివ్య స్పర్శానుభూతిని అనుభవించిన గోపికలు ఎంత అదృష్టవంతులు? ఎంత భాగ్యవంతులు? ఈ విశ్వం మొత్తానికే ఆధారభూతుడైన వాడు అలా చిన్ని బాలుడిగా అటూ ఇటూ ఎగురుతూ ఆడుతూ ఉంటే ఆ దృశ్యం ఎంతో అద్భుతంగా ఉంటుంది. అదిగో! ఆ రోజు ఉదయాన్నే ఏదో కొత్త ఆటకు బయలుదేరిన ఆ కన్నయ్యను చూడండి! ఎంత హుషారుగా ఉన్నాడో! ఈ రోజు గోపికలను ఏవిధంగా రంజింపచేస్తాడో! ఏ విధమైన చేష్టలతో వారికి ముక్తిని అనుగ్రహిస్తాడో!

కృష్ణయ్య అలా ఎగురుతూ దూకుతూ ముందుకు నడుస్తున్నాడు. కన్నయ్య చేత్తో అలా వేణువును పట్టుకుని ముందుకు నడుస్తూ ఉంటే పక్కన చెట్లపై ఉన్న పక్షులు ఒక చెట్టు మీద నుంచి మరో చెట్టుపైకి ఎగురుతున్నాయి. కన్నయ్య అంటే వాటికి కూడా ఎంతో ప్రాణప్రదం. రోజుకు ఒక ముచ్చట చూపించే కన్నయ్య ఈ రోజు ఏంచేస్తాడా? అని ఆ పక్షులన్నీ ఆత్రంగా ఎదురుచూస్తున్నాయి. ఇంతలో కన్నయ్య ఎదురుగా ఇటే వస్తున్న గాజులు అమ్మే వ్యక్తి కనబడ్డాడు. కన్నయ్య అతనిని ఆపి ఇలా అన్నాడు స్వామీ! నీ దగ్గర ఏ ఏ రంగుల గాజులు ఉన్నాయి? అని అడిగాడు. అన్ని రంగుల గాజులు ఉన్నాయి, ఏమి అలా అడుగుతున్నావు? అన్నాడు.

అప్పుడు కన్నయ్య అతనితో అతడి సంచిలో చేయిపెట్టి చూసావా! నీ దగ్గర పచ్చరంగు గాజులు లేవు! అని అన్నాడు. అది చూసి ఆ గాజుల అబ్బాయి ఆశ్చర్యపోయాడు. ఇదేంటి? ఈ పిల్లాడు ఇలా అంటాడు! ఇందాక ఇంటినుంచి బయలుదేరేటప్పుడు అన్ని రంగుల గాజులు పెట్టుకున్నాను కదా! అని సంచిలోకి చూసాడు. ఆశ్చర్యంగా అందులో ఆకుపచ్చ రంగు గాజులు లేవు. అతడు ఆశ్చర్యపోతూ కన్నయ్యతో ఇదేమిటి స్వామీ! నేను అన్ని రంగుల గాజులు పెట్టుకున్నాను. ఇవి ఎలా మాయమయ్యాయి? అన్నాడు.

కన్నయ్య అతడి వంక నవ్వుతూ చూస్తూ అతడితో నువ్వు కొంచెం వెనక్కి వెళ్ళి నీ కుడిపక్కన కనబడే చెట్టు మొదట్లో చూడు. అక్కడ ఒక సంచిలో నీ ఆకుపచ్చ గాజుల సంచి కనిపిస్తుంది. ఆ మాటలు విన్న గాజుల అబ్బాయి ఆశ్చర్యపోయాడు. ఈ చిన్న పిల్లవాడు ఇలా అంటాడేమిటి? అయినా నేను వెనక్కి వెళ్ళడంలో నష్టం లేదు కదా! అనుకున్నాడు.

కన్నయ్య అతనితో నేను కూడా వస్తాను పద! అన్నాడు. గాజుల అబ్బాయి కన్నయ్యను చూసి ఎంతో ముచ్చటపడి నువ్వు అసలే చాలా ముచ్చటగా ఉన్నావు పద! వెళదాం అన్నాడు. కొంత దూరం వెళ్ళగానే కన్నయ్య చెప్పినట్లు గానే ఆ బాట పక్కగా ఒక చెట్టు కింద తన గాజుల సంచి కనపడింది. ఆ అబ్బాయికి తాను ఇక్కడ ఎలా పెట్టాడో అర్థంకాలేదు.

ఇదంతా కృష్ణమాయే కదా! ఆ కన్నయ్య ఎప్పుడు ఎవరిని ఎలా అనుగ్రహిస్తాడో! ఆ స్వామికే ఎరుక.

ఆ స్వామి ఎవరి ప్రారబ్ధ కర్మలను ఎలా, ఏ సమయంలో తొలగించాలో నిశ్చయించుకుని వారిని అలా అనుగ్రహిస్తాడు. ఆ స్వామికి సృష్టిలోని ప్రతి జీవి జన్మ జన్మల ప్రయాణం తెలుసుకదా! పూర్తి ధర్మపథంలో నడుస్తూ ఎన్నో పుణ్యకార్యాలు చేస్తూ, నిత్యం తననే స్మరిస్తూ, సర్వకార్య ఫలాన్ని ఎవరైతే తనకే ధారబోస్తూ ఉంటారో అటువంటి వారిని ఏదైనా జన్మలలో కర్మఫలంగా ఉండే ప్రారబ్ధాన్ని ఒక్కొక్కరిని ఒక్కొక్కవిధంగా అనుగ్రహిస్తూ పూర్తిగా తొలగిస్తాడు. ఈ రోజు ఈ గాజులబ్బాయిని అలాగే అనుగ్రహింపతలచాడు.

ఈనాడు ద్వాపరయుగంలో కనబడిన ఈ గాజులబ్బాయి మరెవరో కాదు! తాను త్రేతాయుగంలో శ్రీరామచంద్రునిగా అవతరించినప్పుడు చిన్నతనంలో తనకు గల అనేకమంది స్నేహితులలో విష్ణుశర్మ అనే స్నేహితుడు ఇతడే! అటు తరువాత అనేక జన్మలు ధరించి ఎన్నో పుణ్యకార్యాలు చేసి తిరిగి ఈ ద్వాపరయుగంలోకి కూడా ఇప్పటిదాకా అనేక జన్మలు ధరించి ఈ జన్మలో తిరిగి ఆ పురుషోత్తముని దగ్గరకే వచ్చాడు. మరి కన్నయ్య ఆనాటి తన చిన్ననాటి స్నేహితుని ముచ్చట తీర్చాలి కదా! అని ఏదైనా సహాయం చెయ్యాలి కదా! అందుకే ఈనాడు అతన్ని కలిసి అతని వద్ద ఉన్న గాజులన్నీ ఈ రోజే అమ్ముడుపోయేలా చెయ్యాలని తలచాడు.

కన్నయ్య అతడితో ఈ గాజులన్నీ అమ్మడానికి ఎన్నాళ్ళు పడుతుంది అని అడిగాడు. ఆ అబ్బాయి ఒకవారం పట్టొచ్చు నాన్నా! అన్నాడు. కన్నయ్య అతడితో నేను ఇవన్నీ ఈరోజే అమ్మేలా చెయ్యనా? అన్నాడు. అది విన్న అతడు ఆశ్చర్యపోయాడు. ఈ చిన్న పిల్లవాడేంటి? ఇలా అంటాడు. ఒక్కరోజులో ఇన్ని గాజులు ఎలా అమ్మగలుగుతాడు? అనుకుని కన్నయ్యతో ఏం నాయనా! నువ్వు నాకు సహాయం చేస్తావా? ఎలా చేస్తావు? నిజంగా ఈ గాజులన్నీ సాయంత్రానికల్లా అమ్మగలిగితే నీకు ఇష్టమైన పళ్ళు

కొనిస్తాను అన్నాడు. ఓ తప్పకుండా! నాకు జామపళ్ళు అంటే చాలా ఇష్టం మరి కొనిస్తావా! నాకే కాదు! నా స్నేహితులకు అందరికీ కూడా పళ్ళని కొనివ్వాలి అని అన్నాడు. అందుకు ఆ అబ్బాయి అంతకంటే సంతోషం ఏముంది నాయనా! గాజులన్నీ అయిపోవాలే కాని  మీ అందరికీ చక్కటి పళ్ళు కొనిస్తాను అని అన్నాడు.

కృష్ణుడు ఆ గాజులబ్బాయిని తీసుకుని ముందుకు కదిలాడు. ఆ అబ్బాయితో పద! మనం ముందుకు వెళదాం! నువ్వు నాతో పాటు రా! నీకు ఈ గాజులన్నీ అమ్మేలా సాయంచేస్తాను. ఎలా చేస్తానో చూడు! అని అన్నాడు. కన్నయ్య మనస్సులో ఏముందో మనందరికీ ఎలా తెలుస్తుంది?

చిన్ని కన్నయ్య ఆ రోజు గోపికలందరినీ ఎంతో ఆనందపరచాలని అనుకున్నాడు. అది కూడా తను త్రేతాయుగంలో మాట ఇచ్చిన ప్రకారంగా గోకులంలో బృందావనంలో, ఉన్నంత కాలం గోపికలందరినీ ఒక్కొక్కరోజు ఒక్కొక్క ముచ్చటతో ఆనందపరుస్తూ... వారి ఆనందాలన్నీ తీర్చటమే తన కర్తవ్యం. అందుకే ఈ రోజు వారందరికీ ఇంకొక అద్భుతమైన లీల చేసి వారందరినీ సంతోషంలో ముంచెత్తాలనుకున్నాడు.

ఆ గాజులబ్బాయితో పద! నాయనా! ముందుకు వెళదాం! పద! అంటూ వెళ్ళి దగ్గరలో ఉన్న ఒక గోపిక ఇంటికి వెళ్ళి తలుపు కొట్టాడు. అక్కడ ఉన్నది లలిత అనే గోపిక. లలిత తలుపు తీయగానే చిరునవ్వుతో కన్నయ్య కనబడ్డాడు. ఏం కన్నయ్యా! ఉదయాన్నే వచ్చావు ఏమిటి విశేషం? అంటూ సంతోష పడుతూ వచ్చింది. నీతో ఎవరినో తీసుకువచ్చావే అంది.

అతడు ఆ గాజుల అబ్బాయే! కన్నయ్య లలితతో నీకు నేను ఈరోజు గాజులు కొనిపెడతాను అని అన్నాడు. లలిత చాలా నవ్వుకుంది. ఎంతో మురిసిపోతూ నువ్వేమిటి తండ్రీ! నాకు గాజులు కొనిపెట్టడం! నీదగ్గర డబ్బులున్నాయా? అని అడిగింది. కన్నయ్య చిరునవ్వు నవ్వుతూ డబ్బు నువ్వే ఇచ్చి కొనుక్కోవాలి నీ చేతులకు గాజులు మాత్రం నేనే వేస్తాను అన్నాడు.

అప్పుడు లలిత ఇంతకంటే అదృష్టం ఏముంటుంది కన్నా అని అంది. కన్నయ్య నీకు ఏ గాజులు పడతాయో నీకు ఏ రంగు బాగుంటుందో నేను ఇస్తాను ఇలా రా! అన్నాడు. లలిత కన్నయ్యకంటే వయస్సులో ఎంతో పెద్దది. కన్నయ్యను చూస్తే ఎంతో ముచ్చట లలితకి. గోపికలందరికీ కూడా కన్నయ్య అంటే ఎంతో ఇష్టం ఇంతలో లలిత వచ్చి ఎదురుగా కూర్చుంది. కన్నయ్య గాజులబ్బాయిని తన పక్కనే కూర్చోమని అన్నాడు. గాజులబ్బాయి తన సంచి ముందుకు పెట్టుకుని ఇదంతా ఆశ్చర్యంగా చూస్తూ కూర్చున్నాడు.

అప్పుడు కన్నయ్య గాజులబ్బాయి సంచిలోకి చేయిపెట్టి కొన్ని ఆకుపచ్చ రంగు గాజులు కొన్ని పసుపు పచ్చ రంగు గాజులు తీసి ఇవిగో ఇవి వేసుకో! నీకు చాలా బాగుంటాయి అని అన్నాడు. లలిత ఎంతో ముచ్చటగా కన్నయ్య ముఖంలోకి చూస్తూ అవి తీసుకోబోతుంటే కన్నయ్య లలిత ముఖంలోకి కొంటెగా చూస్తూ అలా ఎలాగ నీచేతికి నేనే వెయ్యాలి! కదా అని చెప్పి ఆ గోపిక చేతిని తనచేతిలోకి తీసుకుని ఆ గాజులు తొడిగాడు.

కన్నయ్య చిరునవ్వుతో లలితతో ఈ గాజులు నచ్చాయా? అన్నాడు. లలిత ఆశ్చర్యపోయింది! ఎందుకంటే తనకు ఆ రంగు గాజులంటేనే చాలా ఇష్టం. కన్నయ్యకు ఈ విషయం ఎలా తెలిసింది? అని ఎంతో ఆశ్చర్యపడింది! కన్నయ్య ఎంతో మురిపెంగా లలిత చేతులు పట్టుకుని గాజులు తొడుగుతుంటే ఆ గోపిక స్మృతులలో ఎన్నో యుగాల వెనక్కి వెళ్ళిపోయింది. ఆనాడు తనని ఒక విష్ణుమాయ కప్పేసి ఆనాడు త్రేతాయుగంలో శ్రీరామచంద్రునిగా తనకిచ్చిన వరం గుర్తుకు వచ్చింది. ఎంతో ఆనందపరవశురాలయింది. కృష్ణ స్పర్శకు గోపిక ఎంతో ఆనందపడింది. ఆ గాజుల ఖరీదు ఎంతో ఆ అబ్బాయిని అడిగి అతడికి ఇచ్చింది. ఆ గాజులబ్బాయి ఆ డబ్బును తీసుకుని తన సంచిలో వేసుకోగానే కన్నయ్య అతడిని పద! పద! ఇంకో ఇంటికి వెళదాం! అన్నాడు. లలిత వంక చిరునవ్వుతో చూసి మరో ఇంటికి బయలుదేరాడు.

ప్రక్కనే రెండు ఇళ్ళ అవతలే గీతిక ఇల్లు ఉంది. గీతిక ఇంటికి వెళ్ళి గాజులబ్బాయిని నువ్వు దూరంగా ఉండు స్వామీ! అన్నాడు. తాను ఒక్కడూ ముందుకు వెళ్ళి గీతిక ఇంటి తలుపు మెల్లగా కొట్టాడు. తలుపుతీసిన గీతిక ఏంటి కృష్ణా! ఇంత ప్రొద్దున్నే వచ్చావు. మా ఇంట్లో వెన్నంతా తినడానికే వచ్చావు కదా! అని అంది. అయ్యో లేదు! లేదు! నీకు మంచి గాజులు తీసుకువచ్చాను తీసుకుంటావా? అన్నాడు.

నువ్వు గాజులు తీసుకురావడం ఏమిటి కృష్ణా! నీకు గాజులు ఎక్కడినుంచి వచ్చాయి? అని అడిగింది. లేదు అదిగో! అటు చూడు ఈ రోజు మన ఊరిలోకి గాజులు అమ్మే అతను వచ్చాడు. నీకోసమే అతనిని తీసుకువచ్చాను. మరి గాజులు తీసుకుంటావా? అని అన్నాడు. ఓ తప్పకుండా కృష్ణా! అంది.

కన్నయ్య ఆ గాజుల అబ్బాయిని దగ్గరకు పిలిచి గీతిక ఎదురుగా కూర్చోపెట్టాడు. గాజులబ్బాయి గీతికతో నీకు ఏ రంగు గాజులు ఇష్టమమ్మా అన్నాడు. గీతిక సమాధానం చెప్పబోతుంటే కన్నయ్య గీతికని మాట్లాడనివ్వకుండా ఉండు! ఉండు! నేను చెప్తాను నీకు ఏ రంగు గాజులు బాగుంటాయో నేను ఇస్తాను అన్నాడు. అది విని గీతిక ఎంతో ముచ్చటపడి అలాగే అని ఇంత చిన్న పిల్లవాడు ఈ కొంటె కన్నయ్యకు రోజూ వచ్చి వెన్న దొంగిలించి వెళ్ళడమే తప్ప తనకి ఏ రంగు గాజులు ఇష్టమో? ఎలా తెలుస్తుందిలే! అని మనస్సులో అనుకుంది.

కన్నయ్య గాజుల సంచిలో చేయిపెట్టి కళ్ళు మూసుకుని ఒక రెండు జతల గాజులు బయటకు తీసాడు. ఒకటి ఎరుపు రంగు మరొకటి నీలం రంగు గీతికతో నేనే నీ చేతికి ఈ గాజులు వేస్తాను. నువ్వు చేతులు ముందుకి పెట్టు అన్నాడు.

గీతిక ఎంతో ముచ్చటపడుతూ తన చేతులు ముందుకు చాచింది. కన్నయ్య గీతిక చేతిని పట్టుకుని ఆ నీలం, ఎరుపురంగు గాజులు వేసాడు. ఆ

రంగులే గీతికకు ఇష్టం. అలా గీతిక చేతులకు గాజులు వేస్తున్న ఆ కన్నయ్యను చూడండి! ఎంత ముద్దుగా ఉన్నాడో! తలకి ఒక రిబ్బనులాంటి రంగు గుడ్డని చుట్టుకొని అందులో పింఛం దోపుకుని కొంచెం ముందుకు వంగి గీతిక చేతిని పట్టుకుని ఎంత ముచ్చటగా గాజులు వేస్తున్నాడో!

గీతిక ఎంతో మురిసిపోయి నువ్వు వేసిన ఈ గాజులు నాకు ఎంతో అపురూపం కన్నయ్యా! ఇన్నాళ్ళు నువ్వు మాతో అల్లరి ఆటలు ఆడటమే చూసాం కానీ! ఈ విధంగా మా మనస్సులో ఏముందో, ఏ రంగులు నచ్చుతాయో? ఆ గాజులే ఇచ్చావే! వీటిని ఎంతో అపురూపంగా దాచుకుంటాము అంది గీతిక. గాజులబ్బాయిని గాజుల ధర అడిగి ఇచ్చివేసింది. లోపటికి వెళ్ళి ఇంత వెన్న తెచ్చి కన్నయ్యకు ఇచ్చింది.

ఇదంతా చూసిన ఆ గాజులబ్బాయి ఎంతో ఆశ్చర్యపోయాడు! ఈ చిన్న పిల్లవాడు వారికి నచ్చిన గాజులే తాను ఎలా తీయగలుగుతున్నాడు? అని ఆశ్చర్యపోయాడు. ఈ పిల్లవాడు సామాన్యుడు కాదు! అని మనస్సులో ఎంతో ఆశ్చర్యపోయాడు. కన్నయ్య గీతికతో ఇక వస్తాను అని బయలుదేరి గాజులబ్బాయితో కలిసి బయటకు వచ్చాడు. అక్కడ వారికి కన్నయ్య స్నేహితులు ఇద్దరు కనబడ్డారు. కన్నయ్య వారిద్దరిని తనతో రమ్మన్నాడు.

గాజులబ్బాయిని తీసుకుని కొంచెం ముందుకు వెళ్ళి కుడివైపున ఉన్న స్నేహిత ఇంటి వద్దకు వెళ్ళాడు. కన్నయ్య గాజులబ్బాయితో కొంచెం దూరంగా నుంచొని స్నేహితున్ని ముందుగా తలుపు కొట్టమని చెప్పాడు. ఆ పిల్లవాడు స్నేహిత తలుపు గట్టిగా కొట్టాడు. ఏదో పనిలో ఉన్న స్నేహిత పరుగెత్తుకుంటూ వచ్చి తలుపు తీసి బయట ఉన్న పిల్లవాడిని చూసి ఏం నాయనా! పొద్దున్నే వచ్చావు, మీ కన్నయ్య కూడా వచ్చాడా? మళ్ళీ వెన్న దొంగిలించడానికే వచ్చారా? అయినా తలుపు ఎందుకు కొట్టావు? రోజూ మీరందరూ వెనకి నుంచి వచ్చి వెన్న దొంగిలించుకొని వెళతారు కదా! అని ఆ పిల్లవాడిని గట్టిగా అంది. లేదు! లేదు! లేదమ్మా! కన్నయ్య ఇక్కడే ఉన్నాడు. కన్నయ్యకు నీతో ఏదో పని ఉందట.

కన్నయ్యకు నాతో పనా! మీ కన్నయ్యకు వెన్న దొంగిలించడం అల్లరి చేయడం తప్ప నాతో పని ఏముంటుంది అని అరిచింది. అప్పుడు కన్నయ్య పరుగెత్తుకుంటూ ముందుకు వచ్చి దూరంగా ఉన్న గాజులబ్బాయిని పిలిచాడు. ఈ రోజు నీకు మంచి గాజులిస్తాను అని అన్నాడు. దానికి స్నేహిత ఎంతో ముచ్చటపడి ఓ తప్పకుండా తీసుకుంటాను అని తనకు రెండు రంగులంటే చాలా ఇష్టం అవి ఈ అబ్బాయి దగ్గర ఉంటాయో? లేవో? అనుకుంది. కన్నయ్య నీకు ఏ రంగులు కావాలో నాకు తెలుసు కదా! అవే ఇస్తాను అన్నాడు. నేను వేసుకునే గాజులు నీకెలా తెలుసు? అని అంది స్నేహిత.

ఇదంతా చూసిన గాజులబ్బాయి ఎంతో మురిసిపోతున్నాడు. ఎందుకంటే ఇంతకుముందు రెండు ఇళ్ళల్లో జరిగినవి చూసాడు కదా! కన్నయ్య వెంటనే స్నేహితను ఆగమని చెప్పి ఏవి నీ చేతులు ముందుకి పెట్టు అన్నాడు. గాజులబ్బాయి సంచిలో తానే చేయిపెట్టి రెండుజతల గాజులు తీసి స్నేహిత చేతులకు వేసాడు. స్నేహిత చేతులు కొంచెం ముచ్చటతో అటూ ఇటూ ఊపింది. కన్నయ్య తన తల అడ్డంగా ఊపుతూ ఇలా కదిలితే కుదరదు అన్నాడు. అలా ఊపుతున్నప్పుడు కన్నయ్య తలలోని పింఛం ఎగిరి స్నేహిత గుండెలపై పడింది.

కన్నయ్య నా పింఛం ఇవ్వు అన్నాడు. కన్నయ్యా! నువ్వు నాకు గాజులు వేశావు కదా! నీ పింఛం నీకు నేనే పెడతాను అంటూ కన్నయ్య తలలో ఎంతో మధురానుభూతి పొందుతూ ఆ పింఛాన్ని పెట్టింది. స్నేహిత ఈ రంగుల గాజుల కోసమే వెతుకుతూ ఉంది. గోకులంలో జరిగే అనేక ఉత్సవాలలో కూడా ఈ రంగుల గాజులు ఎప్పుడూ కనబడలేదు ఈ రోజు ఎలా దొరికాయా? అని ఆశ్చర్యపోయింది.

గాజులబ్బాయి మనస్సులో ఇలా అనుకున్నాడు. ఈ పిల్లవాడు సామాన్యుడు కాదు సుమా! ఒక్కొక్క ఇంటిలోకి వచ్చి అసలు గాజుల వంక చూడకుండా అతడు సంచిలో చేయిపెట్టి అవతలివారికి నచ్చిన రంగులే

తీస్తున్నాడు. ఎంత అద్భుతం! అనుకున్నాడు. స్నేహిత లోపలికి వెళ్ళి ఇంత వెన్న తెచ్చి కన్నయ్యకి కన్నయ్య స్నేహితులకు పెట్టింది. కన్నయ్య తన చేతులకు వేసిన గాజులను ఎంతో ఆరాధనతో కళ్ళకు అద్దుకుని ఆనందబాష్పాలు కార్చింది.

గాజులబ్బాయి స్నేహితతో అమ్మా! ఇదేదో ప్రసాదంలా ఉంది నాక్కూడా కాస్త ఇవ్వవూ... అన్నాడు. అయ్యో! తప్పకుండా ఇస్తా నాయనా! ఈ రోజు నాకు ఎంత అదృష్టం ఎన్నో రోజుల నుండి వెతుకుతున్న ఈ రంగుల గాజులు ఈనాడు దొరికాయి. మా కన్నయ్య సామాన్యుడు కాదు చూసావా! అని చక్కగా లోపలకి వెళ్ళి మరింత వెన్న తెచ్చి ఆ గాజులబ్బాయికి ఇచ్చింది.

ఆ గాజులబ్బాయి ఆ వెన్నను మహాప్రసాదంలా భావించి కళ్ళకు అద్దుకుని నోట్లో వేసుకున్నాడు. ఆ వెన్న నాలికకు తగలగానే ఆ గాజులబ్బాయికి ఒళ్ళంతా ఏదో తేజస్సు ప్రవహించినట్టు అయ్యింది. ఇదంతా ఆ కృష్ణయ్య మాయే కదా! కన్నయ్యకు మనమంటే ఎంతో ప్రీతి! ఎంతో ప్రేమ! కన్నయ్య మీద భక్తి పెట్టుకున్నవారిని ఎన్నో విధాలా సంతోషపెడుతుంటాడు.

అలా ఆరోజు కన్నయ్య ఒకరింటి నుంచి మరొకరింటికి వెళుతుంటే రోడ్డుమీద రెండు లేళ్ళు అటూ ఇటూ పరుగెడుతున్నాయి. ఇంకో రెండు కుందేళ్ళు పక్కనే ఉన్న పొదల వైపు పరుగెడుతున్నాయి. ఎంత ముచ్చటగా ఉందో! ఆ దృశ్యం ఎంత బాగుందో చూడండి! ఇంతలో ఆ వార్త ఆనోట ఈనోట గోకులం అంతా వ్యాపించి గోపికలందరూ ఎప్పుడెప్పుడు ఆ గాజులబ్బాయిని తీసుకువస్తాడా! తాము గాజులు వేయించుకుందామని ఎదురుచూస్తున్నారు.

ఇంతలో ఆ కన్నయ్య పక్కనే ఉన్న జలజ ఇంటికి వెళ్ళాడు. ఇందాకటి లాగే ఇక్కడ కూడా జలజకి ఎంతో ఇష్టమైన ఊదా రంగు, నారింజ రంగు గాజులు వేసాడు. ఇంతలో అక్కడకి పక్కనే ఉన్న నలుగురు గోపికలు

అక్కడకి వచ్చారు. వారందరికీ కూడా కన్నయ్య వారి వారికి ఏ రంగు గాజులు ఇష్టమో! అవే తీసి వేసాడు. ఇంతలో యశోదమ్మ అక్కడకి వచ్చింది. ఏంటి కన్నా! అందరికీ గాజులు వేస్తున్నావు నువ్వు అని అంది. మరి నాకు కూడా వేస్తావా? అని అంది. అయ్యో! తప్పకుండా అమ్మా! అన్నాడు.

ఈ మాటలు విన్న గాజులబ్బాయి కన్నయ్య వంక సంశయంతో చూసాడు. కన్నయ్య చెవి దగ్గర నెమ్మదిగా బాబూ మన సంచిలోని గాజులన్నీ అయిపోయాయి అని అన్నాడు. ఇంతలో ఈ మాటలు యశోదమ్మకు వినబడ్డాయి. ఏం కన్నయ్యా! నాకు లేవా ఇంతకీ! అంది. అయ్యో! లేదమ్మా! ఈ అబ్బాయి సరిగ్గా చూసుండడు అని ఆ గాజులబ్బాయితో ఏది ఈ సంచి ఇలా ఇవ్వు అన్నాడు.

కన్నయ్య ఆ సంచిలో చేయిపెట్టి గాజులబ్బాయి వంక చిరునవ్వు నవ్వి లోపల చేతిని అటూ ఇటూ ఊపుతుంటే లోపలనుంచి గాజుల శబ్దం గలగలమని వినపడింది. గాజులబ్బాయి నోట మాటరాలేదు. ఇదేమిటి ఇంత ఆశ్చర్యం? సంచిలో ఒక్క గాజుకూడా లేదు కదా! ఈ పిల్లవాడికి ఎలా దొరికాయి అనుకున్నాడు. సంచిలోంచి బయటకు తీసిన గాజులు కన్నయ్య రెండు చేతులతో వెనక్కి పెట్టుకుని యశోదమ్మతో అమ్మా! నీకు ఏ రంగు గాజులు ఇష్టం చెప్పు అన్నాడు. యశోదమ్మ కన్నయ్యతో నాకు బంగారు రంగు, నారింజ రంగు చాలా ఇష్టం నాయనా! అన్నది. వెంటనే చేతులు ముందుకు చూపి ఇవిగో అమ్మా! అని అన్నాడు. వెంటనే యశోదమ్మ ఆశ్చర్యంతో ఆనందంతో కంట నీరు కారింది.

కన్నయ్య మిగిలిన వారికి వేసినట్లుగానే యశోదమ్మకు కూడా చేతులు పట్టుకుని తానే గాజులు వేసాడు. యశోద ఎంతో ఆనందపడింది. అక్కడ ఉన్న మిగిలిన గోపికలందరూ సంతోషంతో కబుర్లు చెప్పుకుంటున్నారు. యశోదమ్మా! మీ పిల్లవాడు సామాన్యుడు కాదమ్మా! అన్నారు. కన్నయ్య అమ్మతో ఇదిగో ఇప్పుడే వస్తాను అమ్మా! అని చెప్పి ఆ గాజులబ్బాయిని తీసుకుని తన స్నేహితులతో కలిసి బయటకు వచ్చాడు.

గాజులబ్బాయి కన్నయ్యకు ఇచ్చిన మాట ప్రకారం కన్నయ్యకు, స్నేహితులందరికి మంచి జామపళ్ళు కొనిచ్చాడు. అలా ఆనాడు కన్నయ్య ఆ గాజులబ్బాయి ముచ్చట తీర్చి ఆ విధంగా అనుగ్రహించాడు. అతడి ఎన్నో జన్మల ప్రారబ్ధ కర్మలు ఒక్కరోజులో నశించాయి. శ్రీకృష్ణ లీలలు ఎంతో అద్భుతంగా ఉంటాయి. తననే నమ్మినవారు, ఎటువంటి కల్మషం లేని హృదయంతో తనని ప్రేమించేవారిని తనను ఆరాధించేవారిని కన్నయ్య ఎన్నో అద్భుత రీతులలో అనుగ్రహిస్తుంటాడు. అలా అనుగ్రహం పొందినవారి ఆనందం మాటలలో వర్ణించలేము కదా!

# 4

ద్వాపరయుగంలో కృష్ణునిగా జన్మించిన శ్రీమన్నారాయణులవారు ఈ అవతారకాలంలో ఎన్నో అద్భుత లీలలను చేసారు. అసలు ఆ స్వామి వచ్చిందే దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం అయితే ఇక్కడ శిష్ట రక్షణ అంటే కేవలం ధర్మంగా ఉన్నవారిని, తన భక్తులను రక్షించడమే కాదు, వారిని ఆపదలనుంచి కాపాడడం మాత్రమే కాదు వారిని ఆనందపరచడం కూడా! మిగిలిన అవతారాలకి కృష్ణావతారానికి ఇది చాలా విశేషం. కృష్ణావతారంలో తాను అవతారం ఎత్తిన కారణాలలో తన భక్తులను ఎన్నో విధాలా ఆనందపరచడానికి, ఎంతో ప్రేమించడానికి, వారికి ఎన్నో రకాల ముచ్చట్లు తీర్చడానికి కూడా! అది కూడా ఒక్కొక్క భక్తుని ముచ్చట ఒక్కొక్క విధంగా ఉంటుంది. చిన్నతనం నుంచి ఎందరో రాక్షసులను చంపడమే కాదు తనకోసం ఎన్నో లక్షల జన్మల నుంచి ఎదురు చూస్తున్న జీవులను ఈ ద్వాపరయుగంలో తాను కృష్ణుడిగా జన్మించినప్పుడు తన వద్దకు వచ్చేలా, తనను దర్శించేలాగా, అనేక ముచ్చట్లు తీర్చేలా అనుగ్రహించాడు.

శ్రీకృష్ణావతార సమయంలో ఈ భూమిపై అనేక దేశాలలో కోట్ల సంఖ్యలో ప్రజలు ఉన్నారు. అయితే ఇన్ని జీవులలో కృష్ణుని జీవన కాలంలో దర్శించినవారు కొన్ని లక్షలు మాత్రమే. మళ్ళీ వీరిలో తాను సాన్నిహిత్యంగా ఉండి ఒక గంట నుంచి సంవత్సరాల కాలం కృష్ణయ్యతో గడిపిన వారు కొన్ని వేలమంది ఉన్నారు.

ఈ జీవులందరూ ద్వాపరయుగంలో కృష్ణుడు జన్మించి నడయాడిన కాలంలో అనేక వృత్తులలో జీవనం సాగిస్తూ వివిధ రకాల జీవన విధానాలలో జీవిస్తూ ఆ స్వామి అనుగ్రహంతో వారి వారి భక్తిని అనుసరించి కొందరు కొన్ని రోజులు సాన్నిహిత్యంగా ఉంటే మరికొందరు కొన్ని సంవత్సరాల పాటు కృష్ణయ్యతో ఎంతో సన్నిహితంగా మెలిగారు.

కొందరు గోకులంలో గోపికలు గానూ, యాదవుల గానూ జన్మిస్తే మరికొందరు పక్కన ఉన్న దేశాలలో రాజులుగా, మంత్రులుగా, సైనికులుగా, సామాన్య పౌరులుగా ఇలా రకరకాలుగా ఉన్నారు. వీరు ఆ కన్నయ్య ఈ భూమి మీద సంచరించిన కాలంలో ఏదో ఒకనాడు కలిసి తమ ఆత్మ అద్భుత ఆనందాన్ని పొందడం అనుభవించినవారు. ఆ కన్నయ్య గోకులంలోను, బృందావనంలోను ఉన్న పన్నెండు సంవత్సరాల కాలంలో అప్పుడప్పుడు ఏదో విధంగా కలిసినవారే! ఆ పురుషోత్తమునికి ఎవరెవరి ముచ్చట్లు ఎలా తీర్చాలో! బాగా తెలుసు. వారందరి ముచ్చట్లు అలాగే తీర్చేవాడు.

సాక్షాత్తూ శ్రీమన్నారాయణులతో సాన్నిహిత్యం అంటే అది కేవలం ఒక గంటైనా ఎంతటి మహాభాగ్యం! శ్రీకృష్ణుడు మధురకు వెళ్ళిన తరువాత నుంచి అవతార సమాప్తి దాకా కూడా అటువంటి పుణ్యజీవులు ఎందరో కృష్ణయ్యను కలిసారు. అలా కలిసిన వారు వారి వారి జన్మ జన్మల సంస్కారాలను బట్టి వారికి ఆ స్వామిపై గల అపార భక్తిని బట్టి ప్రస్తుత కలియుగంలో కూడా వివిధ కాలాలలో కృష్ణ భక్తులుగా జన్మించి ఈ ప్రపంచానికి ఎన్నో రకాలుగా ఎంతో గొప్ప సేవ చేసారు, చేస్తున్నారు ముందు కాలాలలో చేస్తారు కూడా!

అందుకే శ్రీకృష్ణావతారంలో చిన్నతనంలో గోకులంలోను, బృందావనంలోను కన్నయ్య ప్రతీ రోజు ఎన్నో అద్భుత లీలలు చేసేవాడు. ఎందరినో ఆ స్వామి ఎన్నో విధాలా అనుగ్రహించాడు. ప్రతిరోజూ అందరి ముచ్చట్లు తీరుస్తున్నాడు. ఇదంతా ఆ స్వామి ముందే నిర్ణయించుకున్నదే!

అలాగే కృష్ణయ్య కూడా ఒక్కోరోజు ఒక్కోక్క రంగుల గుడ్డలు తలకు చుట్టుకునేవాడు. ఒకొక్కసారి అందరూ ఆశ్చర్యపోయేలాగా ఆటలు ఆడేవాడు. ఇవన్నీ తన సాన్నిహిత్యం కోసం జన్మించిన వారి ముచ్చట్లు తీర్చడానికే ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి. ఆనాడు ఆ స్వామి అలా ప్రత్యక్షంగా తన భక్తుల ముచ్చట్లు తీరిస్తే ఇప్పటి కాలంలో కూడా ఆ స్వామి తన భక్తులను అనేక విధాలా అనుగ్రహిస్తున్నాడు.

విశేషం ఏమిటంటే ఇప్పటి కలికాలంలో కూడా తనను అమితంగా, ఎటువంటి కల్మషాలు లేకుండా ఆరాధించేవారికి బాలకృష్ణుడిగా, వేణువు ఊదుతున్నవాడిగా, వెన్నముద్దలు తింటున్నవాడిగా తలపై ఎన్నో పింఛాలు ధరించి ఇలా ఎన్నో రూపాలలో తన భక్తులకు దర్శనమిస్తున్నాడు. వారిని ఆనంద పారవశ్యంలో ముంచెత్తుతున్నాడు.

ఆ రోజు కృష్ణయ్య అలా ఉదయాన్నే బయలుదేరి అటూ ఇటూ తిరుగుతూ ఊరి బయటకు చేరుకున్నాడు. అసలు ఆ ప్రదేశం ఎంత బాగుందో చూడండి! చుట్టూ అనేక రకాల పూల మొక్కలు, ఫల వృక్షాలు, ఎన్నో తోటలు, దూరంగా ఎన్నో కొండలు అక్కడక్కడ సెలయేళ్ళు... ఎంత అద్భుతంగా ఉందో ఆ దృశ్యం! అక్కడ పచ్చికబయిళ్ళలో రోజూ కన్నయ్య స్నేహితులతో ఒకరోజు మధ్యాహ్నం వరకు ఒకరోజు సాయంత్రం దాకా ఆడుకుని ఇంటికి వెళ్ళేవాడు.

ఆ రోజు అలా బయటకు వచ్చిన కన్నయ్య మురళిని చేత్తో పట్టుకుని స్నేహితులతో ఈ రోజు మనం ఆ చెట్లపై ఒక చెట్టు నుంచి మరొక చెట్టుపై ఎగురుతూ ఆడుకుందాము సరేనా! అన్నాడు. స్నేహితులు

సంతోషంగా సరే అన్నారు. ఆరోజు కన్నయ్య తనతోపాటు ఇరవై రంగు రంగుల గుడ్డలు తెచ్చాడు. తన స్నేహితులందరిని దగ్గరకు పిలిచి ఒక్కొక్కరికి ఒక్కొక్కటి తానే తలకు చుట్టాడు! ఆహా! అలా రంగు రంగుల గుడ్డలు చుట్టుకున్న ఆ గోపబాలురని చూడండి ఎంత ముచ్చటగా ఉన్నారో!

కొందరు గుండ్రటి కళ్ళతో, కొందరు గుండ్రటి ముఖాలతో, కొందరు కోల ముఖాలతో, కొందరు చిలిపిగా, మరికొందరు కొంటెగా నవ్వుతూ ఎంత ముచ్చటగా ఉన్నారో! ఆ పిల్లలు. ఆ పిల్లల నవ్వుల్లో ఎంతటి అమాయకత్వం ఉందో చూడండి! అందునా వారందరూ అనేక వేల జన్మలలో ఆ పురుషోత్తముని ప్రియభక్తులే కదా! అందుకే వారి ముఖాలలో అంతటి స్వచ్ఛత, అంతటి నిర్మలత్వం!

అలా అందరూ కలిసి ఆ చెట్లవద్దకు వచ్చారు. అదంతా ఒక పెద్ద తోట. అక్కడ అనేక రకాల చెట్లు ఉన్నాయి. కృష్ణయ్య మురళిని చేత్తో అటూ ఇటూ ఊపుతూ ముందుకు పరుగెత్తి ఒక చెట్టు గబగబా ఎక్కి ఒక కొమ్మపై కూర్చొని ఊపుతున్నాడు. ఇంతలో ఒక స్నేహితుడు వచ్చి పక్క కొమ్మపై కూర్చున్నాడు. మిగిలిన పిల్లలందరూ కూడా కేరింతలు కొడుతూ అటూ ఇటూ పరుగెడుతూ పక్కన ఉన్న చెట్లు ఎక్కారు. చెట్టు ఎక్కి కొమ్మలపై ఊగుతున్నారు. కన్నయ్యతో కలిసి ఈ పిల్లలందరూ ఈ చెట్ల కొమ్మలను అలా ఊపుతూ ఉంటే ఆ పక్క చెట్లపై గల కోతులకు ఎంతో ముచ్చటగా ఉంది. అవి వీరిని చూసి ఆనందపడి తన్మయత్వంతో ఒక కొమ్మపైనుండి మరొక కొమ్మ మీదకు దూకుతున్నాయి. వాటిని చూసిన ఈ గొల్ల పిల్లలకు ఆనందం మరీ ఎక్కువైంది. వారు కూడా ఒక కొమ్మ మీద నుంచి మరొక కొమ్మ మీదకు దూక సాగారు.

ఇంతలో ఒక కొమ్మమీద ఒక పెద్ద పాము పాకుతూ ఈ పిల్లల వైపు రాసాగింది. పక్కన చెట్లపై ఉన్న కోతులు ఈ పామును చూసి గట్టిగా అరవసాగాయి. పాము వస్తున్న ఈ కొమ్మపై ఇద్దరు పిల్లలు కూర్చున్నారు. వారి వైపే జర జరా పాకుతూ వేగంగా వస్తున్న ఆ పాముని చూసి ఎంతో

భయపడ్డారు. అన్నా! అంటూ గట్టిగా అరిచారు. అంతే! వెంటనే కృష్ణయ్య తాను ఉన్న చెట్టు మీద నుంచి ఒక్కసారిగా ఎగిరి ఈ చెట్టుమీద పిల్లలు కూర్చున్న పక్క కొమ్మపై దూకాడు. కన్నయ్య అప్పుడు దాదాపు నాలుగు చెట్ల అవతల ఉన్నాడు. ఈ పిల్లల అరుపులతో కన్నయ్య వాయు వేగంతో ఒక చెట్టు మీదనుంచి ఇంకో చెట్టుమీదకు దూకుతుంటే తలపై ఉన్న పింఛం అటూ ఇటూ ఎగురుతూ ఉంటే ఎంత అద్భుతంగా ఉంది ఆ దృశ్యం!

ఇలా ఈ కొమ్మ మీదకి ఒక్కసారిగా దూకిన కన్నయ్య ఒక చేత్తో కొమ్మను పట్టుకొని ముందుకు వంగి వేలాడుతూ పక్క కొమ్మపై ఉన్న ఆ పాముని చేత్తో పట్టుకుని గట్టిగా లాగి దూరంగా విసిరేసాడు. పిల్లలు ఇద్దరూ ఎంతో సంతోషపడ్డారు. తమ స్నేహితుడు తమని ఎప్పుడూ ఇలా కాపాడుతూ ఉంటాడని వారికి బాగా తెలుసు. వారితో ఆటలు ఆడడమే కాదు, వారిని ఎప్పుడూ కంటికి రెప్పలా కాపాడుకుంటాడు కన్నయ్య. ఈ దృశ్యం చూసిన కోతులు కూడా  ఆనందంతో కీచు కీచుమని అరిచాయి.

పిల్లలు మళ్ళీ వాళ్ళ ఆటలో లీనమయ్యారు. అందరూ ఆ చెట్ల కొమ్మలపై దూకుతుంటే వాళ్ళలో కొందరి కాళ్ళకు ఉన్న గజ్జెలు అద్భుతమైన ధ్వనులు చేసాయి. ఆ ధ్వనులు వినడానికి కూడా ఎంతో ఆనందకరంగా ఉంది. ఈ పిల్లలు ఇలా ఆడటం చూసి కింద నెమళ్ళు నృత్యం చేస్తున్నాయి. కన్నయ్య వారిని ఆటపట్టిస్తూ కొమ్మల మీద నుంచి దూకుతున్నాడు. అప్పుడే సన్నటి తుంపర మొదలయింది. అక్కడితో ఈ పిల్లల ఆనందం మరీ రెట్టింపయింది. కొంచెంగా తడుస్తూ ఇంకా ముచ్చటపడి ఆ చెట్ల కొమ్మలపై అటూ ఇటూ దూకసాగారు.

వారందరూ ఇలా ఆడుతుండగా ఒక పిల్ల వాడు ఉన్నట్టుండి చెట్టుపైనుండి క్రింద పడ్డాడు. అంతే అందరికీ భయం వేసింది. క్రింద పడ్డ ఆ పిల్లవాడు ఒక్కసారిగా స్పృహతప్పిపోయాడు. చిన్నపిల్లలందరూ చెట్లు దిగి అతని వద్దకు వచ్చారు. అతని చుట్టూ గుమిగూడారు. తమ స్నేహితుడికి ఏమయిందో? అని ఎంతో భయపడ్డారు. ఇంతలో కన్నయ్య కూడా అటు

వచ్చాడు. క్రింద పడ్డ పిల్లవాడి నోటి వెంట మాటరావడం లేదు. పిల్లలందరూ కన్నయ్య వంక బేలగా చూసారు. అన్నా! వీడేమిటి ఇలా అయ్యాడు? వాడి తల్లిదండ్రులకు ఇదంతా తెలిస్తే ఊరుకుంటారా? మనల్ని మళ్ళీ ఇలా బయటకు ఆడుకోవడానికి రానిస్తారా? అన్నారు.

అప్పుడు కన్నయ్య వారందరిని ఊరడించి ఏమీ భయపడొద్దు వీడు కాసేపట్లోనే లేస్తాడు అన్నాడు. అది ఎలాగో వారికి అర్థం కాలేదు అప్పుడు కన్నయ్య ఆ పిల్లవాడి పక్కన కూర్చుని నెమ్మదిగా వేణువు ఊదడం మొదలుపెట్టాడు. అంతే ఒక్క ఐదు నిమిషాలకల్లా పిల్లవాడిలో కదలిక కనిపించింది. ఎంత అద్భుత గానం! ఆ వేణుగాన మహత్యం అటువంటిది అంతటి అమోఘమైనది!

అలా ఒక పదినిమిషాలు కన్నయ్య వేణువు ఊదేటప్పటికి ఆ పిల్లవాడు పూర్తిగా లేచి కూర్చున్నాడు. కళ్ళు నులుపుకుంటూ నాకు ఏమయింది అని అన్నాడు. అప్పుడు ఆ పిల్లలందరూ అదిగో ఆ చెట్టు మీదనుంచి క్రింద పడ్డావు తెలుసా! అన్నారు. నిన్ను ఆ కన్నయ్యే కాపాడాడు అన్నారు.

ఆ పిల్లవాడు లేచి నుంచొని కన్నయ్యను గట్టిగా కౌగిలించుకున్నాడు. ఆ చిన్ని కన్నయ్య, ఆ చిన్ని పిల్లవాడు అలా కౌగిలించుకుంటుంటే ఆ దృశ్యం చూడాడానికి ఎంత అద్భుతంగా ఉందో! ఇది చూసి స్నేహితులందరూ ఆనందంతో ఒకరినొకరు కౌగిలించుకున్నారు. ఇంకో విశేషం ఏమిటంటే అక్కడి చెట్లపై ఎగురుతున్న కోతులు కూడా ఈ పిల్లవాడు ఇలా క్రింద పడడం చూసి ఒక్కసారి భయపడ్డాయి. చెట్లమీద దూకడం మానేసి అన్నీ ఒకే చెట్టుపై చేరి క్రింద ఆ పిల్లవాడి వంకే చూడసాగాయి.

ఇంతలో కన్నయ్య రావడం, వేణువు ఊదడం, పిల్లవాడు లేచి నుంచోడం, ఇవన్నీ చూసి ఆ కోతులకు కూడా ఎంతో ఆనందం వేసింది. ఆ

ఆనందంతో ఆ కోతులన్నీ కొమ్మలన్నిటిమీద గట్టిగా ఎగురుతూ, కొమ్మలను గట్టిగా ఊపసాగాయి. పైన ఇలా ఎగురుతున్న ఆ కోతులను చూసి క్రింద ఈ పిల్లలందరూ మరింత ముచ్చటపడ్డారు.

అలా అందరూ కలిసి కాసేపు ఆడుకుని నెమ్మదిగా ఇంటి బాట పట్టారు. చూసారా! కన్నయ్య ఆ పిల్లవాడిని ఎలా కాపాడాడో! ఆ పిల్లలందరితో ఎలా ఆడుకున్నాడో! ఆ రోజు ఆ వేణువు ఊది లేపిన ఆ పిల్లవాడు తరువాత కాలంలో కలియుగంలో జన్మించి ఒక గొప్ప వేణు విద్వాంసుడిగా పేరు తెచ్చుకున్నాడు. మరి సాక్షాత్తూ కన్నయ్యే వేణువు ఊదిలేపిన మహాభాగ్యం ఊరికే పోతుందా? ఎంతటి గొప్ప భాగ్యం ఆ జీవిది! ఇదే కదా కన్నయ్య ప్రేమ అంటే! ఇదే కదా ఆ గోవిందుడికి తన భక్తుల ఎడలగల గొప్ప వాత్సల్యం అంటే! ఆహా! ఇదంతా దర్శించిన మనమెంతటి ధన్యులం? ఆ చిన్ని కన్నయ్య మనందరిపై తన అమృత ప్రేమధారలను కురిపిస్తున్నాడు.

# 5

ఆ రోజు కన్నయ్య పుట్టినరోజు. కన్నయ్య పుట్టినరోజు అంటే యశోదమ్మ ఆనందం అంతా ఇంతా కాదు. ఆ రోజు కన్నయ్య మరింత అందంగా కనపబడుతున్నాడు. యశోదమ్మ కన్నయ్యకు ఉదయాన్నే తలస్నానం చేయించి కొత్త బట్టలు తొడిగింది. నీలిరంగు, ఆకుపచ్చరంగుల దుస్తులు వేసింది. కన్నయ్యకు ఈ రెండు రంగులు చాలా ఇష్టం. ముఖ్యంగా నీలిరంగు అంటే కన్నయ్యకు ఎంతో ఇష్టం ఎక్కువగా నీలిరంగు దుస్తులే ధరించేవాడు. అంతేకాక తలమీద ఎప్పుడూ నీలిరంగు గుడ్డలు ఒక రిబ్బనులా చుట్టుకునేవాడు. చిన్ని కృష్ణయ్యకు అదొక గొప్ప ముచ్చట!

ఆ రోజు కూడా కన్నయ్య ఒక మెరిసిపోతున్న గుడ్డ తలకు చుట్టుకున్నాడు. ఒక నెమలి పింఛం తీసి తలలో పెట్టుకున్నాడు. యశోద పిల్లవాడికి ఇష్టమని చక్కటి పాయసం చేసింది. కన్నయ్యకు తీపి పదార్థాలు చాలా ఇష్టం. అందుకే యశోదమ్మ ఆ రోజు పాయసం మరింత తియ్యగా చేసింది. అన్నంతో చేసే పాయసం అంటే కన్నయ్యకు చాలా ఇష్టం. అలాగే కూరగాయలలో కృష్ణుడికి చిక్కుడుకాయలు, దోసకాయలు, బీరకాయలు,

దొండకాయలు చాలా ఇష్టం. వీటితో చేసిన కూరలు కన్నయ్య ఎంతో ఇష్టంగా తినేవాడు. యశోదమ్మ ఈ కూరగాయలతో రకరకాల వంటలు చేసి పెట్టేది. కొంచెం పెద్దవాడు అయ్యాక కృష్ణుడికి గోధుమ రొట్టెలలో ఈ కూరలు కలిపి తినడం ఎంతో ఇష్టంగా ఉండేది.

ఆ రోజు పిల్లవాడి పుట్టినరోజు కావడంతో యశోదమ్మ ఎన్నో రకాల పిండి వంటలు చేసింది. ఇంతలో కన్నయ్య స్నేహితులందరూ ఎగురుతూ ఎంతో హుషారుగా పరుగెత్తుకుంటూ ఏవో పాటలు పాడుకుంటూ తలకి రంగు రంగుల గుడ్డలు చుట్టుకొని ఇంట్లోకి వచ్చారు. ఈ రోజు తన పుట్టినరోజు అని కన్నయ్య నిన్ననే వాళ్ళకి చెప్పినట్లున్నాడు. అందుకే వాళ్ళంతా కొత్త బట్టలు వేసుకుని మరీ వచ్చారు. అందరూ కన్నయ్య చుట్టూ చేరి ఎన్నో కబుర్లు చెపుతున్నారు. యశోదమ్మ వాళ్ళందరికీ మట్టి గ్లాసులలో పాయసం ఇచ్చింది. పిల్లలందరూ ఆ పాయసం ఎంతో ఆనందంగా తిన్నారు. ఇంక ఆడుకోవడానికి బయలుదేరుదాము అనగా ఇంతలో ఇంటి బయట ఏదో బండి ఆగిన చప్పుడు అయింది. కన్నయ్య స్నేహితులతో ఒక్కసారి పరుగెత్తి బయటకు వెళ్ళాడు.

అంతే కన్నయ్య ముఖంలో ఎంతో ఆనందం! ఎదురుగా రాధ తల్లితండ్రులతో కలిసి వచ్చింది. రాధను చూడగానే కన్నయ్య కళ్ళలో మెరుపు కనిపించింది. కన్నయ్యను కొత్త బట్టలతో తలపై రంగు రంగుల గుడ్డలతో చూసిన రాధ ఎంతో ఆనందంతో మురిసిపోయింది. యశోదమ్మ, నందుడు దంపతులు వృషభానుడు, కీర్తి దంపతులను ఇంట్లోకి ఆహ్వానించారు. యశోద వారితో రండమ్మా! ఏమిటి విశేషం! ఇలా ఉదయాన్నే వచ్చారు? అన్నది. కీర్తి యశోదమ్మతో ఈ రోజు కన్నయ్య పుట్టినరోజు కదా! అంతకు మించిన విశేషం ఏముంటుంది అని అంది. ఈ రోజు వెళ్ళాలని మా రాధమ్మ ఎప్పటినుంచో మాతో గట్టిగా చెప్తోంది. అందుకనే ఉదయాన్నే బయలుదేరి వచ్చాము అన్నది. యశోదమ్మ వారందరినీ లోపలికి పిలిచి పాయసం ఇచ్చింది. ఇంకా ఎన్నో పిండివంటలు పెట్టింది.

అప్పుడు కృష్ణుడు లోపలికి పరుగెత్తుకుంటూ వెళ్ళి చేతిలో రంగు రంగుల గాజులు తీసుకుని వచ్చాడు. రాధా! ఇదిగో ఇవి నీకోసమే అన్నాడు రాధ వాటిని చూసి ఎంతో ముచ్చటపడింది. ఇదంతా చూసిన యశోదమ్మ ఆశ్చర్యపోయింది. కృష్ణా! ఈ గాజులు నీకు ఎక్కడవి?అయినా రాధ చేతి కొలత నీకు ఎలా తెలుసు అంది. అందుకు కృష్ణయ్య చిరునవ్వే సమాధానంగా ఇచ్చాడు. రాధ తనలో భాగమే అని ఎందరికి తెలుసు అని అనుకున్నాడు.

కృష్ణయ్య ఒకనాడు గాజులు అమ్మే అతను వచ్చినప్పుడు తాను గోపికలందరికి గాజులు తొడిగాడు కదా! అప్పుడు ఆ గాజులబ్బాయి దగ్గర కొన్ని గాజులు తనకు కావాలని తీసుకున్నాడు. అలా తీసుకున్న ఆ గాజులు ఇన్నాళ్ళూ జాగ్రత్తగా దాచిపెట్టాడు. రాధ ఈ పుట్టినరోజుకి తమ ఇంటికి వస్తుందని కన్నయ్యకు తెలుసు. రాధకు ఏ రంగు గాజులు ఇష్టమో కూడా కన్నయ్యకు తెలుసు.

అప్పుడు కన్నయ్య చేతిలో గాజులు చూసిన రాధ చిరునవ్వుతో ఇలా చేతులు ముందుకు చాచింది. కన్నయ్య చిలిపిగా నవ్వుతూ ఆ చిన్నారి రాధ చేతులకు తానే గాజులు తొడిగాడు. కన్నయ్య చేతితో రాధ చేతిని అలంకరించిన ఆ గాజుల భాగ్యం ఎంతటిదో కదా! అలాగే అక్కడ నుంచొని చూస్తున్న వారందరూ ఎంత అదృష్టవంతులో కదా! చేతికి అలా గాజులు వేసుకోగానే రాధ ఎంతో ఆనందంతో ఇంట్లో అటూ ఇటూ ఎగురుతూ నృత్యం చేసింది. నృత్యం చేస్తున్న రాధను చూసి కన్నయ్య ఎంతో మురిసిపోయి రాధతో నృత్యం చేశాడు.

అలా నృత్యం చేస్తున్న వారిద్దరిని చూసి యశోద, నందుడు, కీర్తి, వృషభానుడు ఎంతో ముచ్చటపడ్డారు. అప్పుడు కన్నయ్య వీరి వంక చూసి రండి! రండి! మీరందరూ మాతో కలిసి నృత్యం చేయండి అన్నాడు. వారు సిగ్గుపడుతుంటే కృష్ణయ్య, రాధ వారిని చేతులు పట్టుకొని ముందుకు లాగారు. రండి! రండి! ఈ రోజు కన్నయ్య పుట్టినరోజు కదా! ఆటలు

ఆడకపోతే ఎలామరి అంది రాధ. అక్కడితో వారందరికీ నృత్యం చేయక తప్పలేదు. ఇంతలో కన్నయ్య స్నేహితులందరూ వీరి చుట్టూ తిరుగుతూ నృత్యం చేయసాగారు.

ఇలా గోకులంలో కన్నయ్య ఇంట్లో రాధాకృష్ణులతో కలిసి వీరందరూ ఇలా నృత్యం చేస్తుంటే పైన ఉన్న దేవతలు ఎంతో ఆనందించారు. అలా కాసేపు నృత్యం చేస్తూ ఉండగా ఒక్కసారిగా కన్నయ్య కాలు మెలికపడి కింద పడ్డాడు. అంతే కాదు వెంటనే స్పృహ కోల్పోయాడు. హఠాత్తుగా జరిగిన ఈ సంఘటనకు అందరూ కంగారు పడిపోయారు. యశోదమ్మ సంగతి చెప్పనక్కర్లేదు. ఇదేంటి తండ్రీ! ఇలా పడ్డావు? అని వెంటనే కొన్ని నీళ్ళు తెచ్చి పిల్లవాడి ముఖం మీద చల్లింది. కన్నయ్యను ఒడిలోకి తీసుకుని తల నిమిరింది.

కన్నయ్యా! కళ్ళు తెరువు ఏమయింది నాన్నా! నీకు అని ఏడవ సాగింది. ఈ హడావిడిలో పక్క ఇళ్ళల్లో ఉన్న యాదవులు గోపికలు వచ్చారు. కీర్తి, వృషభానుడు, రాధ అందరూ కూడా వచ్చి నుంచున్నారు. ఒకళ్ళు వెళ్ళి గోకులంలోని వైద్యుని తీసుకువచ్చారు. వైద్యుడు కన్నయ్యను పరీక్షించి పిల్లవాడు బాగానే ఉన్నాడు కానీ ఇలా ఎందుకు స్పృహకోల్పోయాడో అర్థం కావడం లేదు అన్నాడు.

ఏం చేయాలో ఎవరికీ పాలుపోవడం లేదు. ఒక్కసారిగా జరిగిన ఈ పరిణామానికి కీర్తి, వృషభానుడు ఎంతో కంగారు పడ్డారు. ఇదంతా గమినించిన రాధ నెమ్మదిగా చిరునవ్వుతో కన్నయ్య చెవి దగ్గరకు వంగి చెవిలో ఏదో చెప్పింది. అంతే కన్నయ్య ఒక్కసారిగా వెంటనే లేచి కూర్చున్నాడు. నాకేమయింది? ఎందుకు మీరందరూ ఇలా బాధతో ఉన్నారు? అని అన్నాడు. అక్కడ ఉన్నవారందరూ ఇదిచూసి ఆశ్చర్యపోయారు.

ఇప్పటి దాకా ఎన్నిచేసిన లేవని పిల్లవాడు రాధ స్పర్శతో, చెవిలో ఏదో చెప్పగానే ఇలా లేచి కూర్చున్నాడు. ఈ రాధ సామాన్యురాలు కాదు సుమా! అనుకున్నారు. రాధ సామాన్యురాలు కాదని లోకానికి చెప్పడానికే కన్నయ్య చేస్తున్న లీలలు ఇవన్నీ అని వారికి తెలియదు. అప్పుడు యశోద రాధ దగ్గరకు వచ్చి ఏం తల్లీ! మా కన్నయ్య చెవిలో ఏం చెప్పావు? అంది. ఏమి చెప్పలేదు, కృష్ణా! అని పిలిచాను అంతే అంది.

అప్పుడు యశోద నవ్వుతూ ఇదిగో రాధా! నువ్వు నిజం చెప్పడం లేదు నేను కన్నయ్యనే అడుగుతాను అని, కన్నయ్యా! ఇంతకీ రాధ నీకు ఏం చెప్పింది? అని అడిగింది. కన్నయ్య నాకేమి వినపడలేదు అమ్మా! అన్నాడు. నువ్వు కూడా ఇలా అంటావని నాకు తెలుసు అని యశోదమ్మ చిరునవ్వు నవ్వుతూ అంది. ఆ రోజు రాధ కృష్ణయ్య చెవిలో ఏం చెప్పిందో వారిద్దరికి తప్ప మరెవరికి తెలియదు. కానీ వారందరికీ ఒక విషయం తెలిసింది. కృష్ణయ్య లాగా రాధకు కూడా ఏదో శక్తి ఉందని ఆమె అందరి పిల్లలు లాగా సామాన్యురాలు కాదని వారికి అర్థమయింది. కన్నయ్యకు కావల్సింది కూడా అదే. రాధ గురించి ప్రపంచానికి తెలియాలి. తన రాధ ఎంత గొప్పదో ఈ ప్రపంచానికి తెలియాలి అదే కన్నయ్యకు కావలసింది.

ఆ తరువాత కృష్ణయ్య రాధను తీసుకుని ఆడుకోవడానికి వెళ్ళాడు. కొంత దూరం వెళ్ళాక దూరంగా ఒక పెద్ద మర్రిచెట్టు కనిపించింది. రాధకు అక్కడ ఒక అద్భుత దృశ్యం కనిపించింది. ఆ మర్రిచెట్టుకు చుట్టూ ఎన్నో పెద్ద ఊడలు ఉన్నాయి. కొందరు గోపికలు, మధ్యలో కృష్ణయ్య ఒకదానిని వదిలి రెండవది పట్టుకుంటూ ఒక విచిత్రమైన ఆట ఆడుతూ కనబడ్డారు. కృష్ణయ్య ఒక ఊడను ఊగుతూ ఒక్కసారిగా వదిలి గాలిలో ఎగిరి పక్క ఊడను పట్టుకుంటున్నాడు. తాను వదిలిన ఊడమీద తన వెనుక ఊగుతున్న గోపిక ఈ ఊడను పట్టుకుంటోంది. ఇలా అందరు గోపికలు ఒక ఊడనుంచి మరొక ఊడ దూకుతూ చుట్టూ తిరుగుతున్నారు. అలా తిరుగుతున్న మధ్యలో వారు

గాలిలో ఉండటం! కన్నయ్య కాసేపు గాలిలో ఉండటం! చూడడానికి ఆ దృశ్యం ఎంతో అద్భుతంగా ఉంది!

రాధ ఇదంతా చూసి ఆశ్చర్యపోయింది. ఇదేమిటి నిజమా! తన భ్రమా! తన కృష్ణయ్య తన పక్కనే ఉన్నాడు కదా! మరి అక్కడ మర్రిచెట్టు మీద అక్కడ ఎలా కనబడుతున్నాడు అని ఎంతో ఆశ్చర్యపోయింది. ఇదే విషయం కన్నయ్యను అడిగింది. కన్నా! ఇదెలా సాధ్యం నువ్వు ఇక్కడ నా పక్కనే ఉంటే మరి అక్కడ గోపికల మధ్య తిరుగుతున్నవారు ఎవ్వరు? అది కూడా నీలాగానే ఉన్నాడు కదా! అని అడిగింది. అప్పుడు కన్నయ్య రాధతో రాధా! ఒక్కసారి కనులు మూసుకుని మళ్ళీ సరిగ్గా చూడు! ఏం కనిపిస్తుందో చూడు! నీకే అర్థమవుతుంది అన్నాడు. అప్పుడు రాధ కన్నయ్య చెప్పినట్లు అలాగే చేసింది. అంతే రాధ కన్నుల ఎదుట ఒక అద్భుతం కనిపించింది.

ఆ ఊడలపై ఊగుతున్నది గోపికలు కాదు! అందరూ రాధా రూపాలే! అందరూ రాధలే! కృష్ణుడు మాత్రమే ఒక్కడు! ఒక ఊడనుంచి మరో ఊడ మీదకు దూకుతున్న వారందరూ రాధలే! రాధ ఆశ్చర్యంగా ఒక్కసారి తనవంక, కన్నయ్య వంక చూసుకుంది. అవును ఈ కన్నయ్యే అక్కడ ఉన్నాడు ఈ రాధే అక్కడ ఉంది అని అనుకుంది.

అప్పుడు కన్నయ్య చిరునవ్వు నవ్వుతూ రాధా! వారంతా ఎవరనుకున్నావు నీ రూపాలే! గోపికలందరి హృదయాలలో ఉన్నది నీవే కదా! నా మీద వారందరిలో గల ప్రేమతత్వం ఎవరనుకున్నావు? నీవే! నీ ప్రేమతత్వమే వారందరిలో ప్రకాశిస్తూ నన్నింత ప్రేమిస్తున్నది. అందుకే వారంటే నాకిష్టం. అంటే నీ ప్రేమతత్వం అంటే నాకు అంత ఇష్టం అన్నమాట. ఈ సృష్టిలో నన్ను స్వచ్ఛంగా, నిర్మలంగా ఆరాధిస్తున్న, ప్రేమిస్తున్న అందరి హృదయాలలో నీవుంటావు రాధా! నీవు వేరు నేను వేరు కాదు కదా! నాలో ఈ సృష్టిపై గల ప్రేమతత్వమే నీలా రూపుదిద్దుకున్నది. నా ప్రేమతత్వాన్ని నీలాగే ఆరాధిస్తున్నాను. అందుకనే నీవు ప్రేమ స్వరూపిణివి, ఆనంద స్వరూపిణివి అందుకే నేను ఎప్పుడూ నీ హృదయంలో ఉంటాను.

నువ్వు ఎప్పుడూ నా హృదయంలో ఉంటావు. ఈ సృష్టి మొత్తానికి మన ఇద్దరి ప్రేమతత్వమే ఆలంబన అన్నాడు కన్నయ్య.

కన్నయ్య ఇలా చెప్తుండగా ఆ మర్రిచెట్టుమీద ఉన్న గోపికలు, కృష్ణయ్య మాయమయ్యారు. అప్పుడు రాధ కన్నయ్యతో మనం కూడా అలా కాసేపు ఆడుకుందాం పదా! అన్నది. రాధ ఒక ఊడను, కన్నయ్య మరొక ఊడను పట్టుకుని ఊగుతున్నారు. ఒక్కసారిగా రాధ ఎగిరి కన్నయ్య ఊగుతున్న ఊడను కన్నయ్య చేతికి పైన పట్టుకుంది. ఆ ఊపులో రాధ ముఖం కన్నయ్య ముఖం దగ్గరకు వచ్చింది. రాధ కన్నయ్య నుదిటిపై ఎంతో సున్నితంగా ముద్దు పెట్టుకుని రివ్వున ఎగిరి మళ్ళీ పక్కన ఊడమీదకు ఎగిరింది. అలా వారిద్దరు కాసేపు ఆడుకుని కిందకి దిగారు. కింద ఉన్న బండలపై కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పుకొని సాయంత్రం వేళకు ఇంటికి చేరారు.

# 6

ఆ రోజు కృష్ణయ్య ఉదయం నుంచి చాలా చలాకీగా ఉన్నాడు. తన దగ్గర ఉన్న వేణువు ఒకటి తీసుకుని ఆటలకు బయలుదేరాడు. ఇంట్లోంచి బయటకు వెళ్ళగానే నలుగురు స్నేహితులు కలిసారు. అందరూ కలిసి ఊరి మధ్యన ఉన్న చావడికి వచ్చారు. అక్కడ కూర్చుని అటువైపు వెళ్ళే గొల్లభామల వైపు కొంటెగా నవ్వుతూ చిన్న చిన్న రాళ్ళను వేస్తున్నాడు కన్నయ్య. ఆ రాళ్ళు చేతికో కాలికో తగిలి ఆ గోపికలు కన్నయ్యను కొంచెం కోపంతో కొంచెం ఆనందంతో చూస్తున్నారు. కన్నయ్యకు వారితో రకరకాల ఆటలు ఆడటం ఒక విచిత్రం.

ఇలా విసురుతూ ఉంటే ఒక రాయి వెళ్ళి ఒక ఆమెకు కాలుమీద కొంచెం గట్టిగా తగిలింది. ఆమె కన్నయ్య వద్దకు వచ్చి తన చంకలో ఉన్న పాల ముంతను పక్కన పెట్టి ఆ చావటి అరుగుపై కూర్చుంది. కన్నయ్యా!

ఏమిటయ్యా? ఇంత గట్టిగా కొట్టావు అంది. అయ్యో! నీకు నొప్పి పెడుతోందా! అని కన్నయ్య తన చేత్తో అక్కడ రెండుసార్లు రాసి నొప్పి తగ్గిపోతుందిలే! అన్నాడు. ఆ కన్నయ్య స్పర్శ తగలగానే అలాగే ఆ గోపిక నొప్పి పూర్తిగా తగ్గిపోయింది. ఆ గోపిక ఎంతో సంతోషంగా కన్నయ్యకు అతని స్నేహితులకు మంచి పాల మీగడ ఇచ్చింది. కన్నయ్య చేతిలోని వేణువు కిందపెట్టి ఆ మీగడ ఎంతో ఆనందంగా ఆరగించాడు. ఆ గోపిక దగ్గర ఈ పురుషోత్తముడు అలా మీగడను తీసుకోవడంతో ఆమె జీవితం తరించింది. ఆమె కన్నయ్య వంకే చూస్తోంది. మీగడ తింటున్న కన్నయ్యని చూసి కొంచెం మూతికి, ముక్కుకి అంటుకొని ఎంత ముచ్చటగా ఉన్నాడో! అనుకుంది.

కాసేపు అక్కడే కూర్చుని తిరిగి లేచి వెళ్ళింది. అప్పుడు కన్నయ్య తన వేణువును చేతిలోకి తీసుకున్నాడు. వేణువు కొంచెం బరువుగా తోచింది. విషయం కన్నయ్యకు అర్థం అయింది. ఆ వేణువులో కన్నయ్యను సంహరించడానికి కీటకాసురుడు అనే రాక్షసుడు ఒక చిన్న కీటకంలాగా ప్రవేశించాడు. ఆ రాక్షసుడు ఎంతో శక్తివంతమైనవాడు. తన మాయతో ఎంతో చిన్న కీటక రూపమైన ధరించగలడు. ఆనాడు కన్నయ్యను అంతమొందించాలని చిన్న కీటక రూపంలో ఆ వేణువులో ప్రవేశించాడు. కన్నయ్య వేణువు ఊదడానికి నోటిదగ్గర పెట్టుకున్నప్పుడు దాని రంధ్రంలోనించి కన్నయ్య నోట్లోకి ప్రవేశించి అలా కన్నయ్య పొట్టలోకి వెళ్ళి తన నిజరూపం తెచ్చుకుని కన్నయ్యను చంపాలని అతని ఉద్దేశ్యం.

కన్నయ్య ఇదంతా గ్రహించి వేణువు తీసుకుని ఒక్కసారిగా గట్టిగా ఊదాడు. అంతే ఆ కీటకాసురుడు ఒక్కసారిగా వేణువు నుంచి వచ్చిన ధ్వనితరంగాలను తట్టుకోలేక వేగంగా ఎగిరి తన నిజరూపంతో ఎంతో విసురుగా చాలా దూరంగా ఉన్న కొండలపై పడి వెంటనే మరణించాడు. ఇదంతా చూస్తున్న కన్నయ్య స్నేహితులు ఎంతో భయపడ్డారు కన్నయ్య వారిని భయపడవద్దు అని చెప్పాడు. ఆ పురుషోత్తముడంటే సామాన్యుడా? ఈ సృష్టి మొత్తానికి కారణభూతుడైన ఆ పరంధాముని నోటి నుంచి వచ్చే

ధ్వని ఎంత శక్తివంతమై ఉంటుంది? ఆ శక్తి తట్టుకోలేక ఆ కీటకాసురుడు గిలగిలా కొట్టుకుని, కాళ్ళూ చేతులూ ఆడిస్తూ భీకరంగా అరుస్తూ మరణించాడు.

ఆ తరువాత అందరూ తమ తమ ఇళ్ళకు వెళ్ళారు. కన్నయ్య స్నేహితులు కొందరు వారి తల్లిదండ్రులకు ఈ విషయం చెప్తే వారు ఎంతో ఆశ్చర్యపోయారు. వారిలో ఒకరు మర్నాడు యశోదమ్మ ఇంటికి వచ్చి జరిగిందంతా చెప్పాడు. అది విన్న యశోదమ్మ ముందు నమ్మలేదు. అటు తరువాత కన్నయ్యతో కన్నయ్యా! రేపటినుంచి నువ్వు బయటకు వెళ్ళేటప్పుడు నేను వేణువుని చూసి ఇస్తాను, దాంట్లో రాత్రిపూట ఏ పురుగులో వచ్చి దాక్కోలేదని చూసి గాని నీకు ఇవ్వను అన్నది. కన్నయ్య యశోదమ్మ తల్లి ప్రేమకు. అమాయకత్వానికి చిరునవ్వు నవ్వాడు. అలాగే అమ్మా! రోజు నువ్వు చూసి ఇవ్వు. చూడటం మాత్రమే ఎందుకు ఒక్కసారి నువ్వే ఊది ఇవ్వరాదా! అని అన్నాడు. అందుకు యశోదమ్మ పగలపడి నవ్వింది. అమ్మ కన్నయ్యా! అమ్మను ఆటపట్టిస్తున్నావా అంది.

కృష్ణయ్య మురళీనాదంలో ఎంతో దివ్యత్వం ఉంది. కన్నయ్యకు మురళిని అలా ఊదటం ఎంతో ఇష్టం. ఇంకా విశేషం ఏమిటంటే ఇప్పటికి రాధకృష్ణుల గురించి, భాగవతం పూర్తి భక్తితో చదువుతున్న వారికి అప్పుడప్పుడు వేణునాదం వినిపిస్తూ ఉంటుంది. ఈ శ్రీకృష్ణదర్శనం పుస్తకం చదువుతున్నవారికి కూడా ఎన్నోసార్లు అలా కన్నయ్య వేణుగానం ఎంతో మధురంగా వినబడుతుంది. కన్నయ్యకు తన భక్తులంటే ఎంతో ప్రేమ. అంతటి అనురాగం అంతటి కరుణ అంతటి వాత్సల్యం.

# 7

ఒకనాడు రాధాకృష్ణులిద్దరూ ఇంటినుంచి బయలుదేరి నెమ్మదిగా యమునవైపు నడవసాగారు. అలా నెమ్మదిగా నడుస్తుండగా ఇంతలో ఒక లేడిపిల్ల చెంగు చెంగున ఎగురుతూ వచ్చి రాధ పక్కనే నడవసాగింది. రాధ దానిని చూసి ఎంతో ముచ్చటపడి దానిని నెమ్మదిగా నిమిరింది. అక్కడితో ఆ లేడి పిల్ల ఎంతో ఆనందపడి అటూ ఇటూ గంతులు వేస్తూ రాధాకృష్ణులతో పాటే నడవసాగింది. ఇంతలోనే పక్కన చెట్ల పైనుంచి నెమళ్ళు రివ్వున వచ్చి రాధ పక్కన రెండు, కృష్ణుని పక్కన రెండు వయ్యారంగా నడవసాగాయి.

రాధాకృష్ణులు ఈ నెమళ్ళ జంటలను చూసి ఎంతో ముచ్చటపడ్డారు. ఇంతలో వీటికి పక్కన ఉన్న పొదలనుంచి నాలుగు కుందేళ్ళు కూడా తోడయ్యాయి. వీరందరూ ఇలా ముందుకు సాగుతుండగా పక్కన ఉన్న చెట్టుపైనుంచి రెండు రామచిలుకలు వచ్చి ఒకటి కన్నయ్య

భుజంపై, మరొకటి రాధ భుజంపై వాలాయి. ఒక్కసారిగా అలా తన భుజంపై రామచిలుక వాలడంతో రాధ ఉలిక్కిపడింది. ఇంతలోనే తేరుకుని ఆ చిలకలను చూసి ఎంతో ముచ్చటపడింది.

ఇలా వీరందరూ కొంత దూరం నడిచేటప్పటికి వీరికి రెండు లేగ దూడలు ఎదురుపడ్డాయి. రాధాకృష్ణులను చూసి అవి ఎంతో ఆనందంతో ఎగురుతూ వీరి చుట్టూ గెంతుతున్నాయి. వీరినే కాక పక్కన ఉన్న ఆ లేడిపిల్లలను నెమళ్ళు, కుందేళ్ళు వీటన్నింటిని చుట్టి భలే ముచ్చటగా గెంతుతూ ముందుకు నడుస్తున్నాయి. వీరికి అటూ ఇటూ బోలెడు పక్షులు ఎగురుతూ వీరితో రాసాగాయి. రాధ వీటన్నింటిని చూసి ఎంతో ఆశ్చర్యపోయింది. కృష్ణా! ఏమిటి విశేషం ఈ రోజు ఇవన్నీ మనతో ఎందుకు వస్తున్నాయి? అని అడిగింది.

అప్పుడు కన్నయ్య రాధతో వీటన్నింటికీ మనం అంటే ఎంతో ప్రాణం. మరో విశేషం నీకు చెప్పనా! వీరందరూ ఈ రూపాలలో ఉన్న దేవతలు. దేవతలకు మనల్ని చూసి ఎంతో ముచ్చట కలిగింది. అందుకే కొందరు ఇలా రకరకాల ప్రాణుల రూపాలు ధరించి ఈ రోజు ఇక్కడ మనతో కలిసి యమునకు నడుస్తున్నారు. మనకోసం ఎన్నో లోకాలనుంచి వీరు వచ్చారు. వారి ముఖాలలో ఆ ఆనందం చూడు రాధా! అన్నాడు కన్నయ్య!

ఇదంతా విని రాధ ఎంతో సంతోషపడింది. తన భుజంపై ఉన్న రామచిలుకను నెమ్మదిగా నిమిరింది. అలా నిమరగానే వెంటనే ఆ రామచిలుక రాధా! రాధా! అని ఎంతో ముద్దుగా పలికింది. ఈ పలుకులు విన్న కృష్ణయ్య భుజంపై ఉన్న రామచిలుక కృష్ణా! కృష్ణా! అంది. రాధాకృష్ణులిద్దరూ వీటిని చూసి ముచ్చటపడుతుంటే కన్నయ్య భుజంపై ఉన్న చిలుక అప్పటిదాకా కృష్ణా! అని పిలుస్తూ ఇప్పుడు రాధా! రాధా! అంటోంది. అప్పుడు రాధ భుజంపై ఉన్న చిలుక కృష్ణా! కృష్ణా! అని పిలవడం మొదలుపెట్టింది. వీటి పలుకులకి రాధాకృష్ణులతో పాటు చుట్టూ ఉన్న లేగ దూడలు, నెమళ్ళు, కుందేళ్ళు, లేడిపిల్ల పైన ఎగురుతున్న పక్షులు ఎంతో

సంతోషించాయి. వీరిపైన ఎగురుతున్న ఆ పక్షులన్నీ కూడా రకరకాల ధ్వనులతో కూతలు కూయసాగాయి. వీటన్నింటినీ చూసి ప్రకృతి ఎంతో పులకించింది.

రాధాకృష్ణులిద్దరూ అలా మాట్లాడుకుంటూ యమునా తీరం చేరుకున్నారు. అక్కడ ఒడ్డున ఇసుకలో కొన్ని బండరాళ్ళు కనబడ్డాయి. రాధాకృష్ణులిద్దరూ ఒక పెద్ద బండరాయిపై నెమ్మదిగా కూర్చున్నారు. వారితో పాటు అక్కడి దాకా నడిచి వచ్చిన ప్రాణులన్నీ రాధాకృష్ణులకు ఇరువైపులా నుంచున్నాయి. యమున వీరందరినీ చూసి ఎంతో ముచ్చటపడింది. రాధాకృష్ణులు వీటన్నింటిని వెంటపెట్టుకుని రావడం చూసిన యమున ఎంతో ఆనందపడి పెద్ద పెద్ద అలలతో వీరికి స్వాగతం పలికింది.

ఇంతలో కృష్ణయ్య ఒక్కసారిగా ఆ రాతిబండ మీద నుంచి కిందకు దూకాడు. దూకి రాధ పాదాలవద్ద కూర్చున్నాడు. రాధ పాదాలు రెండూ ఆ బండరాతి మీద నుంచి సున్నితంగా వేలాడుతున్నాయి. అక్కడ ఇసుకలో కూర్చున్నాడు కృష్ణయ్య! హఠాత్తుగా కృష్ణయ్య ఇలా కిందకి ఎందుకు దూకాడో? అని వాటికి అర్థం కాలేదు. కన్నయ్య ఏం చెయ్యబోతున్నాడో? అని ఆత్రంగా ఆ గోవిందుని వైపే చూస్తున్నాయి. రాధ కూడా ఎంతో ఆశ్చర్యపడింది. కిందకు వంగి కన్నయ్యనే చూస్తున్నది. కన్నయ్య కింద ఇసుకలో ఏదో వెతుకున్నాడు. కన్నయ్య ఏమి వెతుకుతున్నాడా? అని రాధ ఆశ్చర్యంగా చూస్తోంది.

కన్నయ్య తన కుడిచేతిని ఇసుకలో పెట్టి ఏం దొరికిందో చెప్పు రాధా! అన్నాడు. ఏమో! నాకెలా తెలుస్తుంది? అని ముసి ముసి నవ్వులు నవ్వుతూ... అంది రాధ. కన్నయ్య చిరునవ్వు నవ్వుతూ తన చేతిని ఇసుకలోనించి పైకి తీసాడు. కన్నయ్య చేతిలో రాధ కుడికాలి గజ్జెలు! అయ్యో ఇవి ఎప్పుడు పడిపోయాయి? అసలు నేనివి గమనించనేలేదే అనుకుంది రాధ. కన్నయ్య రాధతో రాధా! నీకాళ్ళను ముందుకు పెట్టు ఈ గజ్జెలు నీ కాలికి మళ్ళీ పెడతాను అన్నాడు. రాధ ఎంతో ముచ్చటపడుతూ కుడికాలు

ముందుకు చాపింది. కన్నయ్య గజ్జెలు కుడికాలుకు కట్టబోతుండగా ఒక్కసారిగా గట్టిగా నవ్వుతూ కాలు అటూ ఇటూ ఊపింది. అక్కడితో ఆ గజ్జెలు కన్నయ్య చేయి జారి కిందపడ్డాయి. కుదురుగా ఉండవా పిల్లా! అన్నాడు కన్నయ్య. లేదు కృష్ణా! నీ చేయి తగలగానే ఆ పాదాలకు ఏదో దివ్యమైన అనుభూతి కలిగి నాకు తెలియకుండానే కాళ్ళు ముందుకు వెనక్కి వెళ్ళాయి అంది రాధ.

కన్నయ్య మళ్లీ ఆ గజ్జెలు చేతిలోకి తీసుకుని వాటికి పట్టిన ఇసుకను గట్టిగా ఊదాడు. అలా ఊదడంతో కొన్ని ఇసుక రేణువులు వచ్చి కన్నయ్య కంట్లో పడ్డాయి. కన్నయ్యకు కొంచెం కళ్ళు మండి చేతితో నలుపసాగాడు. అయ్యో కన్నా! నా వల్ల ఎంత పని జరిగిందో చూడు! అంటూ రాధ ఒక్కసారిగా కిందకు దూకి కృష్ణయ్య కళ్ళలోకి చూస్తూ కన్నయ్యను కళ్ళు పెద్దగా తెరవమని చెప్పి నెమ్మదిగా ఊదింది. అంతే కన్నయ్య కళ్ళలోని ఆ ఇసుకరేణువులు గాలికి ఎగిరిపోయాయి. రాధకు గల కృష్ణ ప్రేమ అంతటి గొప్పది! అలా దివ్యప్రేమతో ఊదగానే కృష్ణయ్య కంటిలోపల అతుకున్న ఆ రేణువులన్నీ బయటకు ఎగిరివచ్చాయి. అలా కింద పడిన ఆ రేణువులు సాక్షాత్తూ ఆ పరంధాముని కంటికి తగిలి వచ్చినవవడంతో ఆ ఇసుకలో ఎంతో ప్రత్యేకంగా మెరుస్తూ కనిపిస్తున్నాయి.

ఇదంతా అక్కడ చుట్టూ ఉన్న జంతువులన్నీ ఎంతో ముచ్చటగా చూస్తున్నాయి. ఆ లేడిపిల్ల ముచ్చట అయితే ఇంతా అంతా కాదు. రాధ కిందకి దూకగానే అటూ ఇటూ ఆనందంతో గెంతుతూ అక్కడే ఆ రాయిచుట్టూ తిరగసాగింది. మధ్య మధ్యలో ఆగి వీరిద్దరినీ చూస్తోంది. ఎంతో ముచ్చటపడుతోంది. ఇంతలో కుందేళ్ళ జంట రాధను, కన్నయ్యను చూసి ఎంతో మురిసిపోతూ ఆ ఇసుకలో నెమ్మది నెమ్మదిగా అటూ ఇటూ దూకుతున్నాయి. ఎంత ముచ్చటగా ఉంది ఆ దృశ్యం!

రాధ తిరిగి ఆ రాతిబండ ఎక్కి పాపం నీ కళ్ళు ఎంత మండుతున్నాయో! ఆ గజ్జెలు నేనే పెట్టుకుంటాను ఇలా ఇవ్వు అంది. లేదు

రాధా! నేనే పెడతాను అన్నాడు కన్నయ్య! రాధ ఆ బండపై చెయ్యివేసి ఒక కాలు కన్నయ్య చేతులో పెట్టి రెండవ కాలు బండరాయిపై పెట్టి ఒక్క ఉదుటున ఆ రాయిపైకి దూకింది. కన్నయ్య కింద ఇసుకలో కూర్చొని రాధ కాలిని తన చేతిలోకి తీసుకుని అలా ఆ రాయిపైకి రాధ ఎక్కుతూ ఉంటే ఆ దృశ్యం ఎంత మధురంగా ఉందో చూడండి! రాధాకృష్ణుల లీలలు, ఆటలు చదువుతున్న, వింటున్న మనస్సు ఎంతో ఆనందంతో పొంగిపోతుంది. మనస్సులో ఎటువంటి అశాంతి ఉన్నా వెంటనే తొలగిపోతుంది. మనస్సు, శరీరం ఎంతో ప్రశాంతత చెందుతాయి. వారిద్దరి ఆటలను వినడంలో ఎంతో అద్భుత మాధుర్యం దాగివుంది. ఈ విశ్వంలోని ప్రేమ మొత్తం ప్రతిబింబించేది వారి ప్రేమలోనే! రాధాకృష్ణులు ఒకచోట ఉంటే ఆ ప్రదేశం అంతా దివ్యప్రేమ తరంగాలు నిండి ఉంటాయి. వారిద్దరినీ అలా ఒకచోట ఊహించుకుంటేనే ఆ మధుర దృశ్యం మన మనస్సులను ఆనంద డోలికలలో ముంచెత్తుతుంది. వారు మన ఎదురుగానే ఉన్నట్లు భావన కలిగి మనకి అంతులేని ఆనందం కలుగుతుంది.

రాధ అలా ఆ రాయి ఎక్కి కూర్చోగానే కన్నయ్య రాధ పాదాలని తన చేతిలోకి తీసుకుని ఆ గజ్జెలను ముడివేసాడు. ఆ అద్భుత దృశ్యం చూసిన ఆకాశంలోని అక్కడ ఉన్న పక్షులన్నీ అలా వీరి పైననే ఎగురసాగాయి. ఆ అద్భుత దృశ్యాన్ని చూసిన ప్రకృతి పరవశించి ఎదురుగా ఉన్న యమునపై ఆకాశంలో రంగుల హరివిల్లు విరిసింది. ఆహా! ఎంత అద్భుతంగా ఉంది ఆ దృశ్యం!

రాధ కాలికి అలా గజ్జెలు తొడిగిన తరువాత కన్నయ్య మరి నా కోసం నృత్యం చేయవూ! అన్నాడు. అప్పుడు రాధ ఒక్కసారిగా ఆ రాతిబండ నుంచి కిందకి దూకి ఆ ఇసుకలో ఎంతో అద్భుతంగా నృత్యం చేయసాగింది. కన్నయ్య ఆ రాయి ఎక్కి తన మురళీ నాదం వినిపించసాగాడు. రాధ ఆ మురళీ నాదానికి అనుగుణంగా నృత్యం చేయసాగింది. అలా ఇసుకలో ఎగురుతూ నృత్యం చేస్తుంటే ఆ ఇసుక రేణువులు అటూ ఇటూ

వెదజల్లపడుతూ ఒక అద్భుత దృశ్యం ఆవిష్కరింపబడింది. రాధ అడుగుల సవ్వడితో, ఆ ఇసుక రేణువులు అలా ఎగిరి కింద ఇసుకలో పడుతూ మళ్ళీ ఎగురుతూ, మళ్ళీ ఇసుకలో పడుతూ ఆ దృశ్యం ఎంత మనోహరంగా ఉందో! చూడండి.

అలా చాలాసేపు ఆడుకుని రాధాకృష్ణులిద్దరూ తిరిగి ఇంటికి నడవడం ప్రారంభించారు. వారితో పాటు లేడిపిల్లలు, నెమళ్ళు, కుందేళ్ళు తిరిగి కొంత దూరం వచ్చి పక్కన ఉన్న అడవిలోకి వెళ్ళిపోయాయి. రాధా, కన్నయ్యలకు ఇంతలో కొందరు స్నేహితులు కలిసారు. అందరూ కలిసి చీకటిపడే వేళకు గోకులం చేరుకుని ఎవరి ఇంటికి వారు వెళ్ళారు. కన్నయ్య రాధను తీసుకుని తనింటికి వచ్చాడు. ఇంట్లో ఉన్న యశోద, కీర్తి వీరిద్దరినీ చూసి మురిసిపోయారు. ఆరోజు తాము ఆడుకున్న ఆటలన్నీ ఆ తల్లులకు చెప్పారు. ఇవన్నీ విన్న వారిద్దరూ ముచ్చటపడ్డారు. ఇంతలో అక్కడికి వచ్చిన నందుడు, వృషభానుడు ఆ విశేషాలన్నీ మళ్ళీ చెప్పండి! అని అడిగి రాధాకృష్ణులచేత చెప్పించుకుని ఎంతో సంతోషించారు.

# 8

ఆ రోజు కృష్ణయ్య ఉదయం నుంచి ఎంతో హడావిడిగా ఉన్నాడు. తన స్నేహితులతో కలిసి ఒకటే ఆటలు! గోపికల ఇళ్ళల్లో వెన్నతిని అందరూ కలిసి తోటలలో చేరి ఆటలు! అటూ ఇటూ పరుగెత్తడం! చెట్లు ఎక్కడం ఆ పచ్చిక బయళ్ళలో ఎగురుతూ, గడ్డి వాములపై ఎక్కి దూకుతూ ఒకటే ఆటలు. ఉదయం పదిగంటలు కావస్తోంది. గోకులం అంతా ఎవరి పనులలో వాళ్ళు ఉన్నారు. యశోదమ్మ ఏదో వంట పని చేసుకుంటోంది. నందుడు ముందు వరండాలో కూర్చొని యాదవ మిత్రులతో కలిసి కబుర్లు చెపుతున్నాడు. గోకులం అంతా ఎవరి పనులలో వారు మునిగి ఉన్నారు.

అసలు ఆరోజుల్లో గోకులం ఎంత అద్భుతంగా ఉండేదో తెలుసా? ఈనాటి గోకులం, బృందావనానికి ఆనాటి గోకులం, బృందావనానికి అస్సలు పోలికేలేదు. ఆరోజుల్లో గోకులం అంతా ఎంతో దివ్యంగా ప్రకాశిస్తూ ఉండేది. ఎక్కడ చూసినా పచ్చదనం. ఆవులు దూడలు అలా వీధులలో

తిరుగుతూ మేతకోసం దూరంగా కొండ ప్రాంతాలకు వెళ్తూ ఊరిలో అందరూ కలిసి మెలిసి జీవిస్తూండేవారు. ఊరంతా ఎప్పుడూ ఏదో ఉత్సవాలతో హడావిడిగా ఉండేది. ఆ ఉత్సవాలలో యాదవులు, గోపికలు రంగు రంగుల వస్త్రాలు ధరించి ఎంతో ఆనందంగా కోలాటం ఆడేవారు. రకరకాల నృత్యాలు చేసేవారు ఇళ్ళకు రంగు రంగుల తోరణాలు కట్టేవారు. ఎన్నో రంగుల పువ్వులు అలంకరించేవారు. గోకులంలో ప్రతీ వారం పదిరోజులకు ఏదో ఒక ఉత్సవం వస్తూనే ఉండేది.

ఆరోజు నందుడు అలా స్నేహితులతో కలిసి బయట కూర్చొని మాట్లాడుతూ ఉండగా ఒక్కసారిగా పెద్ద గంటలు మ్రోగాయి. అక్కడితో అందరూ ఒక్కసారిగా హడావిడిగా లేచి కర్రలు తీసుకొని వీధిలోకి వెళ్ళారు. గోకులంలోకి అప్పుడప్పుడు పక్కన అటవీప్రాంతం నుంచి పులులు వస్తూండేవి. అలా ఎప్పుడైన పులి ఊళ్ళోకి వస్తే వెంటనే గోకులంలో రెండు చోట్ల ఏర్పాటు చేసిన గంటలు గట్టిగా కొట్టేవారు. ఆ గంటల శబ్దం వినగానే ఊరంతా అప్రమత్తం అవుతుంది. ఆ గంటలు మ్రోగాయి అంటే గోకులంలోకి ఏ పులి ప్రవేశించడమో లేదా ఏ ఏనుగుల గుంపు రావడమో జరిగిందన్నమాట. వెంటనే ఆడవాళ్ళందరూ పిల్లలను తీసుకొని ఇళ్ళలోకి వెళ్ళి తలుపులు వేసుకుని కూర్చునేవారు. మగవారు కర్రలు తీసుకుని ఆ పులిని వెతుకుతూ దాన్ని తిరిగి అడవిలోకి తరిమేవారు.

ఆ రోజు కూడా వెంటనే పెద్దవారందరూ కర్రలు తీసుకుని పులి ఎటువెళ్ళిందో చూడడానికి పరుగెత్తారు. యశోదకి చాలా బాధ కలిగింది. ఈ కన్నయ్య స్నేహితులతో ఎక్కడ ఆడుతున్నాడో? ఆ పులి ఈ పిల్లాడిని ఏం చేస్తుందో? అని ఒకటే బాధపడుతోంది. యశోద నందుడితో మన పిల్లాడు ఎక్కడ ఉన్నాడో చూడండి! ఈ పిల్లలు తిరగని ప్రదేశం ఉండదు కన్నయ్యను పులి ఏంచేస్తుందో ఏమో! అని గట్టిగా అరవసాగింది. యశోదకు ఒకటే దుఃఖం ముంచుకువస్తోంది. నందుడు యశోదను కంగారుపడవద్దని తామందరం వెళ్తున్నామని తలుపు వేసుకుని లోపలే ఉండమని చెప్పాడు. ఆ

పులి అక్కడ ఇక్కడ అతి వేగంగా పరుగెడుతూ ఇళ్ళ పైనుంచి క్రిందకు దూకుతూ క్షణంలో మాయమౌతోంది. కాని పులి గాండ్రింపులు వినిపిస్తున్నాయి. అటువైపుగా కర్రలు తీసుకుని యాదవులు పరుగెడుతున్నారు. ఆ పులి వీళ్లకి ఏమాత్రం దొరకడంలేదు. గోకులంలోని ఆ గంటల చప్పుడు కన్నయ్య, స్నేహితులు కూడా విన్నారు. ఆ సమయంలో వారందరూ ఊరికి కొంచెం దూరంగా ఉన్న ఒక తోటలో ఆడుకుంటున్నారు. ఆ గంటల శబ్దం విని స్నేహితులందరూ ఎంతో భయపడ్డారు. కన్నయ్య వారిని భయపడవద్దని ఆ పులి మనల్ని ఏమీ చేయదని అన్నాడు.

ఇంతలో పులి గాండ్రిస్తూ ఆ తోటవైపే వస్తోంది. పిల్లల వద్దకు వడివడిగా ముందుకు దూకుతూ రాసాగింది. పిల్లలందరూ బెంబేలెత్తిపోయారు. కన్నయ్య ఒక్కసారి అతివేగంతో ఆ పులిమీదకు దూకాడు. పులిమీదకి ఇలా దూకాడో లేదో! ఆ పులి కాస్తా ఒక్కసారిగా ఆగిపోయింది. ఏదో మైకం కమ్మినట్లు ఒక్కసారిగా సాత్వికంగా అయిపోయింది. అతి నెమ్మదిగా నడుస్తూ గాండ్రించడం కూడా ఆపింది. ఆయాసపడుతూ కొంచెం మూలుగుతూ అటూ ఇటూ తిరగసాగింది. కన్నయ్య తలలోనించి నెమలి పింఛం తీసుకొని పులి తలపై నెమ్మదిగా నిమిరాడు. ఇది చూసి స్నేహితులందరూ ఆశ్చర్యపోయారు.

కన్నయ్య వారితో అస్సలు భయపడవద్దని పులి మనల్ని ఏమి చేయదు అని అన్నాడు. కన్నయ్య తన చేత్తో ఆ పులి తల తన చేత్తో నిమిరాడు. ఆ పులి పూర్తిగా నెమ్మదిగా అయిపోయింది. కింద పులిని చూసిన చెట్లపై ఉన్న కోతులు ఒక కొమ్మ మీదనుంచి మరో కొమ్మమీదకు దూకుతూ ఎంతో గట్టిగా అరవసాగాయి. నెమళ్ళు కూడా ఎంతో బెదిరిపోతూ దగ్గర్లో ఉన్న చెట్ల కొమ్మలపైకి ఎగిరాయి. ఇంక కుందేళ్ళు అయితే ఎంత భయపడ్డాయో! చెప్పనక్కర్లేదు.

కన్నయ్య అలా పులిమీద కూర్చుని దాని తలను నిమురుతూ ఉంటే అది ఆశ్చర్యంగా ఎటూ కదలక అక్కడే నిలబడింది. ఈ తోటల్లో కోతుల

అరుపులు విపరీతంగా వినపడడంతో దూరంగా ఉన్న యాదవులు పులి ఇక్కడే ఎక్కడో ఉండి ఉంటుంది అనుకున్నారు. అలా అనుకొని అందరూ కర్రలు పట్టుకొని గట్టిగా అరుస్తూ తోటలోకి వచ్చారు. రాగానే వారికి దూరం నుంచి కనబడిన దృశ్యం చూసి ఆశ్చర్యపోయారు. దూరంగా పులిమీద ఉన్న కన్నయ్య ఒక్కసారిగా దుర్గాదేవిలా కనిపించాడు. వారి నోట మాట రాలేదు. ఈ పులి ఏమిటి, ఇంత నిశ్చలంగా ఉండడం ఏమిటి? అసలు ఇంత చిన్ని కన్నయ్య ఈ పులి మీదకు ఎలా ఎక్కాడు? వారికి ఎంతో ఆశ్చర్యం వేసింది.

ఇంతలో అక్కడకి నందుడు, స్నేహితులు కూడా వచ్చారు. తమ కన్నయ్య అలా పులిమీద కూర్చోడం చూసి ఆశ్చర్యపోయాడు? కర్రలు పట్టుకొని గట్టిగా అరుస్తూ వస్తున్నవారిని చూసి వారిని వాదిస్తూ మీరు భయపడకండి ఇది ఎవ్వరినీ ఏమీ చెయ్యదు అని గట్టిగా అరిచాడు కన్నయ్య. ఇంతమంది ఇంత కోలాహలంగా ఉన్నా ఆ పులి ఏ మాత్రం బెదరలేదు. మరి ఆ పులి మీద ఉన్నవాడు ఎవ్వడు? సాక్షాత్తూ ఆ పురుషోత్తముడే కదా! ఆ పరబ్రహ్మమూర్తి స్పర్శ తగలగానే ఏ జీవికైనా వాటి హింసా గుణం క్షణంలో నశిస్తుంది. అహంకారం పూర్తిగా అణగారిపోతుంది. అత్యంత సత్వగుణ రూపులు అవుతారు. ఏ జీవికైనా ఇదే అనుభవం జరుగుతుంది. ఆ పురుషోత్తముని స్పర్శ అంతటి అమోఘమైనది, అంతటి దివ్యమైనది. కన్నయ్యను చంపడానికి వచ్చిన పూతన సైతం ఎప్పుడైతే తన స్తన్యం కన్నయ్యకు అందించిందో అంతే! ఆ క్షణంలోనే తన రాక్షస గుణం పోగొట్టుకున్నది. ఇంక మరణం తప్ప తనకు ఇంకేమీ అక్కర్లేదు అనుకుంది.

కన్నయ్య తన తండ్రితో సహా ఇటు రావద్దు అని అన్నాడు. నేను నెమ్మదిగా దిగుతాను, ఇది అడవిలోకి వెళ్ళిపోతుంది. ఎవ్వరిని ఏమీ చెయ్యదు. అస్సలు కంగారు పడవద్దు అన్నాడు. అలాగే కన్నయ్య నెమ్మదిగా ఆ పులిమీద నుంచి క్రిందకి దిగి దాని వీపు నిమిరాడు. అక్కడితో పులి ఒక్కసారిగా వేగంగా దూకుతూ అడవిలోకి పరుగెత్తి వెళ్ళిపోయింది. ఇదంతా చూసిన యాదవులందరూ ఆశ్చర్యపోయారు. ఈ కన్నయ్యకు ఎంత ధైర్యం

అనుకున్నారు. నందుడు కన్నయ్యను ఎత్తుకొని ముద్దులతో ముంచెత్తాడు. ఇంతలో ఇదంతా తెలుసుకున్న యశోద గోపికలతో కలిసి పరుగు పరుగున అక్కడకి వచ్చింది. కన్నయ్యను గట్టిగా కౌగిలించుకుని అమ్మో! ఎంత గండం తప్పింది నీకు తండ్రీ! అంది గట్టిగా హత్తుకొని ముద్దులు పెట్టింది. యశోదతో వచ్చిన గోపికలు అమ్మా! మీ పిల్లవాడు సామాన్యుడు కాదు తల్లీ! ఏ మహాపురుషుడో! నీ కుమారుడిగా జన్మించాడు అని అన్నారు.

నందునితో కూడా యాదవులు ఇదే మాట అన్నారు. నందనయ్యా! మన కన్నయ్య సామాన్యుడు కాదు! మీరెంత భాగ్యవంతులో! మీరు ఎంత పుణ్యం చేసుకుంటే ఇటువంటి పిల్లవాడు జన్మిస్తాడో! ఈ పిల్లవాడివల్ల గోకులం, మేమంతా ధన్యులమయ్యాము అని అన్నారు. అక్కడితో అందరూ వారి వారి ఇళ్ళకు వెళ్ళారు. నందుడు, యశోద కన్నయ్యనెత్తుకుని దారంతా ఎన్నో ముద్దులు పెడుతూ కన్నయ్యకు ఏమీ కాకుండా ఇంటికి వస్తున్నాడు అని ఎంతో ఆనందపడుతూ ఇంటికి చేరారు.

# 9

శ్రీకృష్ణులవారి లీలలు రోజురోజుకీ గోకులంలో ఎక్కువ కాసాగాయి. కన్నయ్య తన అద్భుత లీలలతో అందరినీ ఎంతో అలరిస్తున్నాడు. గోకులంలోని ప్రతీ చెట్టూ, పుట్టా కన్నయ్యను తమ మనస్సులో నింపుకుంటున్నాయి. ఎంతో ఆనందపడుతున్నాయి. ఇన్ని యుగాలుగా ఆ కన్నయ్య రాకకోసం ఎదురుచూసిన జీవులన్నీ కన్నయ్య ఈ భూమిపై నడయాడిన 125 సంవత్సరాలలో ఎప్పుడో ఒక కాలాలలో జన్మించి ఆ గోవిందుని దర్శనంతో తమ జన్మలు ధన్యం చేసుకుంటున్నాయి. అందులో ముఖ్యంగా కన్నయ్య గోకులంలోను, బృందావనంలోను ఉన్నప్పుడు ఆ స్వామిని చూసి స్వామితో సాన్నిహిత్యంగా ఉండి జన్మ ధన్యం చేసుకున్నవారు కొందరు... ముక్తిని పొందిన వారు మరికొందరు. ఈ జీవులన్నీ ఆ శ్రీమన్నారాయణుడు కన్నయ్యగా ఇక్కడకి వచ్చే కాలం కోసం ఎన్నో జన్మలుగా ఎదురుచూస్తూ ఇప్పుడు ఇక్కడ జన్మించి ఆత్మ ప్రయాణాన్ని సార్థకత చేసుకుంటున్నారు.

ఆ రోజు కన్నయ్య ఉదయాన్నే లేచాడు. యశోదమ్మ కన్నయ్యకు చక్కగా స్నానం చేయించి మంచి బట్టలు తొడిగింది. నందుడి ఇల్లు ఎంతో చక్కగా ఉంటుంది. ఇంటికి వెనుకనే చక్కటి గోశాల అందులో ఎన్నో గోవులు, లేగదూడలు ఎంతో ముచ్చటగా ఉంటాయి. యశోదమ్మ రోజూ వీటి దగ్గరకి వెళ్ళి ప్రతీ ఆవును పలకరిస్తుంది. కన్నయ్య రోజూ ఉదయం లేవగానే కాసేపు వెళ్ళి ఆ లేగదూడలతో ఆడుకుంటాడు. చూడండి! ఈ రోజు లేవగానే కన్నయ్య ఇంటి వెనుకాల గల ఆవుల దగ్గరకు వెళ్ళి ఎలా ఆడుతున్నాడో! కన్నయ్య ఉదయం ఐదు గంటలకల్లా లేచేవాడు. యశోదమ్మ నాలుగంటలకే లేచి స్నానం చేసి పూజ చేసుకొని గోష్టానికి వెళ్ళి పాలు పితికి ఇంట్లో దేవతలకు నైవేద్యం పెట్టేది. యశోదమ్మ నిత్యం విష్ణువును, లక్ష్మీని, పరమేశ్వరుని, పార్వతీ దేవిని పూజించేది. యశోదమ్మ దగ్గర ఈ దేవతల చిత్రపటాలు ఉండేవి. రోజూ యశోద ఈ పటాలకు పూజా మందిరానికి రకరకాల పువ్వులు అలంకరించేది.

ఒకొక్కసారి కన్నయ్య కూడా ఆ చిత్రాలకు పువ్వులు పెట్టేవాడు. అలా పువ్వులు పెడుతూ చిత్రంగా ఒక చిరునవ్వు నవ్వేవాడు. ఆ నవ్వుకు అర్థం కన్నయ్యకు తప్ప మరెవరికి తెలుసు? వారందరూ తనవారే కదా! ఆ విషయం ఈ చిన్ని కన్నయ్యకు తప్ప మరెవరికి తెలుసు? కన్నయ్య రోజూ ఉదయం తమ చిత్రాలకు పువ్వులు పెడుతుంటే ఆ దేవతలందరూ ఎంతో మురిసిపోయేవారు. ఒకసారి కన్నయ్య యశోదమ్మతో విష్ణుమూర్తికి ఈ పువ్వులు ఇష్టం, శివుడికి ఈ పువ్వులు ఇష్టం అని చెప్తుంటే యశోదమ్మ ఆశ్చర్యంగా చూసేది. ఓరి నాన్నా! వాళ్ళకి ఏ పువ్వులు ఇష్టమో! నీకెలా తెలుసు? నీకు కూడా పువ్వులు పెట్టాలని ముచ్చటగా ఉంది అందుకని ఇలా ఏదో చెప్తున్నావు అనేది. కన్నయ్య చిన్న చిరునవ్వు నవ్వి ఊరుకునేవాడు.

అలాగే కన్నయ్యను స్నానం చేయించడానికి ఇంటి వెనుక గల పెరట్లో నుంచోపెట్టి స్నానం చేయించేది. మూడు నాలుగు ఏళ్ళ వయస్సులో స్నానం చేయిస్తుంటే నీళ్ళను అటూ ఇటూ చిమ్ముతూ కన్నయ్య ఎంతో అల్లరి

చేసేవాడు. ఆహా సర్వలోకేశ్వరుడు అయిన ఆ పురుషోత్తమునికి స్నానం చేయించే భాగ్యం కలిగిన ఆమె ఎంత అదృష్టవంతురాలు! కాని ఆమెకు ఆ చిన్న బాలుడే ఆ పరంధాముడు! అని తెలియదు కదా! అందరిలాంటి వాడే అనుకునేది. యశోదమ్మకు కన్నయ్య పైననే ప్రాణాలన్నీ! కన్నయ్యతో ప్రతీక్షణం ఆమెకు అమృతమే!

కన్నయ్యను నిద్రలేపడం, స్నానం చేయించడం, బట్టలు తొడగడం, అలంకరించడం... ఇలా ప్రతీది చేస్తున్నప్పుడల్లా ఎంతో మురిసిపోయేది. సాక్షాత్తూ ఆ జగన్నాధునికే నిత్యం స్నానం చేయిస్తున్న యశోద, అది చూస్తున్న అక్కడి వారు ఎంతటి అదృష్టవంతులో! సాక్షాత్తూ ఆ పరంధాముడే నిత్యం స్నానం చేస్తున్న ఆ ప్రదేశం ఎంత పవిత్రమైనది కదా! మనం ఒక్కసారి ఆ ప్రదేశాలన్నీ మనస్సులో దర్శిస్తేనే చాలు ఎన్నో జన్మల పాపం నశిస్తోంది. ఆ ఊహకు మనస్సంతా ఎంతో ఆనందంతో నిండిపోతుంది.

మీకొక అద్భుతం చెప్తున్నాను. అక్కడ కన్నయ్యకు యశోద రోజూ స్నానం చేయిస్తుంటే ఆ నీరు నేల మీద పడినప్పుడు ఆ నీరు తాగిన కొన్ని జీవులు ఆ పుణ్యఫలం చేత తరువాత మానవజన్మ పొంది విశేషమైన భక్తిని పొందినవారై గొప్ప కృష్ణ భక్తులుగా పేరు పొందారు. అటువంటి భాగ్యవంతులను ఈ కాలంలో దర్శించడం జరిగితే మనం కూడా ఎంత అదృష్టవంతులమౌతామో! అటువంటి జీవులు కొన్ని ప్రస్తుతం బృందావనంలోని, ప్రముఖ కృష్ణ క్షేత్రాలైన ద్వారక, ఉడిపి, గురువాయురు వంటి అనేక ప్రదేశాలలో మానవులుగా, రకరకాల జీవులుగా జన్మించి తమ జన్మను సార్థకం చేసుకుంటున్నాయి. కొన్ని సంవత్సరాల పాటు అజ్ఞానంలోనే జీవిస్తూ ప్రస్తుత కాలంలో ఆ స్వామికి జరుగుతున్న ఆ ఉత్సవాలను వీక్షిస్తూ తమ జన్మను సుసంపన్నం చేసుకుంటున్నాయి. ఎంతో వర్ణించలేని ఆనందంతో వారి ఆత్మలు దివ్యానుభూతి పొందుతూ జీవిస్తున్నాయి.

ఆ రోజు గోకులంలో సాయంత్రం దివ్యమండపంలో ఒక పండితుడు చేత శ్రీరామాయణ ప్రవచనం ఉంది. గోకులం మధ్యమండపంలో గల దివ్య మండపంలో అప్పుడప్పుడు ఇలా మంచి కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఆసక్తి ఉన్నవారు ఆ కార్యక్రమాలకు వస్తుంటారు. యశోదకు రామాయణం చాలా ఇష్టం. నందునికి శ్రీరామచంద్రుడు అంటే ఎంతో ఆరాధన. యశోదమ్మ రోజూ కన్నయ్యకు రాత్రిపూట పడుకునేటప్పుడు రామచంద్రులవారికి సంబంధించిన అనేక కథలు చెప్తుండేది. కన్నయ్య చిరునవ్వుతో ఆ కథలన్నీ ఎంతో ఉత్సాహంగా వినేవాడు. కన్నయ్యకు ముఖ్యంగా రాములవారి చిన్నతనం కబుర్లు చాలా ఇష్టంగా ఉండేవి. అవి వింటూ పడుకునేవాడు. అలాగే యశోదమ్మ ప్రహ్లాదుడి గురించి, శ్రీనృసింహ అవతారం గురించి కూడా చెప్పేది. కన్నయ్య అవన్నీ ఎంతో శ్రద్ధగా ఆలకించేవాడు.

ఆ రోజు సాయంత్రం దివ్యమండపంలో పండితులవారు శ్రీసీతారామచంద్రుల వారి గురించి చెప్పే ప్రవచనానికి తాము వెళదామని యశోదమ్మ నందునితో అన్నది. నందుడు అలాగే తప్పకుండా వెళదాము! అన్నాడు. నందుడికి కూడా సీతారాములంటే ఎంతో ప్రాణం. ఇదివిన్న కన్నయ్య అమ్మా! నేను కూడా వస్తాను అని అన్నాడు. యశోదమ్మ కన్నా! అక్కడ నీకేది అర్థం కాదు! నీకు అక్కడ ఏమీ తోచదు, ఇంట్లో ఆడుకుంటూ ఉండు అంది. కాని కన్నయ్య వారితో వస్తానని గట్టిగా పట్టు పట్టాడు. అప్పుడు యశోద అలాగే కన్నా! అక్కడ ఏ అల్లరి చెయ్యకుండా ఉండాలి అని అంది. ఓ అలాగే! నేను ఏ అల్లరి చేయకుండా రాములవారి కథ వింటాను అని అన్నాడు. అలాగే అందరం వెళదాం! అంది యశోదమ్మ. కన్నయ్య ఏదో ఆలోచిస్తూ చిలిపిగా చిరునవ్వు నవ్వాడు. యశోదమ్మ అప్పటికే వేరే వైపు తిరిగి ఉండడం వలన ఈ కొంటె కన్నయ్య చిరునవ్వు చూడలేదు.

సాయంత్రం గోకులంలో రామాయణం వినడానికి ఆసక్తిగా ఉన్నవారు దివ్యమండపం వద్దకు చేరుకున్నారు. మండపం చాలా చిన్నది.

మండపం మీద ప్రవచనం చెప్పేవారు కూర్చుని ఉంటే ఎదురుగా నేలపై వినేవారంతా కూర్చునేవారు. అయితే ఈ మండపానికి చుట్టూ పచ్చగడ్డి ఎప్పుడూ ఉండేది. అంతేకాదు ఆ మండపం చిన్న తోటమధ్యలో ఉండేది. ఆ మండపానికి నాలుగు దిక్కులా గోడలు లేకుండా కేవలం పైకప్పు మాత్రమే ఉండేది. యశోదమ్మ వెళ్ళేసరికి అప్పటికే మొదటి నాలుగు వరుసలు భక్తులు కూర్చొని ఉన్నారు. ఒక్కో వరుసలో ఇరవై మంది కూర్చుని ఉన్నారు. అప్పటికే ఆ ప్రవచన కారుడు తన శిష్యులతో వచ్చి మండపం మీద కూర్చుని ఏవో శాస్త్రగ్రంథాలు చూస్తున్నాడు.

కాసేపటికల్లా దాదాపు రెండు వందలమంది కూర్చున్నారు. నందుడు, యశోద పక్కనే కన్నయ్యను కూర్చోపెట్టుకుని వినడానికి ఉత్సాహంగా ఉన్నారు. పండితుడు ప్రవచనాలు మొదలుపెట్టారు. ఆరోజు సీతా కళ్యాణ ఘట్టం. ముందు సంస్కృత శ్లోకం చదివి తరువాత దానిని వివరంగా అర్థం చెప్తున్నారు. అందరూ ఎంతో ఆసక్తితో వింటున్నారు. వారి కంఠం కూడా ఎంతో బాగుంది.

నందుడు, యశోద ప్రవచనంలో పూర్తిగా లీనమైపోయారు. కన్నయ్య అప్పుడప్పుడు వీరి ముఖాలలోకి తొంగి చూస్తున్నాడు. కాసేపటి తరువాత వారు ప్రవచనంలో పూర్తిగా లీనమైపోగానే కన్నయ్య నెమ్మదిగా పక్కనుంచి లేచి మెల్లగా వెళ్ళి మండపం పైన ఆ పండితుల వారి శిష్యుల వెనుక కూర్చున్నాడు. శిష్యులు కూడా కాసేపటిదాకా ఈ పిల్లవాడు వచ్చాడు అని గమనించలేదు. కాసేపటి యశోదమ్మ చూస్తే పక్కన కన్నయ్య లేడు. ఎటు వెళ్ళాడా? అని గాబరా పడింది. ఇంతలో నందుడు అదుగో యశోదా! కన్నయ్య అక్కడ మండపం మీద కూర్చున్నాడు చూడు! అన్నాడు. యశోదమ్మ ముక్కున వేలు వేసుకుని అక్కడకి ఎప్పుడు వెళ్ళాడో? ఏమి అల్లరి చేస్తాడో? అని అనుకుంది. లేచి వెళ్ళి కన్నయ్యను తెద్దామంటే ఆ పండితులువారు ఇబ్బంది పడతారు. వారి ప్రవచన ప్రవాహానికి అడ్డు వస్తుంది అని ఆలోచించి పూర్తి అయ్యాక వెళదాములే అనుకుంది.

పండితుడు ఒక శ్లోకం చెప్పి సీతా కళ్యాణ ఘట్టం ఎంతో అద్భుతంగా చెప్తున్నారు. అప్పుడే పండితుడు ఒక విశేషం గమనించాడు. తాను తరువాతి చెప్పబోయే శ్లోకం లీలగా నెమ్మదిగా ఎక్కడినుంచో తనకి వినపడుతోంది. ఇక్కడ ఉన్నవారు ఎవరో ఆ శ్లోకం చదువుతున్నట్లు అనిపిస్తోంది. ఏదో తన భ్రమ అనుకుని ముందుకు సాగాడు. మళ్ళీ అదే! చాలా నెమ్మదిగా శ్లోకం వినిపిస్తోంది ఆశ్చర్యపోతున్నాడు! తాను తరువాత చదవబోయే శ్లోకం ఇంత శ్రావ్యంగా ఎవరు చదువుతున్నారు? అది కూడా చాలా తక్కువ స్వరంతో ఎంతో మధురంగా ఉంది! అసలు ఎటునుంచి వస్తుందో కూడా తెలియకుండా వినిపిస్తోంది. దీనివల్ల తన ఏకాగ్రత కొంచెం దెబ్బతింటోంది.

ఈ సారి కొంచెం గట్టిగా పరిశీలించాలి అనుకున్నాడు. ఆ స్వరం తన పక్కన మండపంపై కూర్చున్న శిష్యుల వైపునుంచే వస్తుంది. తన శిష్యులెవరైనా చెప్తున్నారా! అయినా ఈ స్వరం నా శిష్యుల స్వరంలా లేదే? అనుకున్నాడు. ఇలా అనుకుంటూ తరువాత శ్లోకంలోకి వెళ్ళి చదివి దాని అర్థం చెప్పసాగాడు. మళ్ళీ నెమ్మదిగా ఆ తరువాత శ్లోకం వినపడుతోంది. పండితుల వారు ఒక్కసారిగా అటువైపుగా తల తిప్పారు. అక్కడ ఒక చిన్న బాలుడు ఈ శ్లోకం చదువుతున్నట్టుగా గ్రహించారు. సరే ఒక తమాషా చేస్తాను అని మనస్సులో తలిచాడు. ఈ శ్లోకం తరువాత ఒక రెండు శ్లోకాలు వదలి మూడో శ్లోకం చదువుతాను అని మనస్సులో అనుకున్నాడు. ఈ శ్లోకార్థం చెప్తూండగానే పక్కనుంచి మూడో శ్లోకం వినపడింది. అక్కడితో ఆ పండితుడి నోట మాట రాలేదు.

అర్థం చెప్తున్నవాడల్లా ఒక్కసారి లేచి ఆ పిల్లవాడిని ఎత్తుకొని మండపం మధ్యకు వచ్చాడు. ఆ పిల్లవాడు మరెవరో కాదు కన్నయ్యే! ఆ పండితుడు తమ కన్నయ్యను ఇలా ఎత్తుకుని తీసుకురావడం చూసిన యశోదమ్మ ఎంతో ఆశ్చర్యపోయింది! ఒక్క క్షణం భయపడింది తన కొంటె కన్నయ్య అక్కడ మండపం మీద కూర్చుని ఏమైనా అల్లరి చేశాడా? అని

భయపడింది. వెంటనే పైకి వెళ్ళి ఆ పండితుడిని క్షమాపణ అడగాలని అనుకుంది. ఇలా ఇంతలో తలుస్తుంటే ఆ పండితుడు ఇలా చెప్పసాగాడు. ఈ పిల్లవాడు ఎవరి పిల్లవాడు తల్లీ? ఇతడు సామాన్యుడు కాడు! శ్రీమద్రామాయణంలోని శ్లోకాలన్నీ చెప్తున్నాడు. ఇతడు ఎవరో పూర్వజన్మలో మహాపండితుడై ఉండాలి. వీరి తల్లీతండ్రి ఇక్కడికి వస్తారా అన్నాడు.

అప్పుడు నందుడు, యశోద ఆ మండపం పైకి వెళ్ళారు. ఆ పండితుడి వీరితో అమ్మా! ఈ పిల్లవాడిని కన్న మీరు ఎంతో ధన్యులు! ఈ పిల్లవాడు ముందు ముందు ఎన్నో అద్భుతాలు చేస్తాడు. ఇతడిని సామాన్య బాలుడిగా తలవ వద్దు అన్నాడు. యశోదకు నందుడికి ఏమీ అర్థం కాలేదు ఈ పండితుడు ఏదో పొరపాటు పడుతున్నాడు. లేకపోతే నిండా అయిదేళ్ళు కూడా లేని తన కన్నయ్య ఏమిటి! సంస్కృత శ్లోకాలు చదవడం ఏమిటి! అనుకున్నారు. ఆ పండితుడి నుంచి కన్నయ్యను తీసుకుని వారి పాదాలకు నమస్కరించి మండపం దిగి తమ స్థానంలో కూర్చున్నారు. ఆ తరువాత పండితుడు మరింత ఉత్సాహంతో సీతా కళ్యాణ ఘట్టం చెప్పి తన ప్రవచనం పూర్తి చేశాడు.

ఇంతకీ విశేషం ఏమిటంటే ఆ పండితుడు కన్నయ్య రామావతారంలో శ్రీరామునిగా జన్మించినప్పుడు తన మిత్రుడే! ఒక సంవత్సరం తనతో ఎంతో సాన్నిహిత్యంగా గడిపాడు. అప్పటి బంధం వలన కన్నయ్య ఈ జన్మలో అతని ముచ్చట తీర్చాడు. ఆ పండితుడి ఆత్మ ఎంతో సంతోషించింది. ఆ పురుషోత్తముని తిరిగి ఇలా కలవడంతో ఎంతో ఆనందంతో ఉప్పొంగిపోయింది.

# 10

యశోదమ్మకు కృష్ణయ్య లీలలు ఒకొక్కటి చూస్తున్న కొద్దీ ఎంతో ఆశ్చర్యం కలుగుతోంది. నిజంగా తన పిల్లవాడు సామాన్యుడు కాదేమో? అని అప్పుడప్పుడు అనిపిస్తోంది. కానీ ఒక పక్క అమాయక మాతృ హృదయంతో ఆ పిల్లవాడి కొంటె ఆటలు, అందరినీ ఆట పట్టించడం చూస్తే అతి సామాన్యుడైన చిన్న పిల్లవాడు చేస్తున్నట్లు చేస్తున్నాడు. కానీ రాక్షసులను సైతం సంహరించడం చూస్తే అమ్మో! అనిపిస్తున్నాడు. నోరు తెరిచినప్పుడు సమస్త బ్రహ్మాండాలని తన నోటిలో దర్శింపచేసిన ఆ క్షణం తలచుకుంటే యశోదమ్మకు ఒళ్ళు గగర్పొడుస్తోంది. తన కన్నయ్య సామాన్యుడు కాదు! ఏ దేవతల అంశతో జన్మించినవాడో! అనిపిస్తోంది.

ఆ రోజు రాత్రి యశోదమ్మ అలాగే ఆలోచిస్తూ నిద్రపోయింది. రోజూ రాత్రి పడుకునే ముందు ఒక పక్కగా నూనెదీపం కొంత తగ్గించి పడుకుంటుంది. అలాగే ఆ రోజు కూడా వత్తిని బాగా తగ్గించి కొద్దిగా వెలుతురు ఉండేలా చూసుకుని నిద్రకు ఉపక్రమించింది. కన్నయ్య పక్కనే

ఉన్నాడు. ఒకరాత్రి వేళ యశోదమ్మకు మెలకువ వచ్చింది. కన్నయ్య నిద్రనుంచి లేచి కూర్చుని అమ్మా! ఆకలి వేస్తోంది ఏమైనా పెట్టవా! అన్నాడు. కన్నయ్య ఇలా ఎప్పుడూ రాత్రి లేచి ఆకలి అని ఎప్పుడూ అడుగలేదు. అటువంటిది ఈరోజు ఆకలి వేస్తుంది అని అడుగుతున్నాడేమిటి? అని ఆశ్చర్యపోయింది. ఇంతలో యశోదమ్మకు ఒక అద్భుతం కనిపించింది. వీరు పడుకున్న చోటికి కాస్త మూలకు ఉన్న దీపపు వెలుగు కన్నయ్య మీద పడి వెనుక గోడపై ఆ నీడ పడింది.

ఆ నీడ చూసి యశోదమ్మ నోట మాట రాలేదు. ఎందుకంటే అక్కడ నీడలో శ్రీమన్నారాయణులవారి స్వరూపం కనిపించింది. తన కన్నయ్య చూస్తే చిన్నపిల్లవాడు వెనుక నీడ కూడా చిన్నదిగా ఉండాలి. అది కూడా కన్నయ్య రూపమే కనపడాలి కదా మరి ఇదేమిటి? ఆ గోడ మొత్తం వ్యాపించి శంఖ చక్రా గదాధరుడై ఉన్న శ్రీమన్నారాయణులవారి నీడ కనిపిస్తోంది ఏమిటి? ఆహా! తన జన్మ ధన్యమైంది. తన కన్నయ్య నిజంగా సామాన్యుడు కాదు! ఆ శ్రీమన్నారాయణులవారి అనుగ్రహంతో జన్మించాడు. చూడండి! యశోదమ్మ ఎంత అమాయకురాలో! ఇప్పటికి తన కన్నయ్య ఆ మహావిష్ణువు అనుగ్రహంతో జన్మించిన పిల్లవాడు అనుకుంటోంది గానీ! సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడే తన ముద్దుల కుమారుడు! అని ఇంకా గ్రహించలేదు. కానీ మనస్సులో ఎంతో సంతోషపడింది.

వెంటనే కన్నయ్యనెత్తుకుని వంట ఇంటిలోకి తీసుకువెళ్ళి వెన్న ఉండలు పెట్టింది. నాన్నా రాత్రివేళ ఎక్కువ తినకూడదు మళ్ళీ కడుపునొప్పి వస్తుంది. రేపు స్నేహితులతో ఆడుకోవాలి కదా! రేపు నీ స్నేహితుడి పుట్టినరోజు కూడాను! అని కన్నయ్యతో చెప్తూ ఒక నాలుగు చిన్న వెన్న ఉండలు చేతికి ఇచ్చింది. కన్నయ్య అలాగే అమ్మా! అంటూ వాటిలో మూడు తిని నాలుగోది సగం తీసుకుని అమ్మా! ఈ సగం నువ్వు తినమ్మా అన్నాడు. ఎందుకు కన్నయ్యా! నువ్వే తిను నాన్నా! అంది యశోదమ్మ. లేదమ్మా! నువ్వే తిను అంటూ యశోదమ్మకి ఆ అరముక్క తానే తినిపించాడు. ఆ చిన్న ముక్క

అలా నోట్లో వేసుకోగానే యశోదమ్మకు ఒళ్ళంతా జలదరించినట్లయింది. ఏదో గొప్ప శక్తి ప్రవహించినట్లయింది. అంతే కాదు రాత్రి తాను పడుకునేటప్పుడు ఎంతో తలనొప్పిగా ఉంది. ఆ నొప్పితో అప్పటిదాకా సరిగ్గా నిద్రకూడా పట్టలేదు. అటువంటిది కన్నయ్య చేతిలో ఏ మహిమ ఉందో గాని తానిచ్చిన ఆ వెన్నుండ ఇలా నోట్లో పడిందో లేదో తలనొప్పి కాస్త చేత్తో తీసేసినట్లు వెంటనే తగ్గిపోయింది.

కన్నయ్య దగ్గరకు తీసుకుని యశోదమ్మ ప్రశాంతంగా నిద్రపోయింది. ఆ రాత్రి ఎన్నో రోజుల తరువాత ఎంతో హాయిగా నిద్రపోయింది. ఇంతలో తెల్లవారింది. యశోదమ్మ గోష్టానికి వెళ్ళి పాలు పితికి ఇంట్లోకి తెచ్చింది. ఇంతలో కన్నయ్య కూడా లేచాడు. కన్నయ్య లేచి అటూ ఇటూ పరుగెడుతున్నాడు. ఇంతలో కన్నయ్య స్నేహితుడు రామన్న వచ్చాడు. గోకులంలో కన్నయ్య స్నేహితుల పేర్లు ఏమిటో తెలుసా! రామన్న, రామయ్య, చంద్రాంసుడు, లక్ష్మణుడు, శశాంకుడు ఇలా ఉండేవి. గోకులంలో చాలా మందికి రామాయణం చాలా ఇష్టం. శ్రీరామచంద్రుడంటే వారికి ఎంతో ఇష్టం. వారు అప్పటికే తరతరాలుగా రామాయణ కథ వింటూ వస్తున్నారు. అందుకని కొందరు వారి పుత్రులకు రామలక్ష్మణుల పేర్లు పెట్టుకున్నారు.

ఇలా ఆ రోజు కన్నయ్య స్నేహితుడు రామన్న పుట్టినరోజు. రామన్న ఇల్లు కన్నయ్య ఇంటినుంచి నాలుగో ఇల్లు. నందుడు ఉండే వీధిలో ఇరవై ఇళ్ళు ఉండేవి. ఆ వీధిలో ఇళ్ళన్నీ ఒకవైపే ఉండి ఎదురుగా పెద్ద చెట్లు ఉండి అనేక పూల మొక్కలు ఉండేవి. వీరి వీధి వెనుక ఇంకా ఎన్నో వీధులు ఉండేవి. గోకులంలో అందరూ ఈ వీధిని కన్నయ్య వీధిగా పిలిచేవారు. ఆశ్చర్యం ఏమిటంటే అంతకు ముందు ఆ వీధి పేరు విష్ణు వీధి. కన్నయ్య ఆటలు పాటలు ఎక్కువై, కన్నయ్య రాక్షసుని చంపటంతో అనేక లీలలు చూపించడంతో ఆ వీధిని యాదవులందరూ నెమ్మదిగా కన్నయ్య వీధిగా పిలవడం ప్రారంభించారు.

ఆ రోజు రామన్న పుట్టినరోజు కదా! అతడి తల్లి పిల్లాడిని తీసుకుని కన్నయ్య ఇంటికి వచ్చింది. చూడు యశోదమ్మా! రామన్న ఉదయం లేచినప్పటినుంచి ఒకటే పంతం ఈరోజు కన్నయ్యతో కలిసి మీ ఇంట్లోనే స్నానం చేస్తాడట! ఎంత చెప్పినా వినడం లేదు అన్నది. యశోదమ్మ పోనీలే తల్లీ! పిల్లాడి ముచ్చట తీరుద్దాం. అదీ ఈరోజు వాడి పుట్టినరోజు కదా! రా రామన్నను లోపలకి తీసుకురా! కన్నయ్యతో కలిపి వీడికీ స్నానం చేయిస్తాను అంది.

యశోద, రామన్న తల్లీ ఇద్దరూ కలిసి పిల్లలిద్దరిని తీసుకుని వెనుక దొడ్లోకి వెళ్ళారు. యశోదమ్మ అక్కడ ఇద్దరినీ నుంచో పెట్టి స్నానం చేయించసాగింది. రామన్న ఆనందం చెప్పనక్కర్లేదు. తన స్నేహితుడు కన్నయ్యతో కలిసి స్నానం చేస్తున్నాడు. ఇంతలో కన్నయ్య ఒక్కసారిగా తనకు నీళ్ళు పోస్తున్న బిందెను తీసుకుని తొట్లోనుంచి నీళ్ళు తీసుకుని కొంచెం రామన్న పైన చిమ్మి మిగిలినవి వాళ్ళ అమ్మమీద చిమ్మాడు. ఆ నీళ్ళతో ఆమె ముఖం అంతా తడిసింది. ఒక్కసారిగా జరిగిన ఈ పరిణామానికి యశోదమ్మ రామన్న తల్లీ ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. యశోదమ్మ కన్నయ్యతో కన్నా! ఏంటి ఈ అల్లరి! అంది. మరి కన్నయ్య అల్లరి అలాగే ఉంటుంది. తాను వచ్చిందే వీరందరి ముచ్చట్లు తీర్చడానికే కదా!

# 11

ఆ రోజు పౌర్ణమి చంద్రుడు ఎంతో ప్రకాశవంతంగా చల్లగా ఉన్నాడు. యమున ఆ రోజు రోజూ కంటే ఆనందంగా ఉంది. యమున ఎంతటి అదృష్టవంతురాలు? కృష్ణయ్య సాన్నిహిత్యం, రాధాకృష్ణుల అద్భుత ప్రేమ లీలలను చూసి నిత్యం మురిసిపోయే భాగ్యం కలిగిన ఏకైక అదృష్టవంతురాలు యమున. యమునను చూసి మిగిలిన నదులన్నీ ఈర్ష్య పడుతుంటాయట. నిత్యం కన్నయ్యను చూసే ఎంత గొప్ప భాగ్యం నీకు అని అనుకుంటాయట.

ఆ రోజు రాధ రాత్రి పదిగంటలకల్లా యమున వద్దకు వచ్చింది. కృష్ణయ్య కోసం ఎదురుచూస్తూ ఉంది. కృష్ణయ్య వస్తానని చెప్పిన సమయం అప్పటికే ఒక గంట దాటిపోయింది. ఇంకా రాలేదు. ప్రతీ చిన్న చప్పుడు వినపడినా కన్నయ్య వస్తున్నట్లే అనిపిస్తోంది. కొన్ని కుందేళ్ళు అక్కడే అటూ ఇటూ గంతులు వేస్తూ తిరుగుతున్నాయి. రాధ మధ్య మధ్యలో ఆ శబ్దానికి

కన్నయ్య వస్తున్నాడు అనుకుంటోంది. మళ్ళీ ఇంతలో నిరాశ. ఇంతలో చక్కటి వేణునాదం వినిపించసాగింది. ఆహా! ఇక తన కన్నయ్య రాబోతున్నాడని ఎంతో ఆనందపడింది. ఇంతకీ ఆ శబ్దం కన్నయ్య వేణునాదం కాదు! ఒక్కసారిగా పక్కన ఉన్న చెట్లపైనుంచి వీచిన గాలి! ఒక అద్భుతమైన అతి నెమ్మది శబ్దంతో అలా రాధ పక్కగా వీస్తూ వెళ్ళింది! గాలి కూడా నీటి కెరటాలలాగా వెళుతుంటే అలా ఆ గాలి పక్కన ఉన్న చెట్ల మధ్యనుంచి వస్తూ ఒక చిన్న మేఘంలా శబ్దం చేసుకుంటూ అలా రాధ పక్కనుంచి వెళుతూ ఉంటే పూర్తిగా కన్నయ్య ఆలోచనలతో మునిగి ఉన్న రాధకి ఆ గాలి కెరటం వేణునాదంలాగా వినిపించింది.

ఈ గాలి భలే మోసం చేస్తోంది రాధని. విశేషం ఏమిటంటే అటు గాలికి ముచ్చటగా ఉంది. ఇటు రాధకి కాస్త కోపంగాను, ముచ్చటగాను ఉంది. అసలు కన్నయ్య కోసం ఎదురుచూడడంలోనే ఎంతో ఆనందం ఉంది రాధకు. కన్నయ్య కోసం రాధ ఎదురుచూడడం. కన్నయ్య రాధ కోసం ఎదురుచూడడం వీరిద్దరి కలయిక కోసం ప్రకృతి ఎదురుచూడడం! ఇదంతా ఒక గొప్ప ప్రణయ గీతిక. రాధాకృష్ణుల దివ్య ప్రేమతత్వాన్ని పూర్తిగా గ్రహించినవారు ఎంతో అదృష్టవంతులు! ఆ అద్భుత ప్రేమతత్వం తెలిస్తే శరీరమంతా ఎంతో తన్మయత్వంతో పులకరించిపోతుంది.

ఇంతలో కన్నయ్యరానే వచ్చాడు. కన్నయ్య ఆలస్యంగా వచ్చాడని రాధ కాస్త ముఖం ముడుచుకుంది. ఇలా రాధ ముఖం ముడుచుకోగానే అక్కడ పక్కనే వెన్నెల్లో ఎంతో తెల్లగా మెరిసిపోతున్న మల్లెలు కొంచెం వాడిపోయాయి. దగ్గరలో ఉన్న చేమంతులు కూడా వాడిపోయాయి. రాధమ్మకు వచ్చిన కోపంతో అక్కడ ప్రకృతి కూడా కొంచెం చిన్నబుచ్చుకుందా! అన్నట్లుంది. అప్పటిదాకా రాధ తన కన్నయ్య కోసం ఎంతో ఆత్రంగా ఎదురుచూసిన ఆ కుందేళ్ళ జంట కన్నయ్య రాగానే ఎంతో సంతోషపడ్డాయి. వీరిద్దరినీ చూసి ఆ కుందేళ్ళు ముచ్చటపడి ఆ పక్కనే ఉన్న పొదల్లోకి దూకుతూ వెళ్ళాయి. కన్నయ్య రాకకోసం రాధకు ఆనందం

కలిగేలా అప్పటిదాకా అక్కడ నృత్యం చేసిన ఒక నెమలి కన్నయ్య రావడంతో కొంచెం దూరంగా వెళ్ళి నృత్యం చేస్తోంది. ఆ యమునా తీరాన ఆ వెన్నెల రాత్రి కృష్ణుడికై ఎదురుచూస్తున్న రాధను చూసిన ఆ జీవులన్నీ రకరకాల అనుభూతులకు లోనయ్యాయి. కన్నయ్య రావడం దూరం నుంచి చూసిన కోయిల ఎంతో ఆనందంగా కూసింది. ఆ కోయిల గానానికి రాధ మనస్సుకి ఎంతో హాయిగా అనిపించింది. కన్నయ్య రాగానే రాధ ఎంతో సంతోషపడి కళ్ళు పెద్దవి చేసుకుని కన్నయ్యను తనివితీరా చూసుకుంది.

కన్నయ్య వచ్చి అక్కడే ఉన్న రాయిపై కూర్చున్నాడు. రాధ కన్నయ్య పాదాలవద్ద కూర్చుని తల కన్నయ్య కాళ్ళ మీద పెట్టుకుని మురెపంగా తల పైకి ఎత్తి కన్నయ్యను చూస్తోంది. పైన ఆకాశంలో ఉన్న పున్నమి జాబిలి వీరిద్దరినీ చూసి ఎంతో ముచ్చటపడింది. అప్పుడు కృష్ణుడు నెమ్మదిగా పిల్లనగ్రోవి తీసుకుని ఊదసాగాడు. ఆ వేణుగాన మాధుర్యంతో రాధ తాను వేచి చూసిన బాధ అంతా మరిచిపోయింది. మనస్సు ఎంతో ఆనందపడింది. ఇంతలో రాధ కన్నయ్యతో కృష్ణా! అలా యమునపై విహరించి వద్దామా! అంది. అలాగే పద రాధా! అని కన్నయ్య రాధను చేయి పట్టుకుని పైకిలేపి అక్కడే ఒడ్డున ఉన్న పడవలోకి తీసుకుని వెళ్ళాడు. ఇంతలో ఎక్కడినుంచి వచ్చాయో రెండు నెమళ్ళ జంటలు ఒక్కసారిగా ఎగురుతూ వచ్చి ఆ పడవలో కూర్చున్నాయి. రాధ వీటిని చూసి ఎంతో ముచ్చటపడింది. ఇదేంటి కృష్ణా! ఈ అర్థరాత్రి మనతో ఈ యమున విహారానికి వచ్చాయి ఏమిటి? అంది. రానీ రాధా! వాటికి ఇదో ముచ్చట కాబోలు అన్నాడు.

కన్నయ్య రాధతో ఇలా అంటుండగా ఒక చిలకల జంట ఎగురుతూ వచ్చి ఒక చిలుక రాధ భుజం మీద ఒకటి కన్నయ్య భుజం మీద వాలాయి. ఇంతలో పడవ నెమ్మదిగా బయలుదేరింది. యమున ఇలా వీరందరినీ ఈ పున్నమి నాటి రాత్రి చూసి ఎంతో ముచ్చట పడింది. ఆనందంతో ఆనాడు యమున కెరటాలు ఎంతో తేజస్సుతో ప్రకాశిస్తున్నాయి. యమునలో పడిన చంద్రబింబపు ఛాయ ఆ అలల తేజస్సుకు మరింత గొప్పగా కనబడుతోంది.

పడవ అలా యమునలోకి సాగుతూ ఉంటే రాధ కన్నయ్యతో ఇలా అంది కన్నయ్యా! ఇలా నీటిలో చూడు ఆ చంద్రబింబం మనతోనే వస్తున్నట్లు ఉంది కదా! అంది కన్నయ్య చిరునవ్వు నవ్వుతూ నీటిలోకి చూసి అవును అన్నాడు. ఇంతలో ఒక్కసారిగా కొన్ని వందల చేపలు పడవకు అటూ ఇటూ ఈదసాగాయి. అవన్నీ మధ్య మధ్యలో పడవ చుట్టూ ఒక వలయంలా ఏర్పడి కాసేపు రెండుపక్కలకు పోతూ మళ్ళీ ముందుకు వచ్చి ఈదుతూ వెళుతున్నాయి. ఈ చేపలు ఎంతో చిన్నవిగా ఉండి ఎంతో అద్భుతమైన రంగు రంగులతో చూడడానికి కంటికి ఎంతో ఇంపుగా ఉన్నాయి.

ఆ చేపల కళ్ళు ఎంతో అద్భుతంగా ఉన్నాయి. రాధ వాటి కన్నుల వంక ఎంతో ముచ్చటగా చూస్తోంది. మధ్య మధ్యలో కొంచెం వంగి వాటిని ముట్టుకుందామని చూస్తోంది. ఆ పడవలో ఉన్న నెమళ్ళు అటూ ఇటూ ఎగురుతూ ఆ చేపల వంక చూస్తున్నాయి. వాటికి కూడా ఈ రంగు రంగుల చేపలను చూసి ఎంతో ముచ్చట వేసింది. ఆ నెమళ్ళ జంటలు ఆనందంతో ఆ పడవలోనే నృత్యం చేయసాగాయి. అటూ ఇటూ కదలడానికి ఎక్కువ వీలు లేనప్పటికీ ఒక నెమలి రాధ పక్కన మరొక నెమలి కన్నయ్య పక్కన ఆ పడవలోనే అద్భుతంగా నృత్యం చేయసాగాయి.

ఇందాక వచ్చిన ఆ చిలుకలు కూడా ఆ నెమళ్ళ నృత్యం ఆనందంగా చూస్తూ ఒక చిలుక రాధా! రాధా! అని మరొక చిలుక కృష్ణా! కృష్ణా! అని పలకసాగింది. ఆ చిలుకల పలుకులు విని రాధాకృష్ణులిద్దరూ ఎంతో సంతోషించారు. తమ ఆనందం కోసం ఇదంతా తన కన్నయ్యే చేసే లీల! అని రాధ ఎంతో ముచ్చట పడింది. పడవ మళ్ళీ ముందుకు కదలసాగింది. యమున ఆ దృశ్యాన్ని చూసి ఎంతో పులకరించిపోయింది. ఇదంతా చూసి ఎంతో ఆనంద పడుతూ వరుణ దేవుడు చాలా సన్నటి తుంపర కురిపించాడు.

ఆ అర్థరాత్రి వేళ రాధాకృష్ణులు నెమళ్ళతో, రామచిలుకలతో పడవచుట్టూ రంగు రంగుల చేప పిల్లలతో అలా విహరిస్తుంటే ఆ దృశ్యం

ఎంతో కన్నుల పండుగగా ఉంది. వారందరినీ చూస్తుంటే మనకి ఎంత ఆనందం కలుగుతోందో చూడండి!

అప్పుడు కన్నయ్య తన వేణువు తీసి నెమ్మదిగా ఊదసాగాడు. కృష్ణుడు వేణువు ఊదిన ప్రతీసారి ఒకొక్కసారి ఒకొక్క రకమైన దివ్య తరంగాలు ప్రసరిస్తుంటాయి. కన్నయ్య వేణునాదం నుంచి అద్భుతమైన కాస్మిక్ తరంగాలు వెలువడుతుంటాయి. కన్నయ్య వేణువుపై చేయిపెట్టి ఆ వేళ్ళతో ఆ అధరాలపై వేణువు ఊదడం మొదలు పెట్టగానే వచ్చే ఆ దివ్య తరంగాలు ఒకొక్కసారి ఒకొక్క లయలో ఉంటాయి.

కన్నయ్య అలా తాను గోకులంలోను, బృందావనంలోను ఉన్నప్పుడు గోపబాలురలతో ఆడుతున్నప్పుడు ఆవులను మేతకు తీసుకువెళుతున్నప్పుడు, తోటలలో విహరిస్తున్నప్పుడు, గోపికలతో ఆడుతున్నప్పుడు సాయంత్రవేళ ఆవులతో పాటు ఇంటికి వస్తున్నప్పుడు, ఒకొక్కసారి తానొక్కడే యమున ఒడ్డున కూర్చున్నప్పుడు ఇలా అనేక సందర్భాలలో అనేక రీతులలో తాను వేణువు ఊదుతాడు. కన్నయ్యకు ఏ సమయంలో ఏ విధమైన స్వరంతో వేణువు ఊదాలో... ఏది అప్పుడు ఎవరికి, ప్రకృతికి అవసరమో... అలా తాను వేణువు ఊదుతాడు.

కన్నయ్య వేణువు నుంచి ఆ కాస్మిక్ తరంగాలు జీవుల హృదయాలను తాకి ఎంతో అద్భుతమైన ఆనందానికి ఆ జీవులన్నీ లోనౌతాయి. ఆ వేణునాదానికే గోపికలు కూడా ఎంతో పరవశమై దివ్యానుభూతికి లోనౌతారు. ఆ వేణునాదానికి ఆవులు ఎంతో ఆనందపడి మరిన్ని ఎక్కువ పాలను ఇస్తాయి. ఆ దివ్యనాదానికి నెమళ్ళు ఎంతో ఆనందపడి అద్భుతంగా నృత్యం చేస్తాయి. ఈ ప్రకృతి మొత్తం ఆ లయలో బ్రహ్మానందంతో లీనమై ఒక దివ్యానుభూతికి లోనౌతుంది. ఈ వేణుగానాన్ని ఆస్వాదించిన జీవులు కొన్ని జీవించి ఉండగానే మోక్ష అనుభూతి చెందాయట. అంత అద్భుతంగా ఉంటుంది ఆ దివ్య వేణునాదం.

ఆ రోజు అలా కన్నయ్య వేణుగానం విన్న ఆ చిలుకలు నేటి కలియుగంలో గొప్ప వేణుగాన విద్వాంసులుగా ప్రసిద్ధి పొందారు. ఈ చిలుకలు రెండూ అంతకుముందు రామయ్య త్రేతాయుగంలో నదిని దాటేటప్పుడు ఆ పడవలో ఉన్నవారు. అవతల ఒడ్డుకు చేరిన రామయ్య వారు కూడా తనతోపాటు వస్తాము అంటే వారిని వద్దని వాదించి తాను వచ్చే యుగంలో కృష్ణుడిగా జన్మిస్తానని అప్పుడు వారిద్దరూ గోకులంలో రెండు పక్షులుగా జన్మించి తనతోపాటు ఒకనాడు యమునా నదిలో విహరిస్తారని అన్నాడు.

అలా వారికిచ్చిన మాట ప్రకారం ఈనాడు వాటితో కలిసి యమునా విహారం చేస్తున్నాడు. అక్కడితో ఆ జీవులు ఎంతో ఆనందానికి లోనయ్యాయి. అంతే కాకుండా కన్నయ్య అనుగ్రహం చేత రాధాకృష్ణుల నామాలను కూడా వాటి నోట పలికారు. ఎంతటి మహాభాగ్యం కదా అది!

రాధాకృష్ణుల మధుర నామం ఆ విధంగా ఆ దివ్యమైన రాత్రి ఎన్నో సార్లు తలుస్తూ ఉండటం! కన్నయ్య రాధకు ఈ రామచిలుకల పూర్వజన్మ వృత్తాంతం తెలిపాడు. రాధ అది విని కన్నయ్య భక్త వాత్సల్యానికి ఎంతో సంతోషపడింది.

కన్నా! ఎంత ప్రేమ స్వరూపుడివయ్యానీవు! ఈ సృష్టిలో నీ ప్రేమ నోచుకున్న జీవులన్నీ ఎంత పుణ్యం చేసుకున్నాయో కదా! అంది. అటు తరువాత పడవ నెమ్మదిగా వెనుకకు ఒడ్డుకు రాసాగింది. అలా వస్తుంటే కన్నయ్య రాధకు ఎన్నో కబుర్లు చెప్పసాగాడు.

అదిగో రెండు చేతులు చుబుకం కింద పెట్టుకుని కన్నయ్య కబుర్లు వింటున్న ఆ రాధను చూడండి! ఎంత ఆనందంగా వింటోందో ! చూసిన ఆ నెమళ్ళు, ఆ రామచిలుకల జంట, పైన చంద్రుడు, ఎంత ముచ్చట పడుతున్నారో! ఇక యమున ఆనందం అయితే చెప్పనక్కర్లేదు.

రాధాకృష్ణుల పడవ వెనుకకు తిరగ్గానే పడవ చుట్టూ తిరుగుతున్న చేపలు కూడా ఒక్కసారిగా వెనక్కి తిరిగి పడవ వెంటే రాసాగాయి. అలా ఆ చేపలు ఆ రాధాకృష్ణులు ఒడ్డున దిగగానే తిరిగి వెనక్కి వెళ్ళిపోయాయి. ఆహా! అలా ఎంతో ఆనందంతో నీటిలో పైకి కిందకి దూకుతూ వెన్నెల కాంతికి కళ్ళు మెరుస్తూ వెళుతున్న చేపల రంగుల సమూహాన్ని చూడండి ఎంత ముచ్చటగా ఉందో! రాధాకృష్ణులు ఒడ్డుకు చేరగానే నెమళ్ళు ఎగిరిపోయాయి. రామచిలుకలు కూడా రాధా! రాధా! కన్నా! కన్నా! అంటూ వీరి భుజాలపైనుంచి రివ్వున ఎగిరి వెళ్ళిపోయాయి. రాధ ఆ చిలుకలు తమ నామాలు పలుకుతూ ఎగురుతూ వెళుతుంటే ఆ నామాలు వినపడేంతవరకూ అలా చూస్తూనే ఉంది.

ఆనాటి రాత్రి రాధాకృష్ణుల యమునా విహారం అలా జరిగింది. ఇలా ఆ ప్రేమ మూర్తులు ఎన్నోసార్లు యమునా విహారం చేసారు. ఈనాటికి వెన్నెల రాత్రుల్లో రాధాకృష్ణులు యమునలో విహరిస్తారు. యోగులకు, సిద్ధులకు మాత్రమే వారు దర్శనమిస్తుంటారు. అందుకే నేటికి యమున మరింత ప్రకాశవంతంగా, మరింత తేజోవంతంగా, మరింత ఆనందంతో కనబడుతుంటుంది.

# 12

శ్రీకృష్ణుడు ఎంతో అద్భుతమైన ప్రేమ స్వరూపుడు. ఆ స్వామి గోకులంలో చిన్నపిల్లవాడిగా తిరుగుతున్నప్పుడు అక్కడ ఉన్న జీవులన్నీ ఎంతో ఆనందపడ్డాయి. ఆ స్వామిని చూడడమే కాకుండా ఆ చిన్న బాలునితో ఆటలు ఆడుతున్న గోపబాలురు, గోపికలు ఎంతో అదృష్టవంతులు. వారిలో ఆ కన్నయ్యతో ఎంతో సాన్నిహిత్యంగా ఉన్న కొందరు అటు తరువాతి కాలాలలో ఎంతో గొప్ప ప్రేమ మూర్తులై ఈ ప్రపంచానికి కృష్ణతత్వాన్ని, ఆ స్వామి మధుర ప్రేమతత్వాన్ని ఎంతో గొప్పగా లోకానికి అందించారు. కొందరు గ్రంథాలతోను కొందరు కీర్తనలతోను ఆ దివ్య ప్రేమతత్వాన్ని ఆవిష్కరించారు.

ఇలా ప్రస్తుత కలియుగంలో ఎందరో అపూర్వ కృష్ణ భక్తులుగా జన్మించి మన మధ్య తిరిగిన, తిరుగుతున్న వీరందరూ అలా ఆ కాలంలో

కృష్ణయ్యతో ఎంతో సన్నిహితంగా కన్నయ్యకు ఎంతో ఆప్తులుగా మెలిగినవారే. మన అదృష్టం కొద్దీ మనం ఉన్న కాలంలో అటువంటి వారిని ఎవరినైనా మనం గుర్తించగలిగితే అది ఎంతో భాగ్యంగా గ్రహించి వారిని ప్రేమించాలి. వారు చెప్పే ప్రేమతత్వం పూర్తిగా అర్థం చేసుకోవాలి. వారిని సేవిస్తే ఆ కన్నయ్యని సేవించినట్లే!

ఇటువంటి ప్రేమ మూర్తులు ఇప్పటికీ మన మధ్య ఎటువంటి కామక్రోధాలు లేకుండా కేవలం అనంతమైన ప్రేమతత్వంతో అందరికీ ప్రేమామృతాన్ని పంచుతూ మన మధ్యనే జీవిస్తున్నారు. వారు పూర్తి ప్రేమ తత్వంతో నిండి ఉండడం వలన వారి చెంత కూర్చుంటేనే మనకు మనస్సు, శరీరం ఎంతో ఆనందంగా అనిపిస్తాయి. మనం నోటితో వర్ణించలేని గొప్ప ఆనందాన్ని వారి సన్నిధిలో అనుభవించగలుగుతాము. మన లోపలి ఆత్మ అటువంటి మహనీయుల సన్నిధిలో ఎంతో దివ్యానందాన్ని పొందుతుంది.

ఆనాడు గోకులంలో కృష్ణయ్య ఎంతో అనుగ్రహించిన పుణ్యమూర్తులు ఎందరో! అటువంటి వారిలో ఒక ముసలి అవ్వ కథ ఇప్పుడు తెలుసుకుందాం! గోకులంలో అనేక వీధులు ఉండేవి. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే చిన్ని కన్నయ్యగా పరుగెత్తిన, ఆటలు ఆడిన ఆ ప్రదేశం ఎంతో పవిత్రమైనది, పావనమైనది.

ఆనాటి గోకులంలో అనేక వీధులు ఉండేవి. ప్రజల సౌకర్యార్థం ఒకొక్క వీధికి ఒకొక్క పేరు పెట్టుకున్నారు. ఆ వీధుల పేర్లు ఇలా ఉండేవి రామ వీధి, నారాయణ వీధి, త్రిశూల వీధి, దివ్య వీధి, కనక వీధి, బ్రహ్మాండ వీధి... ఇలా అనేక వీధులు ఉండేవి. ప్రతీ వీధి పేరుకు ఒక ప్రత్యేక విశేషం ఉండేది. రామ వీధిలో పూర్వకాలంలో ఆ ప్రదేశంలో త్రేతాయుగంలో ఒక గొప్ప రామభక్తుడు అక్కడ ఉండేవాడని అతనితో శ్రీరామచంద్రుడు నిత్యం మాట్లాడుతూ ఉండేవాడని అంతే కాక అతనితో ఆడుకునేవాడని ఎన్నో శాస్త్ర విషయాలు అతనితో మాట్లాడేవాడని ప్రజలు చెప్పుకునేవారు. అందుకని ఆ వీధిని రామ వీధి అని రామ్‌మార్గ్ అని పిలుస్తుండేవారు. ఆ వీధి గుండా వెళ్ళే

ప్రజలు ఒక్క క్షణం శ్రీరామచంద్రుని మనస్సులో ప్రార్థించేవారు. ఇప్పటికీ ఎంతో అనన్య భక్తులు ఆ ప్రదేశం నుంచి వెళుతున్నప్పుడు వారికి మనస్సులో శ్రీహనుమత్ లక్ష్మణసమేత శ్రీసీతారాముల రూపం ఆవిష్కృతం అవుతుంది. ఇది ఎందరో గొప్ప రామ భక్తుల ప్రత్యక్ష అనుభవం. అయితే ఆ ప్రదేశం దాటి రాగానే ఆ దృశ్యం మన మనస్సులోనించి అదృశ్యమౌతుంది.

అలాగే నారాయణ వీధి కూడా ఎంతో విశిష్టమైనది. ఆ వీధిలో కృతయుగంలో నారాయణ అనే ఒక గొప్ప మహర్షి తపస్సు చేసుకున్నాడు. అతడి తపస్సుకి మెచ్చి ఆ స్వామి అక్కడకి ప్రత్యక్షమైనాడని ఆ మహర్షి ఇప్పటికీ పెద్ద చెట్టు రూపంలో ఇప్పటికీ ఉన్నాడని ప్రజలు నమ్మేవారు. అంతేకాదు ఆ చెట్టుకింద నుంచొని ఎవరైనా శ్రీమన్నారాయణా అని పిలిస్తే ఎంతో ఆశ్చర్యకరంగా ఊ! అని వినిపించేదట. శ్రీమన్నారాయణుడి సైతం ఆ చెట్టుని అప్పుడప్పుడు ఆవహించి ఉంటారని చెప్పుకునేవారు.

ఆ చెట్టు ద్వాపరయుగంలో గోకులంలో ఎన్నో పూజలు అందుకుని ప్రస్తుత కలియుగం రాగానే పూర్తిగా మాయమైంది. గోకుల వాసులు అప్పుడే జన్మించిన ఆవుదూడలను ఆ చెట్టుకిందకు తీసుకొచ్చేవారు. అలా ఆ చెట్టుకింద కాసేపు ఉంచితే ఆ లేగదూడలు ఎంతో ఆరోగ్యంగా ఉంటాయని వారి విశ్వాసం. మన కృష్ణయ్యకు ఈ చెట్టుదగ్గర ఆడుకోవడం ఎంతో ఇష్టం. ప్రతీ పదిహేను రోజులకు తన స్నేహితులందరితో కలసి ఈ చెట్టుకింద ఆడుకునేవాడు. అందరూ ఆ చెట్టుకొమ్మలు ఎక్కి ఊగేవారు. ఒకొక్కసారి కన్నయ్య ఆ చెట్టుకింద ధ్యానముద్రలో కనులు మూసుకుని కూర్చునేవాడు. తోటి గోపబాలురకు కన్నయ్య అలా ఎందుకు చేస్తున్నాడో అర్థమయ్యేది కాదు.

అలా ధ్యానం చేస్తున్నప్పుడు కన్నయ్యకు ఆ ప్రదేశంలో మునుపటి కృత, త్రేతాయుగంనాటి విశేషాలు, అక్కడ తపస్సు చేసుకున్న మహాభక్తులు మనస్సులో కనిపించి వారిని చిరునవ్వుతో అనుగ్రహించేవారు. అలా కాసేపు ధ్యానంలో ఉండి తిరిగి స్నేహితులతో కలిసి ఆడుకునేవాడు. కన్నయ్యకు ఈ

చెట్టుకింద కూర్చుని వేణువు ఊదడం ఎంతో ఇష్టం. రాధ వచ్చినప్పుడు రాధను కూడా ఈ చెట్టువద్దకు తీసుకుని వచ్చేవాడు. గోకులం నుంచి బృందావనానికి వెళ్ళే బాటలో ఇటువంటి చెట్లను ఇప్పటికీ చూడవచ్చును. ప్రతీ చెట్టుకు ఒక గొప్ప దివ్యమైన గాథ ఉంది.

అసలు గోకులం నుంచి బృందావనం దాకా ఉన్న ప్రాంతం అంతా ఒక అద్భుతమైన తేజస్సుతో ప్రకాశిస్తూంటుంది. గోకులం నుంచి బృందావనం వెళ్ళే భక్తులు ఎంతో అనిర్వచనీయమైన అనుభూతులకు లోనౌతారు. ఆ ప్రదేశం అంతా సాక్షాత్తూ కృష్ణయ్య ఆడుకున్న ప్రదేశం. రాధాకృష్ణులు ఆటలు ఆడుతూ, నృత్యం చేస్తూ, ఎన్నో ముచ్చట్లు చెప్పుకుంటూ తిరిగిన గొప్ప ప్రదేశం. అందుకే ఈనాటికి ఆ ప్రదేశానికి ఎంతో అద్భుతమైన శక్తి ఉంది.

నారాయణ వీధి చివరలో ఒక ముసలి అవ్వ పల్లీలు అమ్ముతూ ఉండేది. కన్నయ్యకు ఆ పల్లీలు అంటే ఎంతో ఇష్టం. అప్పుడప్పుడూ స్నేహితులతో కలిసి వచ్చి ఆ అవ్వ దగ్గర కూర్చుని పల్లీలు తినేవాడు. ఆ అవ్వకి కూడా కన్నయ్యను చూస్తే ఎంతో ముచ్చటపడేది. కన్నయ్య తల్లి యశోదమ్మను అడిగి నాణేలు తీసుకువచ్చి ఈ అవ్వకు ఇవ్వబోయేవాడు.

ఆ అవ్వ కన్నా! నీదగ్గర డబ్బు తీసుకోవడం ఏమిటి? నువ్వు నావద్ద పల్లీలు తినడమే నా అదృష్టం అనేది. నిజంగా అంతే కదా! ఈ విశ్వం మొత్తానికి అన్నీ ఇచ్చేవాడు తానే వచ్చి అడుగుతున్నాడంటే! ఆ అవ్వది ఎంతటి భాగ్యం కదా! అలా కన్నయ్య కావాలని అడిగి మరీ రకరకాల పిండి వంటలు చేయించుకుని ఎంతో ఇష్టంగా ఆరగించి అనుగ్రహించిన భక్తులు నేటికి మన మధ్యన ఉన్నారు. ఆ ముసలి అవ్వ కన్నా! డబ్బులు వద్దు నా కోసం కాసేపు నీ వేణువు ఊదవయ్యా! అనేది.

అప్పుడు కన్నయ్య పల్లీలు తిన్నతరువాత ఆ అవ్వదగ్గర కూర్చుని ఎంతో మధురంగా వేణువు ఊదేవాడు. ఆ వేణునాదం ఎంత మధురంగా

ఉండేది అంటే అది వింటున్నంతసేపు ఆ అవ్వ కనుల వెంట నీరు కారుతూ ఉండేది. ఆ అవ్వ ఆనందంతో అంతగా పరవశించిపోయేది. కన్నయ్య వేణునాదం ఒకొక్క సమయాలలో ఒకొక్క భక్తుని వద్ద ఒకొక్క అద్భుత, ప్రత్యేక రీతులలో ఉండేది. అలా అవ్వ వద్ద ఊదుతున్నప్పుడు ఎవరైనా కృష్ణ భక్తుడు ఎంతో ఆర్తితో వేణువు ఊదుతాడో ఆ రాగం అలా ఉండేది.

ఇలా ఆ అవ్వ దగ్గర ఊదుతున్నప్పుడు అటుగా వెళుతున్న గోపికలు, యాదవులు ఇక్కడ కాసేపు ఆగి వినేవారు. ఆ అద్భుత వేణుగానానికి మైమరిచి కాసేపు అక్కడే కూర్చునేవారు. వారికి అక్కడినుంచి ఒక అంతట వెళ్ళడానికి మనస్సు ఒప్పుకునేది కాదు. అంత అద్భుతంగా ఉండేది ఆ వేణునాదం.

ఆ రోజు కన్నయ్య అలాగే ఇద్దరి స్నేహితులను వెంటపెట్టుకుని ఆ అవ్వదగ్గరకు వచ్చాడు. కొన్ని పల్లీలు అడిగి తీసుకున్నాడు. తిన్నాక కాసేపు వేణువు ఊదాడు. ఆ రోజున ఆ వేణునాదం మరింత అద్భుతంగా ఉంది. అది వింటున్న ఆ అవ్వకి తన స్నేహితులకి శరీరం అంతా ఎంతో ఆనందంతో ఉప్పొంగిపోయింది. అటుతరువాత కన్నయ్య ఆ అవ్వదగ్గరకి వచ్చి అవ్వ నువ్వు కనులు మూసుకుని రెండు చేతులు దోసిలి పట్టు అన్నాడు.

ఆ అవ్వ అలాగే కనులు మూసుకుని చిరునవ్వు నవ్వుతూ రెండు చేతులు ముందుకు చాచి దోసిలి పట్టింది. అప్పుడు కన్నయ్య అవ్వ చేతుల్లో తన చేతిలోంచి బంగారు నాణేల వర్షం కురిపించాడు. అలా గల గలమని శబ్దం చేస్తూ ఆ బంగారు నాణేలు అవ్వ చేతులో పడుతుంటే ఆ అవ్వ ఆశ్చర్యపోయింది. ఇంక ఆ దోసిలి పూర్తిగా నిండి వెంటనే కనులు తెరిచింది. ఇదేంటి కన్నయ్యా! నాకు వద్దు ఈ బంగారు నాణేలు. నన్ను పరీక్షించడానికా తండ్రీ! అంది.

లేదు అవ్వా! నువ్వు ఇంక ఈ వయస్సులో ఎంత కాలం ఎండలో వానలో కూర్చుని కష్టపడతావు. ఈ బంగారు నాణేలుతో నువ్వు సుఖంగా

జీవించు అన్నాడు. అవ్వ అందుకు ససేమిరా అంది. కన్నా! నీ చేతులు పట్టు! ఇవన్నీ నీకే ఇస్తాను అని కళ్ళు మూసుకుని మనస్సులో కన్నయ్యను ధ్యానించి ఆ నాణేలు అన్నీ తిరిగి కన్నయ్య దోసిట్లోనే పోసింది. ఆశ్చర్యం! ఆ నాణేలు అన్నీ కన్నయ్య దోసిలిలో పడగానే పుష్పాలుగా మారాయి. అవ్వ అలా అన్ని నాణేలును కన్నయ్య చేతిలో పోసింది. తన చేతిలో కేవలం రెండు నాణేలు మాత్రమే ఉంచుకుంది. కళ్లు తెరచి చూసిన అవ్వ ఆ పుష్పాలను చూసి ఎంతో ఆనందించింది.

ఇది ఆమె అపూర్వ కృష్ణ భక్తి! అచంచల భక్తి అంటే ఇదే! ఆ పుష్పాలతో చిన్ని కన్నయ్యను, ఆ పురుషోత్తముని అలా అర్చించింది. కన్నా! ఈ రెండు నాణేలను మాత్రం నీ బహుమానంగా నేను అపూర్వంగా దాచుకుంటాను అని ఆ రెండిటిని కళ్ళకు హద్దుకుని తన చీరకొంగున ముడి వేసుకుంది. ఆ తరువాత కొంతకాలానికే ఆ అవ్వ ముక్తిని పొందింది. ఇదంతా తెలిసే కన్నయ్య ఆనాడు ఆ అవ్వను అంతగా అనుగ్రహించాడు. ఆ నాణేలపై ఒకవైపు పిల్లనగ్రోవి, రెండవ వైపు నెమలి పింఛం బొమ్మలు ఉండేవని అటు తరువాత తరాలలో ఆ అవ్వ కుటుంబాలలో ఆ నాణేలు చాలాకాలం ఉన్నాయని చెప్తారు. ప్రస్తుత కాలంలో ఆ నాణేలు ఒక గొప్ప కృష్ణ భక్తుని దగ్గర ఉన్నాయని కన్నయ్య చెప్తున్నాడు. ఆ భక్తుడు వాటిని అమూల్యంగా భావించి కనులకు అద్దుకుని స్మరిస్తూ ఆనందంగా జీవిస్తున్నాడు.

ఈ విధంగా కన్నయ్య గోకులంలో ఎందరో భక్తులను ఎంతగానే అలరించాడు. ఎవరెవరికి ఏమి ఇవ్వాలో ఆ కన్నయ్యకు తెలిసినట్లు వేరెవరికి తెలుసు. ఈ విధంగా చిన్ని కన్నయ్య ఆనాడు గోకుల బృందావనాలలో అనుగ్రహించిన కొందరు అనన్య భక్తులు నేటికి మన మధ్య ఉన్నారు. వారిలో కొందరికి కృష్ణయ్య అనేక రూపాలలో దర్శనమిస్తూ వారిని ఎంతో ఆనందింపచేస్తున్నాడు.

# 13

గోకులంలో యాదవులందరూ ఎంతో ఆందోళనతో, మనస్సులో ఎంతో అశాంతితో ఉన్నారు. అప్పటికి శ్రావణమాసం వచ్చి పదిహేను రోజులయింది. గోకులంలో ఒక చుక్క కూడా వర్షం పడలేదు. పశువులు గడ్డిలేక ఆకలితో మాడిపోతున్నాయి. కొన్ని మొక్కలు, చెట్లు కూడా ఒక రెండు నెలల నుంచి వర్షం చుక్కలేక మాడిపోతున్నాయి. ప్రజలందరూ వర్షం కోసం అనేక దేవతలను ప్రార్థించసాగారు. వర్షం ఎప్పుడెప్పుడు పడుతుందా అని ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

ఆ రోజు కన్నయ్య ఉదయం లేవగానే చాలా హుషారుగా ఉన్నాడు. తొందర తొందరగా స్నానం చేసాడు. ఏ మాత్రం అల్లరి చేయకుండా యశోదమ్మ ఇచ్చిన పాలు తాగాడు. యశోదమ్మకు ఇదంతా ఆశ్చర్యంగా ఉంది పిల్లాడేమిటి ఇంత త్వరత్వరగా తయారవుతున్నాడు. ఈ రోజు ఏం ఆటలు ఆడాలో అనుకుంది. రోజూ తలకి కట్టుకునే నీలిరంగు గుడ్డని

నుదుటినుంచి వెనక్కి కట్టుకున్నాడు. అమ్మా! ఇటువంటివి నాకు రంగు రంగులవి ఇంకా పదకొండు కావాలి అన్నాడు. ఎందుకు కన్నా! అంది యశోద. నాకు వాటితో చాలా పని ఉంది అన్నాడు. ఓర్నీ చాలా పని ఉందా! పట్టుమని నాలుగేళ్ళు కూడా లేవునీకు. అంత పెద్ద పని ఏమిటి? అని నవ్వుకుంది యశోదమ్మ.

అమ్మా! అన్నీ ఒకేరంగు కాదు. ఆకుపచ్చ, పసుసు, నీలం, గోధుమ, ఎరుపు, ఊదా రంగు ఇలా అన్ని రంగులలో ఉండాలి తెలుసా! అన్నాడు. కన్నా! ఇన్ని రంగులు నేను ఎక్కడినుంచి తీసుకుని రాను? అని అంది. వెతుకమ్మ ఇంట్లో ఉన్నాయి నాకు తెలుసు అన్నాడు కన్నయ్య. ఇంట్లో ఏమున్నాయో, ఏమిలేవో నీకు తెలుసా? నాకు తెలుసా? అనుకుంది యశోదమ్మ. ఆ అమాయకపు యశోదకు ఏమి తెలుసు? ఇక్కడ ఈ సృష్టిలో ఎక్కడ ఏ వస్తువు ఉన్నదీ తెలిసిన పురుషోత్తముడే తన చిన్ని కన్నయ్య అని!

ఇలా మాట్లాడుతూ యశోదమ్మ ఇల్లు అంతా వెతికి రకరకాల రంగుల గుడ్డలు తెచ్చి కన్నయ్యకు ఇచ్చింది. నాయనా జాగ్రత్తగా ఆడుకో! ఎక్కడా దెబ్బలు తగలకుండా చూసుకోండి! అని చెప్పింది. అలాగే అమ్మా! జాగ్రత్తగా ఆడుకుంటాము అని చెప్పి పరుగెత్తుకొని వెళ్ళాడు. స్నేహితులు ఒకొక్కరిని పోగు చేసుకుంటూ గోకులం నుంచి బృందావనం వెళ్ళే బాటలో కొంత దూరం వెళ్ళాడు. స్నేహితులందరికీ ముందురోజే చెప్పాడు ఈ రోజు అందరూ పిల్లనగ్రోవిలు తెచ్చుకోవాలి అని. అలాగే అందరు పిల్లలు తమతో పాటు వేణువును తెచ్చుకున్నారు.

ఊరి బయటకి రాగానే వాళ్ళందరిని ఒకచోట చేర్చాడు. అది ఒక చిన్న మైదాన ప్రాంతం. ఉన్న కొద్ది గడ్డిని తినడానికి ఆవులు అటూ ఇటూ తిరుగుతున్నాయి. పాపం చాలా రోజులనుంచి ఆహారం లేకపోవడంతో ఆవులు కొద్దిగా నీరసంతో ఉన్నాయి.

చిన్ని కన్నయ్య ఒక ఆవుదగ్గరకి పరుగెత్తుకుంటూ వెళ్ళాడు. ఆ ఆవు కన్నయ్య వంక దీనంగా చూసింది. కన్నయ్యకు ఆ ఆవుని చూస్తే ఇంకా ఎన్నాళ్ళు కన్నయ్య? ఈ వర్షం లేకుండా? మాకు తినడానికి గడ్డి లేకుండా ఉంటుంది? అని మొర పెట్టినట్లుగా అనిపించింది. కన్నయ్య ఆ ఆవుని నెమ్మదిగా వీపు నిమిరాడు. దానిని చూసి దూరం నుంచి మరో నాలుగు ఆవులు కన్నయ్య వద్దకు వచ్చాయి. వాటితో పాటు నాలుగు దూడలు కూడా పరుగెత్తుకుంటూ వచ్చాయి.

కన్నయ్య వాటన్నింటినీ దగ్గరకు తీసి నెమ్మదిగా వాటి వీపు నిమిరాడు. కన్నయ్య ఇలా ఆవుల్ని దగ్గరకి తీసుకోవడం చూసి పక్కన సగం ఎండిన పొదలలోంచి కుందేలు కూడా ఏ మాత్రం భయం లేకుండా గెంతుతూ కన్నయ్య వద్దకు వచ్చింది.

ఆ కన్నయ్య అంటే సకల ప్రాణులకు అంత ప్రేమ! కన్నయ్య కనిపించినా, ఆ స్పర్శ తగిలినా ఎంతో ఆనందపడతాయి. ఆ స్వామిలో ఉన్న ప్రేమతత్వం అంతటి మహత్తరమైనది.

కన్నయ్య ఆ ఆవులను దూడలను ముందుకు పంపి తాను తిరిగి తన స్నేహితుల వద్దకు వచ్చాడు. తాను తెచ్చుకున్న రంగుల గుడ్డలు వారందరి తలలకు చుటాడు. మీరందరూ వేణువుని తెచ్చుకున్నారు కదా! నేను చెప్పినప్పుడు మనందరం కలిసి ఒకేసారి ఊదాలి సరేనా! అన్నాడు. అప్పుడు వారిలో కొందరు తమకు ఊదడం సరిగా రాదు! అని అన్నారు. నేను నేర్పిస్తానుగా ఏమి పర్వాలేదు అన్నాడు కన్నయ్య.

ఇంతలో వారికి అక్కడ బోలెడు నెమలి పింఛాలు కనబడ్డాయి. కన్నయ్య ఒకటి తీసి పెట్టుకున్నాడు మిగిలిన పదకొండు మంది పదకొండు పింఛాలు తీసుకుని తమ తలలపై పెట్టుకున్నారు. అప్పుడు కన్నయ్య వారందరినీ పిలిచి ఒకరి తరువాత ఒకరి దగ్గరకు వచ్చి తలకి ఆ గుడ్డని సరిగ్గా కట్టుకున్నాడో లేదో! అని చూసాడు. ఆ పిల్లవాడి దగ్గర వేణువు

తీసుకుని తాను ఒకసారి ఊది ఇదిగో! ఇలా ఊదాలి సరేనా! అన్నాడు. ఓ సరే అలాగే! ఊదతాను అన్నాడు ఆ పిల్లవాడు. నేను చెప్పినప్పుడే ఊదాలి సరేనా! అన్నాడు. ఓ అలాగే! అన్నాడు ఆ పిల్లవాడు. కన్నయ్య అలా ప్రతి ఒక్కరి దగ్గరకి వెళ్ళి ఆ రోజు వేణువు ఎలా ఊదాలో ఒకసారి తాను ఊది వారికి వినిపించాడు. ఇలా ఆ పదకొండుమంది వద్ద నుంచి వేణువుని తీసుకుని తాను ఒకసారి ఊది తిరిగి వారి చేతికి ఇచ్చాడు.

ఇదంతా అయిన తరువాత కన్నయ్య వారితో మనందరం వలయాకారంలో నిలబడదాం సరేనా! అన్నాడు. ఓ అలాగే! అని అందరు పిల్లలు వలయాకారంలో వేణువును పట్టుకుని వచ్చారు. కన్నయ్య ముందు మధ్యలో నుంచుందామని అనుకున్నాడు. మళ్ళీ మనస్సులో ఏదో ఆలోచన వచ్చినట్లై వారితో పాటే తాను కూడా అదే వరుసలో అందరూ కలిసి వృత్తాకారంలో నుంచున్నారు.

ఇదంతా దూరంగా చెట్లపైన ఉన్న నెమళ్ళు చూసి కిందకి ఎగిరి వచ్చి కన్నయ్య వెనకాల, మిగిలిన పిల్లల వెనకాల అటూ ఇటూ తిరుగుతూ ఏం జరుగబోతోందో! అని ఆత్రంగా ఎదురు చూడసాగాయి. ఇంతలో కన్నయ్య వేరొకరితో ఇదిగో నేను వేణువు ఊదడం మొదలు పెడుతున్నాను అప్పుడు మీరు కూడా ఊదాలి సరేనా! అన్నాడు. ఓ అలాగే! అన్నారు అందరు పిల్లలు.

కన్నయ్య ఎంతో వయ్యారంగా కూర్చొని నెమ్మదిగా వేణువు ఊద సాగాడు. ఆహా! ఎంత అద్భుతంగా ఉంది ఆ వేణుగానం! కన్నయ్య మొదలు పెట్టగానే మిగిలిన పిల్లలందరూ కూడా వేణువు ఊదడం ప్రారంభించారు.

అన్ని వేణువులు అలా కన్నయ్య ఆ పిల్లలందరూ కలిసి తలకి రంగు రంగుల గుడ్డలతో, నెమలి పింఛాలతో అలా వృత్తాకారంలో నుంచొని ఊదుతూ ఉంటే ఆ దృశ్యం ఎంత అద్భుతంగా ఉందో చూడండి! వీరిని చూసి మైమరిచిన ఆ నెమళ్ళు వీరి వెనకనే నృత్యం చేయసాగాయి. ఇదంతా దూరం

నుంచి చూస్తున్న రెండు ఏనుగుల జంట ఇటుగా వచ్చి ఆనందంతో తొండం అటూ ఇటూ తిప్పసాగాయి. వేణు నాదానికి మధ్య మధ్యలో, ఆ నెమళ్ళ చిన్న కూతలు ఇవన్నీ ఎంతో గమ్మత్తుగా ఉన్నాయి. ఇంతలో కన్నయ్య వేణువు ఊదుతూ నెమ్మదిగా నృత్యం చేయసాగాడు. అప్పుడు చుట్టూ ఉన్న పిల్లలు కూడా కన్నయ్యను చూసి చిన్నగా వాళ్ళు కూడా అటూ ఇటూ అడుగులు వేస్తూ నెమ్మదిగా నృత్యం చేయసాగారు. వాళ్ళందరి వేణునాదానికి ఆ ప్రాంతం అంతా దివ్యతరంగాలతో నిండిపోయింది.

ఇలా గోవిందుడు, పిల్లలందరూ వేణువుని ఊదుతూ నెమ్మదిగా నృత్యం చేస్తుండగా నెమ్మదిగా చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. అందరి ముఖాలలో ఆనందం! సన్నటి తుంపరలు, సన్నటి గాలి... ఇంతలో కన్నయ్య తలలో ఉన్న నెమలి పింఛం గాలికి ఎగిరి దూరంగా పడింది. అటు వెళ్ళి తెచ్చుకుందామని కన్నయ్య అనుకునేలోపు తన వెనుకనే ఉన్న నెమలి తన శరీరాన్ని ఒక్కసారిగా విదిలించింది. అక్కడితో ఒక పింఛం నేలమీద పడింది. కన్నయ్య దానిని తీసుకుని తలపై పెట్టుకుని తిరిగి నృత్యం కొనసాగించాడు.

కాసేపటికల్లా ఆ చిన్న వాన కాస్త పెద్ద వానగా మారింది. ఆకాశమంతా ఉరుములు మెరుపులతో దట్టమైన మేఘాలతో నల్లగా తయారయింది. ఇంతలో నందుడు మిగిలిన పిల్లల తండ్రులు ఈ వర్షంలో వీరందరూ ఎక్కడ ఉన్నారా? అని వెతుకుంటూ వచ్చారు.

వారికి వీరందరూ ఇక్కడ కనబడ్డారు. అంతే కాదు ఇంత వర్షంలో కూడా పూర్తిగా తడుస్తూ వారు వేణునాదం ఏమాత్రం ఆపకుండా ఊదుతున్నారు. వీరి వెనుక ఆ నెమళ్ళు గుంపు కూడా ఇలా తడుస్తూ నృత్యం చేస్తున్నాయి. దూరం నుంచి ఈ దృశ్యం చూసిన నందుడు మిగిలిన గోపాలకులు ఎంతో ఆనందపడ్డారు. ఒక్క క్షణం ఒళ్ళు మరిచి వీరుకూడా నృత్యం చేశారు. ఆకాశం వంక చూస్తే ఎన్నాళ్ళగానో ఎదురుచూస్తున్న వర్షం ఇలా రావడం కన్నయ్య లీల అని వాళ్ళు గుర్తించారు.

నందుడు కన్నయ్యను ఎత్తుకొని ముద్దులతో ముంచెత్తాడు. మిగిలిన యాదవులు వారి పిల్లల్ని ఎత్తుకున్నారు. ఎత్తుకొని అందరూ కలిసి దగ్గరలో ఉన్న ఒక పెద్ద చెట్టు కిందకి వచ్చారు. వర్షం కొంచెం తగ్గగానే అందరూ ఇళ్ళకి వెళ్లారు. ఆ రోజు నుంచి వర్షాలు అద్భుతంగా పడి గోకుల వాసులందరూ ఎంతో ఆనందించారు. ఇదంతా కన్నయ్య మహిమ అని వారికి తెలిసింది. ప్రజలందరూ నందుడితో మీ పిల్లవాడు సామాన్యుడు కాదు! ఏ మహాపురుషుడో మీ కుమారుడిగా జన్మించాడు! మీ జన్మ ధన్యమైంది? ఈ గోకుల వాసుల అందరి జన్మలు ధన్యమయ్యాయి! ఈ మాటలకు యశోద, నందుడు ఎంతో సంతోషపడ్డారు.

ఆ రోజు కన్నయ్య చేసిన వేణునాదం ప్రకృతిలో అద్భుత తరంగాలను సృష్టించింది. ఆ దివ్యశక్తితో వెంటనే మేఘాలు ఏర్పడి బ్రహ్మాండమైన వర్షం కురిసింది. అది మొదలు ఆ ఋతువంతా ఎంతో చక్కగా వర్షం పడి గోకుల వాసులు అందరూ ఎంతో సంతోషించారు. ఆ విధంగా కన్నయ్య గోకులంలో అందరినీ తన లీలలతో ఎంతో ఆనందపరిచేవాడు. కేవలం మానవులనే కాక తన లీలలతో గోకులంలో ఉన్న సర్వ జీవకోటిని ఎంతో ప్రేమతో దగ్గర తీసుకునేవాడు. వారందరినీ తమ ప్రేమామృతధారలు కురిపించి ఎంతో ఆనందపరిచాడు.

# 14

శ్రీకృష్ణ లీలలు అనన్యం, అసమాన్యం, అత్యంత ఆనందకరం, అత్యంత శుభప్రదం. ఆ కృష్ణయ్య లీలలు మన మనస్సులని ఎంతో ఆనందంలో ముంచెత్తుతాయి. గోకులంలో గోపికలు, యాదవులతో పాటు ప్రతీ ఇల్లు, చెట్టు, పుట్ట కన్నయ్య కంటే ముందే జన్మించి కన్నయ్య రాక కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నాయి.

కన్నయ్య ఇంకా గోకులంలో ఈ భూమిపై అవతరించక ముందే ఆ స్వామితో ఆడుకోవడనికి సాన్నిహిత్యంగా గడపడానికి ఆ దివ్యానుభూతులను ఆస్వాదించడానికి ఇందరు పుణ్యాత్ములు, ధన్యజీవులు గోకులంలో యాదవులుగా వారికి పిల్లలుగా, అన్నదమ్ములుగా, అక్కచెల్లెళ్ళుగా బంధువులుగా చాలా ముందే జన్మించారు.

ఎన్నో యుగాలలో ఎంతో పుణ్యాత్ములుగా జీవించి, ఎంతో ధర్మ మార్గంలో జీవనం గడిపి ఎప్పుడూ శ్రీమన్నారాయణులవారినే స్మరిస్తూ ఆ

పురుషోత్తముని దివ్య తత్వాన్ని ప్రచారం చేస్తూ ఆ స్వామి అనుగ్రహానికి లోనై తాను రాబోయే ద్వాపరయుగంలో కన్నయ్యగా జన్మించినప్పుడు తనతో ఎంతో సాన్నిహిత్యంగా కొన్ని సంవత్సరాల కాలం గడిపేందుకు గొప్ప అనుగ్రహం పొందినవారు, అలా ఎన్నో జన్మలలో అంతటి సనాతన ధీక్షలో, ధర్మప్రచారానికై తన జీవితం అంకితం చేసిన వారే ఇప్పుడు ద్వాపరయుగంలో ఈ గోకులంలో జన్మించినవారు.

కన్నయ్య ఈ భూమిపై నడయాడిన నూట ఇరవై ఐదు సంవత్సరాలలో ఆ స్వామిని సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడిగా గ్రహించినవారు అతి తక్కువ మంది. గోవిందుని జీవిత కాలంలో కొన్ని లక్షల మంది కలిసినా వారిలో అతి కొద్దిమంది మాత్రమే ఈ స్వామి సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే! అని గ్రహించారు.

అయితే ఆ పురుషోత్తముడు మాత్రం అందరినీ అనుగ్రహించాడు. తన దివ్య లీలలతో ఎంతో ఆనందంలో ముంచెత్తాడు. వారితో ఆటలు ఆడాడు. వారిని ఆట పట్టించాడు. వారిని రకరకాల పేర్లతో పిలిచేవాడు. వారితో కలిసి పరుగెత్తడం వారితో కలిసి చెట్లు ఎక్కడం వారితో కలిసి నీటిలో ఆడటం ఇలా వారికి ఎన్నెన్నో ముచ్చట్లు అనుగ్రహించాడు.

ప్రతీ ముచ్చట వారికి ఎంతో మురిపం అనిపించేది. అది కూడా ఆ కన్నయ్యకు ఎప్పుడు ఎవరిని ఎలా అనుగ్రహించాలో? బాగా తెలుసు. ఎవరికి దేనివలన ఎక్కువ ఆనందం కలుగుతుందో? ఎవరికి దేనివలన దివ్యానుభూతి కలుగుతుందో? ఆ విధంగా వారిని అనుగ్రహించేవాడు.

ఆ రోజు కృష్ణయ్య పుట్టిన రోహిణీ నక్షత్రం, ప్రతి నెల రోహిణీ నక్షత్రం నాడు గోకులవాసులందరికీ ఎంతో ఆనందకరమైనది. కన్నయ్య బృందావనం వచ్చిన తరువాత కూడా రోహిణీ నక్షత్రం నాడు ఎంతో కోలాహలంగా ఉత్సవం జరుపుకునేవారు. ఆ రోజు కన్నయ్య ఎంతో చక్కటి బట్టలు ధరించి స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి వెళ్ళాడు.

స్నేహితులందరూ ఎంతో ఆనందంగా ఉన్నారు. కన్నయ్య వారితో ఈ రోజు ఏ ఆట ఆడుదాం! అన్నాడు. వారిలో ఒకరు ఈ రోజు మనం పరుగెత్తే ఆట ఆడుదాం ఇదిగో ఈ చెట్టునుంచి దూరంగా కనబడే ఆ చెట్టు వరకు ఎవరు ముందు పరుగెడతారో చూద్దాం! అన్నాడు. కన్నయ్య కూడా అలాగే అన్నాడు.

వారిలో భానుడు అనే పిల్లవాడు కళ్ళు పెద్దవిగా చేసి ఈ రోజు పరుగు పందెంలో నేనే గెలుస్తాను అన్నాడు. అప్పుడు ధీరుడు అనే మరో పిల్లవాడు లేదు! నేనే గెలుస్తాను చూడండి! అన్నాడు! కన్నయ్య వీళ్ళదిరినీ చూసి చిరునవ్వు నవ్వుకున్నాడు. చిన్నడు అనే ఇంకో పిల్లవాడు ఈ రోజు కన్నయ్యే గెలుస్తాడు చూడండి! అని అన్నాడు. దానికి భానుడు, ధీరుడు లేదంటే లేదు మేమే గెలుస్తాం! అన్నాడు. ఎవరి ధీమా వాళ్ళది! అనుకున్నాడు కన్నయ్య.

ఆ రోజు వారు పదిమంది ఉన్నారు. అందరూ తలకి రంగు రంగుల గుడ్డలు కట్టుకుని చాలా ధీమాగా ఉన్నారు. వారిలో శూరుడు అనే ఒక కుర్రవాడు ఆ రోజు తన స్నేహితుల కోసం కమ్మటి వెన్న తెచ్చాడు. అందరూ ఆ వెన్నని పంచుకుని తిన్నారు.

శూరుడు కాస్త వెన్నని విడిగా తీసి ముందుగానే ఒక తమలపాకులో రాసి తన నడుముకు కట్టిన గుడ్డలో దాచుకున్నాడు. అందరూ వెన్న తింటుంటే ఈ వెన్న నెమ్మదిగా ఎవరూ చూడకుండా తన నడుమునించి తీసి కన్నయ్యకు ఇచ్చాడు. తన ప్రియమైన స్నేహితుడు కన్నయ్యకు మరింత ఎక్కువ వెన్న ఇవ్వాలని శూరుడి ఆత్రం. అందుకే అందరికీ పంచే ముందు కొంచెం విడిగా తీసి దాచిపెట్టుకున్నాడు.

పిల్లలందరూ ఒకరి పక్కన ఒకరు చేతులు పట్టుకొని నిలబడ్డారు. మరి పరుగెత్తడం ఎప్పుడు మొదలు పెట్టాలి. ఇలా అనుకుంటుండగా అక్కడ ఒక చెట్టుమీద ఒక కొమ్మపై కూస్తున్న ఒక కోయిల కనిపించింది. శూరుడు స్నేహితులందరితో ఇలా అన్నాడు. అదిగో! ఆ కోయిల పదిసార్లు కూయగానే

మనం పరుగెత్తాలి సరేనా! అన్నాడు. ఎవరు దూరంగా ఉన్న ఆ చెట్టుని ముందు ముట్టుకుంటారో! వారు గెలిచినట్లు అలా గెలిచిన వారికి మిగిలిన అందరూ రేపు వెన్న కొంచెం ఎక్కువ తెచ్చి ఇవ్వాలి తెలిసిందా! అన్నాడు. అలాగే! అన్నారు అందరూ.

ఇంతలో ఆ కోయిల ఒక్కసారిగా కూసింది ఒకటి... రెండు.. మూడు... నాలుగు... ఇలా పదిసార్లు కూయగానే ఒక్కసారిగా అందరూ పరుగెత్తారు. అయితే అందరూ ఒక్కసారి కింద పడ్డారు. కారణం ఏమిటంటే అందరూ ఒకరి చేతిలో ఒకరు పట్టుకుని నిలబడడమే!

అలా కింద పడిన వాళ్ళందరికీ ఎంతో నవ్వు వచ్చింది. వారి స్నేహమాధుర్యం అటువంటిది! రోజూ ఒకరికొకళ్ళు చేతులు పట్టుకుని తిరుగుతుంటారు. పరుగు పందెంలో విడివిడిగా నుంచోవాలి అని మర్చిపోయి రోజూ లాగే అందరూ చేతులు పట్టుకుని నుంచున్నారు. అక్కడితో అందరూ ఒక్కసారి పరుగెత్తగానే ఒకరి చేతులు మరొకరు పట్టుకుని ఉండడం చేత ఒక్కసారిగా ముందుకు పడ్డారు.

అయితే ఆశ్చర్యంగా మరెవరికీ పెద్దగా దెబ్బలు తగల్లేదు. అంతేకాక అందరూ సరదాగా నవ్వుకున్నారు. ఏమాత్రం కల్మషం లేని అంతటి అమాయక జీవులు వారు. అందుకే వీరిని ఉద్ధరించడానికే కన్నయ్య అనేక ఆటలు ఆడుతున్నాడు.

ఈ సారి అందరూ మళ్ళీ వరుసగా నుంచున్నారు ఒకరినొకరు పట్టుకోకుండా కొంచెం దూరంగా నుంచున్నారు. మళ్ళీ కోయిల కూతలు లెక్కపెట్టారు పది కూతలు అవ్వగానే ఒక్కసారిగా అందరూ పరుగెత్తడం ప్రారంభించారు. అలా కన్నయ్యతోపాటు ఆ పిల్లలందరూ పరుగెడుతూ ఉంటే పక్కనే చెట్లుపై ఉన్న కోతులు, పక్షులు వీరిని ఆనందంగా చూడసాగాయి. కోతులు అయితే ఒక చెట్టుమీదనుంచి మరో చెట్టుమీదకి దూకుతూ వీరిని అనుసరిస్తున్నాయి. కొన్ని పక్షులు ఈ పిల్లల పైనుంచే ఎగురుతున్నాయి.

ఇంతలో సగం దూరం వచ్చేసారు అందరికంటే కన్నయ్యే ముందు ఉన్నాడు తరువాత శూరుడు ఉన్నాడు. ఆ వెనకాల భానుడు, ధీరుడు ఉన్నాడు అలా అందరూ ముందుకు పరుగెడుతున్నారు. ఇంతలో భానుడు, ధీరుడు ఇద్దరూ ఒక్కసారిగా కన్నయ్యను, శూరుడిని దాటి ముందుకు వెళ్ళారు అలా అందరూ ఆ చెట్టువైపు వేగంగా పరుగెత్తసాగారు. ముందుగా భానుడు ఆ చెట్టును ముట్టుకున్నాడు. నేనే గెలిచాను! అని ఆనందంతో గట్టిగా అరిచాడు. ఆ తరువాత ఆ చెట్టును ధీరుడు ముట్టుకున్నాడు. ఆ తరువాత శూరుడు... ఆ తరువాత కన్నయ్య ఆ చెట్టుని ముట్టుకున్నారు. స్నేహితులలో కొందరు ఆశ్చర్యపోయారు! అదేమిటి? ఎప్పుడూ చలాకీగా ఉండే కన్నయ్య ఈరోజు గెలవకపోవడం ఏమిటి? అని వారికి చాలా ఆశ్చర్యం కలిగింది.

కాని కన్నయ్య ఇదంతా కావాలనే చేశాడు. తన స్నేహితుల ఆనందమే తనకు ముఖ్యం కదా! అసలు తాను ఇక్కడ గోకులంలో జన్మించింది వీరందరినీ ఆనందంలో ముంచెత్తడానికే కదా! అందుకని ఆ అపార కరుణా మూర్తి కావాలనే తాను కాస్త వెనక్కి తగ్గి వారిని ముందుకు పోనిచ్చాడు. అదే కృష్ణ తత్వం! అదే కృష్ణయ్య మధుర ప్రేమ తత్వం! మనందరం ఈ మధుర ప్రేమతత్వాన్ని అలవాటు చేసుకోవాలి. అప్పుడే మనందరి జీవితాలు సుసంపన్నం అవుతాయి.

# 15

శ్రీకృష్ణులవారి బాల్యపు లీలలు ఎంతో ఆనందాన్నిస్తాయి. కన్నయ్య బాల్య విశేషాలు, తాను చిన్నప్పుడు గోకులంలో చేసిన అనేక లీలలు చదువుతూ ఉంటే మన మనస్సుకి ఎంతో ప్రశాంతత కలుగుతుంది. అంతే కాదు కృష్ణయ్య లీల తెలుసుకున్నవారికి ఎంతో జ్ఞానం కలుగుతుంది. బుద్ధి వికసిస్తుంది. ఆనాడు ఊదిన వేణునాదం ఇప్పటికీ గోకుల బృందావన ప్రాంతంలో ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. కృష్ణ భక్తుల హృదయాలను ఆ దివ్య తరంగాలు నేటికి తాకుతూ ఉంటాయి. ఆ పురుషోత్తముని దివ్య వేణునాదం యొక్క దివ్య తరంగాలు నేటికీ అక్కడి మట్టి రేణువులోను ప్రతిధ్వనిస్తుంటాయి. భక్తులను అంతులేని ఆనందాన్ని అనుగ్రహిస్తుంటాయి.

ఆరోజు కన్నయ్య ఉదయాన్నే లేచి స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి వెళ్ళాడు. యశోదమ్మ కన్నా! ఇదిగో పాలు త్రాగడం

మర్చిపోయావు అని గట్టిగా అరిచింది. కన్నయ్య అప్పటికే చాలా దూరం వెళ్ళిపోయాడు అమ్మా! తరువాత తాగుతాను అని పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు. అలా కొంత దూరం వెళ్ళి ఒక స్నేహితుడి ఇంటికి వెళ్ళాడు. ఆ స్నేహితుడి తల్లితో అమ్మా! ఆకలేస్తుంది కాసిన్ని పాలు ఇస్తావా? అని అన్నాడు.

అయ్యో కన్నయ్యా! యశోదమ్మ పనిలో పడి నీకు పాలివ్వడం మర్చిపోయిందా! నువ్వు అడిగింది ఇవ్వడం కంటే గొప్ప భాగ్యం ఏముంటుంది. ఈరోజు మేము, ఆ పాలు ఇచ్చిన మా ఆవు ఎంత పుణ్యం చేసుకున్నాయో కదా! అని ఇక్కడే ఉండు కృష్ణా! నీకు చక్కటి వేడి వేడి పాలు మీగడ వేసి మరీ తెచ్చి ఇస్తాను అని వంటింట్లోకి వెళ్ళింది.

కన్నయ్య తన స్నేహితుడితో ముందు వరండాలో కూర్చున్నాడు. వాళ్ళందరూ కబుర్లు చెప్పుకుంటుండగా ఒక పెద్ద త్రాచుపాము చరచరా పాకుతూ వీరివైపే రాసాగింది కన్నయ్య అది గమనించాడు. కానీ తన స్నేహితుడు అది గమనించలేదు. ఆ త్రాచు వేగంగా పిల్లలు కూర్చున్న వైపే వస్తోంది.

ఇంతలో పాలగిన్నెతో లోపల వంటింట్లోంచి ముందు వరండాలోకి వస్తున్న ఆ తల్లి పిల్లల వద్దకు చరచరా పాకుతూ వస్తున్న త్రాచుని చూసి ఎంతో భయపడి ఆ కంగారులో చేతిలోని పాల గిన్నెను కిందకి వదిలేసింది. ఆ గిన్నె కింద పడి పాలన్నీ కింద కారిపోయాయి. ఆ పాలు త్రాచుమీద పడ్డాయి. అక్కడితో ఆ త్రాచు మరింత వేగంగా రాసాగింది.

కన్నయ్య ఒక ఉదుటున ముందుకు దూకి ఆ త్రాచుపామును తోక దగ్గర పట్టుకుని గిరగిరా తిప్పి ఇంటి బయటకు వచ్చి దూరంగా ఉన్న మడుగులోకి విసిరేసాడు. ఇదంతా చూసిన ఆ తల్లికి, అప్పుడే ఇంట్లోకి వస్తున్న స్నేహితుడి తండ్రికి ఈ దృశ్యం చూసి నోట మాటరాలేదు. ఇంక పూర్తిగా నాలుగేళ్ళయినా లేని ఈ పిల్లాడు ఆ త్రాచుపాముని ఏ భయం

లేకుండా పట్టుకుని విసిరేయడం చూసి ఎంతో ఆశ్చర్యపోయారు! ఆ తల్లి కన్నయ్యతో కృష్ణా! నీకు పాలు తెచ్చి ఇస్తాను అని ఒక క్షణం ఇంటిలోకి వెళ్ళింది. స్నేహితుడి తండ్రి పిల్లలిద్దరితో ఏవో కబుర్లు చెప్తున్నాడు.

ఇంతలో ఆ వీధిలో పెద్ద అలజడి బయల్దేరింది. జనం కేకలు వేసుకుంటూ ఇంట్లోకి వెళ్ళి తలుపులు వేసుకోండి. ఒక మాయదారి గుర్రం ఎక్కడినుంచి వచ్చిందో గాని ఊరంతా పరుగెడుతూ అడ్డం వచ్చిన వారిని తీవ్రమైన వేగంతో తొక్కివేస్తోంది. దాని దాటికి ఎంతోమందికి గాయాలయ్యాయి ఎవ్వరూ దాన్ని అదుపు చెయ్యలేకపోతున్నారు. అందరూ తలుపులు వేసుకోండి అంటూ గట్టిగా అరుస్తూ పరుగెడుతున్నారు. వెంటనే కన్నయ్యను, పిల్లవాడిని తీసుకుని ఆ యాదవుడు లోపలకి వెళ్ళి తలుపు వెయ్యబోయాడు.

ఇంతలో ఆ గుర్రం వీరికి ఎదురుగా వచ్చి రెండు కాళ్ళు పైకి ఎత్తి గట్టిగా సకిలించింది. ఆ తీవ్రతకి ఆ యాదవుడు ఒక్కసారిగా భయపడి తలుపు వదిలేసాడు. వెంటనే కన్నయ్య ఒక్క దూకున బయటకు పరుగెత్తి ఇంటి వరండాకు ఉన్న స్తంభం పైకి చకచకా పాకుతూ ఎక్కి ఆ గుర్రం మీదకు ఒక్క దూకు దూకాడు. గుర్రం హఠాత్తుగా జరిగిన ఈ పరిణామానికి ఆశ్చర్యపోయింది! మరింత కోపంతో రెండు కాళ్ళు పైకెత్తి అటూ ఇటూ పరుగెత్తసాగింది. కన్నయ్య ఏ మాత్రం జంకకుండా, ఏ మాత్రం పట్టువిడవకుండా ఆ గుర్రం వీపు మీద గట్టిగా రెండు దెబ్బలు కొట్టాడు.

ఇదంతా కిటికీలలో నుంచి చూస్తున్న జనం ఎంతో ఆశ్చర్యపోయారు. తమ కళ్ళని తామే నమ్మలేకపోయారు. వీరిలో కొందరు కన్నయ్య లీలలు విన్నారే కాని కళ్ళారా చూడడం ఇదే మొదటి సారి. కన్నయ్య అలా ఆ గుర్రాన్ని ఎక్కడం చూసి ఆశ్చర్యపోయారు. కన్నయ్య మరో రెండుసార్లు ఆ గుర్రం వీపుపై ఆ చిన్ని చిన్ని చేతులతో అటూ ఇటూ గట్టిగా కొట్టాడు.

అక్కడితో ఆ గుఱ్ఱం పూర్తిగా శాంతించి నేలమీద కూర్చుండిపోయింది. గుఱ్ఱం కళ్ళనుంచి నీళ్ళు కారసాగాయి. అప్పుడే పక్కన ఉన్న చెట్టు కొమ్మ ఒకటి వేగంగా విరిగిపడింది. కన్నయ్య ఆ గుఱ్ఱం వీపు నెమ్మదిగా నిమిరాడు.

ఇంతలో నందుడు, యశోదమ్మ పరుగెత్తుకుంటూ కన్నయ్యను వెతుక్కుంటూ ఇటుగా వచ్చారు. జనం అంతా గుఱ్ఱం శాంతిచడం చూసి ఇళ్ళలోనుంచి బయటకు వచ్చారు. యశోదమ్మ కన్నయ్యను ఎత్తుకుని ముద్దుల వర్షం కురిపించింది. కన్నా! పాలు కూడా తాగకుండా వచ్చావు కదా! అయ్యో? ఇదంతా ఏంటి తండ్రీ! అని ఎంతో బాధపడింది. అప్పుడు ఆ ఇంటి ఇల్లాలు యశోదమ్మని, నందుని ఇంట్లోకి తీసుకువెళ్ళి మళ్ళీ వేడిపాలు కాచి మంచి మీగడవేసి కన్నయ్యకు ఇచ్చింది. అంతకు ముందు త్రాచుపాము రావడం ఇప్పుడు ఈ గుఱ్ఱం రావడం అంతా వివరంగా చెప్పింది.

ఇదంతా విని యశోదమ్మ అక్కడున్న కన్నయ్యతో కన్నా! ఈ రోజునుంచి ఇంక ఏ ఆటలు లేవు పద! ఇంటికి వెళదాము అంది. ఇదిగో ఇప్పటికే రెండు జరిగాయి! ఇంక ఇంటికి వెళదాము! పద తండ్రీ! అని కన్నయ్యను తీసుకుని ఇంటికి వచ్చింది.

ఆ గుఱ్ఱాన్ని అశ్వాసురుడు అనే రాక్షసుడు ఆవహించాడు. అశ్వాసురుడు త్రేతాయుగంలో ఒక గంధర్వుడు శాపవశాన శరీరం లేని రాక్షస రూపం పొందాడు. అయితే ఒకనాడు ఒక మహర్షి అతడిని అనుగ్రహించి వచ్చే ద్వాపరయుగంలో శ్రీమన్నారాయణులవారు శ్రీకృష్ణునిగా అవతరిస్తాడని అప్పుడు చిన్నతనంలో శ్రీకృష్ణుని చేతిస్పర్శ తగలడం చేత నీకు శాపవిముక్తి కలిగి నిజరూపం లభిస్తుందని చెప్పారు.

అప్పటినుంచి ఆ రాక్షసుడు శరీరం లేకుండా అలా తిరుగుతూ ఈనాడు ఈ అశ్వాన్ని ఆవహించాడు. ఎప్పుడైతే కన్నయ్య ఆ అశ్వాన్ని ఎక్కాడో అక్కడితో ఆ కన్నయ్య స్పర్శ తగలడం చేత ఆ రాక్షసుడికి శాప విముక్తి కలిగి

గంధర్వ రూపం ధరించి కన్నయ్యకు నమస్కరించి ఏకంగా ఆకాశ మార్గాన గంధర్వ లోకానికి వెళ్ళిపోయాడు. అలా వెళుతున్నప్పుడు ఆ కొమ్మ తగిలి కిందపడింది. ఇదంతా కన్నయ్యకు తప్ప మరెవరికీ తెలియదు.

శ్రీకృష్ణుడు ఇలా తన చిన్నతనంలో ఎన్నో లీలలు ప్రదర్శించాడు. అనేక రాక్షసులను సంహరించాడు, కొందరికి శాప విముక్తి కలిగించాడు, కొందరిని తన స్పర్శతో అనుగ్రహించాడు. ఇలా ఎంతో అద్భుతమైన లీలలను చేసి ప్రజలందరికీ ఆనందం కలిగించటమే కాక ధర్మాన్ని రక్షించాడు. తనను భక్తితో కొలిచిన వారికి అంతులేని ఆనందాన్ని అనుగ్రహించాడు.

# 16

ఆరోజు కన్నయ్యకు ఉదయం నుంచి ఒకటే జ్వరం. ఒళ్ళంతా చాలా వేడిగా ఉంది. నిన్నటి దాకా బాగానే ఉన్నాడు ఈ రోజు ఒక్కసారిగా ఇంత జ్వరం ఎలా వచ్చిందా? అని యశోద ఎంతో బాధపడుతోంది. మంచి వైద్యులు వచ్చి చూసారు. కొన్ని మందులు ఇచ్చారు. కాని జ్వరం ఏమాత్రం తగ్గలేదు. మధ్యాహ్నం కాసేపు తగ్గినట్లే తగ్గి మళ్ళీ సాయంత్రానికి పెరిగింది.

ఇంతలో కన్నయ్య స్నేహితులు కన్నయ్యకు జ్వరంగా ఉందని తెలిసి వచ్చారు. కన్నయ్య వాళ్ళతో రేపటికల్లా జ్వరం తగ్గిపోతుంది. మనం ఆడుకుందాం! అని అన్నారు. యశోద అప్పుడే ఆటలా! పిల్లవాడికి ఇంత జ్వరంగా ఉంటే! ఒక నాలుగు రోజులు దాకా ఎక్కడకి వెళ్ళడానికి వీలు లేదు అని అంది యశోదమ్మ.

కన్నయ్య ఇంట్లో నుంచి రెండు రోజులు రాకపోయేసరికి బృందావనం అంతా నొచ్చుకుంది. రోజూ కన్నయ్యను చూసే నెమళ్ళు, అనేక

పక్షులు కన్నయ్య ఇంకా రాలేదు అని ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నాయి. వారికి తామంతా ప్రాణంగా చూసుకునే కన్నయ్య కనపడలేదు.

రోజూ తన స్నేహితులతో కలిసి ఎగురుతూ తమతో కలిసి ఆడుకునే కన్నయ్య రెండు రోజులు కనపడకపోయే సరికి అవన్నీ ఎంతో బెంగ పెట్టుకున్నాయి. ఇంక కన్నయ్య స్నేహితుల సంగతి అయితే చెప్పనక్కర్లేదు రోజూ వెళ్ళి కన్నయ్య వద్దనే కూర్చునేవారు.

రోజూ మందులు వాడుతున్నాకూడా జ్వరం ఏమాత్రం తగ్గడంలేదు. ఇక నాలుగు రోజులలోనే రోహిణీ నక్షత్రం. ఆ నక్షత్రం నాడు గోకుల వాసులందరూ ఎంతో ఆనందంగా జరుపుకుంటారు కదా! కన్నయ్యకు జ్వరం తగ్గడం లేదు. యశోద స్నేహితులకు గట్టిగా చెప్పింది ఈసారి పుట్టినరోజుకి కన్నయ్య ఇంట్లోనే ఉంటాడు ఎటూ రాడు అని గట్టిగా చెప్పింది. మూడో రోజు ఉదయం కన్నయ్యను లేపి వెచ్చటి పాలు త్రాగించింది. ఒళ్ళు ఇంకా వేడిగానే ఉంది ఉదయం తొమ్మిది గంటలు అయ్యాక తేలికైన పదార్థం పెట్టింది.

కన్నయ్య వెన్న కావాలని మారాం చేసాడు. కన్నా! జ్వరంగా ఉంది. ఇప్పుడు వెన్న తినకూడదు అంది. ఎంత గట్టిగా అడిగినా అమ్మ పెట్టడం లేదు. ఇంతలో ఒక స్నేహితుడు లోపలకి పరుగెత్తుకుంటూ వచ్చి తాము రోజు తలకి కట్టుకునే రంగు గుడ్డ కన్నయ్య తలకు కట్టి ఇది కట్టుకుంటే నీకు జ్వరం తగ్గిపోతుందిలే! రేపు మనం చక్కగా ఆడుకోవచ్చు అన్నాడు.

అతడి పసి మనస్సుకి ఏదో తపన తన స్నేహితుడి జ్వరం తొందరగా తగ్గాలని! ఇంతలో యశోద ఏదో పనిమీద లోపలకి వెళ్ళగానే తాను ఒక తమలపాకు నిండా కట్టి తెచ్చిన వెన్న కన్నయ్యకు ఇచ్చాడు. కన్నయ్య అంటే ఆ పిల్లవాడికి అంత ప్రాణం మరి! కన్నా! అమ్మ వచ్చే లోపల త్వరగా తిను అన్నాడు. కన్నయ్య ఎంతో ఆనందంగా ఆ వెన్న తిన్నాడు.

ఇంతలో యశోదమ్మ ఇటుగా వచ్చింది. ఏమిటి కన్నయ్యా! ఇక్కడ వెన్న వాసన వస్తోంది? అని వచ్చిన స్నేహితుడిని నువ్వేమైనా కన్నయ్యకు వెన్న పెట్టావా? అంది. కన్నయ్యను నోటి వాసన చూస్తాను అని నోరు తెరవమంది ఏది నోరు చూపించు అని గట్టిగా అరిచింది. లేదమ్మా! నువ్వు ఉదయం ఇచ్చిన పాలు తప్ప ఇంకేమి తాగలేదు తినలేదు అన్నాడు కన్నయ్య. ఉదయం ఏమిటి ఇందాక కాసేపటి క్రితమే మళ్ళీ ఇచ్చాను కదా! అవి కూడా తాగావు కదా! అంది. మళ్ళీ వీడిదగ్గర వెన్న కూడా తిన్నావా! అంది. అప్పుడు మంచం మీద పడుకున్న కన్నయ్య లేచి కూర్చుని రా అమ్మా! రా! దగ్గరకి వచ్చి చూడు అన్నాడు. యశోద ముందుకి వంగి కన్నయ్య నోటిలోకి చూసింది.

యశోద తనకు కనబడిన దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయింది! కన్నయ్య నోటిలోపల పాలసముద్రం! అందులో శేషతల్పం పైన శ్రీమహావిష్ణువు, స్వామి వారికి కాలు వత్తుతూ కూర్చున శ్రీమహాలక్ష్మి కనిపించింది. ఆ పాలసముద్రం ఎంత విశాలంగా ఉంది అంటే యశోదకు మైకం కమ్మినట్లయింది.

అంతే నెమ్మదిగా మంచం పైననే కూర్చుంది. మళ్ళీ ముందుకు జరిగి కన్నయ్య నోట్లోకి చూసింది. మళ్ళీ అదే అద్భుత దృశ్యం! కొన్ని యోజనాలు వ్యాపించి ఉన్న అద్భుత తేజస్సుతో వెలిగిపోతున్న పాల సముద్రం! ఆ మధ్యలో శేషతల్పం పై ఉన్న శ్రీమహావిష్ణువు! శ్రీమహాలక్ష్మి! మళ్ళీ అదే దృశ్యం! ఇంక యశోదమ్మకు నోట మాటరాలేదు కొన్ని సంవత్సరాల నాడు పధ్నాలుగు లోకాలు... ఈనాడు ఇలా పాల సముద్రం! అసలు ఎవరు కన్నయ్యా! నువ్వు? అనుకుంది. ఆ కన్నయ్య నవ్వుతూ ముందుకు వంగి యశోదమ్మకు ముద్దు పెట్టాడు. ఆ ముద్దుతో యశోదమ్మ ఒక్కసారిగా ఈ లోకంలోకి వచ్చింది.

యశోద ఆశ్చర్యపడుతుండగా అక్కడకి నందుడు వచ్చాడు. యశోదమ్మ నందుడితో తాను చూసిన దృశ్యం చెప్పింది. నందుడు కన్నయ్యను నోరు తెరవమని చూస్తే నందుడికి ఏమి కనపడలేదు. యశోద

ఇదంతా నీ భ్రమ! అన్నాడు. అయ్యో! కాదు స్వామీ! నేను కళ్ళారా కన్నయ్య నోట్లో పాలసముద్రం చూసాను అంది. పాపం ఈ యశోదకు కన్నయ్య అంటే ఎంత ప్రేమనో! అనుకున్నాడు.

ఆశ్చర్యం ఏమిటంటే ఇలా జరిగిన మర్నాడే యశోదమ్మ ఇవన్నీ మర్చిపోయి అమితమైన పుత్రవాత్సల్యంతో తన పిల్లవాడిని సామాన్య బాలుడిలాగానే తలచింది. కానీ బృందావన వాసులందరూ ఈ పిల్లవాడు సామాన్యుడు కాదు! అని గ్రహించారు. ఇదీ కాక కన్నయ్య పుట్టినప్పటినుండి అక్కడ ఎందరో మహర్షులు కన్నయ్య సామాన్యుడు కాదని మహాపురుషుడని! చెప్పారు. కొందరు అయితే ఈ పిల్లవాడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే! అన్నారు. వారి మాటకు తగ్గట్లుగానే కన్నయ్య పుట్టినప్పటినుంచి ఎన్నో అద్భుతాలు చూపించేవాడు.

కృష్ణయ్యకు జ్వరం వచ్చి నాలుగు రోజులయింది ఇంకా తగ్గలేదు. ఈ రోజు ఉదయమే యశోదమ్మ కన్నయ్యకు పాలు ఇచ్చింది. ఒళ్ళు ఇంకా వేడిగానే ఉంది. ఇదేమిటి ఇన్నాళ్ళయినా ఈ పిల్లవాడికి జ్వరం ఇంకా తగ్గడం లేదు! అని యశోదమ్మకి చాలా బెంగగా ఉంది.

ఇంతలోనే కన్నయ్య స్నేహితులు నలుగురు బిరబిరా ఇంటికి వచ్చారు. తమ ప్రాణ స్నేహితుడు నాలుగు రోజులనుంచి తమతో ఆడుకోవడానికి రాకపోవడం వలన వారికి చాలా బాధ కలిగింది. ఈ మధ్య కాలంలో కన్నయ్య ఇన్నాళ్ళు జ్వరం పడింది లేదు.

ఆ వచ్చిన నలుగురు కన్నయ్య పక్కనే కూర్చుని ఏవో కబుర్లు చెప్తున్నారు. వాళ్ళతో మాట్లాడుతూ కన్నయ్య వారిలో ఒకరిని పిలిచి అక్కడ ఎదురుగా గూట్లో ఉన్న మురళి ఇలా తీసుకురా! అలాగే నువ్వు బయటకు వెళ్ళి ఒక మంచి నెమలి పింఛం తీసుకురా! అని అన్నాడు. వాళ్ళకి కన్నయ్య ఈ రెండు అప్పుడు ఎందుకు అడుగుతున్నాడో? అర్థం కాలేదు.

అప్పుడు అక్కడ యశోదమ్మ లేదు. ఆమే కనుక అక్కడ ఉండి ఉంటే ఇప్పుడు ఇవన్నీ ఎందుకు కన్నయ్య అని గట్టిగా అడిగేది. కృష్ణయ్య మాట విన్న ఆ పిల్లవాడు ఎదురుగా గూట్లో ఉన్న మురళిని తెచ్చి కన్నయ్యకు ఇచ్చాడు. బయటకు పరుగెత్తుకు వెళ్ళి మంచి నెమలి పింఛం ఒకటి తెచ్చి ఇచ్చాడు. కన్నయ్య ఆ రెండిటిని మంచంమీదే పెట్టుకుని మాటిమాటికి గుమ్మం వైపు చూడ సాగాడు. యశోదమ్మ బహుశా! ఎవరో స్నేహితుడి కోసం చూస్తున్నాడేమో! అని అనుకుంది. కన్నా! నువ్వు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి ఇప్పుడే బయటకు వెళ్ళకూడదు. స్నేహితులతో కూడా గట్టిగా మాట్లాడవద్దు గొంతు నొప్పి చేస్తుంది అని అంది.

యశోదమ్మ ఇలా మాట్లాడుతూ ఉండగా బయట ఏదో కోలాహలం వినపడింది. ఉదయాన్నే ఎవరు వచ్చారా? అని అనుకుంటుంటే రాధ పరుగెత్తుకుంటూ ఇద్దరు స్నేహితురాళ్ళతో కలిసి వచ్చింది. ఆమె వెనకే వృషభానుడు, కీర్తి వారి పరివారం అంతా లోపలకి వచ్చారు. ముందుగా కబురైనా లేకుండా ఇలా వచ్చారేమిటి? అని మనస్సులో అనుకుంది.

యశోదమ్మ ఆలోచనలు కనిపెట్టిన కీర్తి వదినా! రాధ నిన్న ఉదయం నుంచి మనం రేపు గోకులం వెళ్ళాలి, కృష్ణుణ్ణి చూడాలి అని గట్టిగా అడిగింది. అక్కడితో ఇంక ఈరోజు ఉదయమే బయల్దేరక తప్పలేదు. అదీగాక ఇంక రేపే కన్నయ్య పుట్టినరోజు కూడా అని రాధ అంది. యశోదమ్మ ఆశ్చర్యపోయింది! ఇంత చిన్ని రాధకు ఏ రోజు నక్షత్రం ఏమిటో కన్నయ్య పుట్టిన రోహిణీ నక్షత్రం ఎప్పుడు వస్తుందో ఎలా తెలిసింది? అని అనుకుంది. యశోదమ్మ కీర్తితో కన్నయ్య జ్వరం గురించి చెప్పింది. అలాగా వదినా! నాకు తెలియనే లేదు అని అంది కీర్తి.

రాధ ఆరోజు ఎంతో గొప్ప అందంతో మెరిసిపోతుంది. ఆమె మరి శ్రీమహాలక్ష్మి స్వరూపమే కదా! రాధ మనస్సులో ఏముందో ఎప్పుడైనా ఒక్క క్షణమైనా ఆ కన్నయ్య మర్చిపోతాడేమో కాని రాధ మాత్రం ప్రతిక్షణం కన్నయ్య ఆలోచనల్లోనే ఉంది. అంతే కాదు కృష్ణుడి మనస్సులో వచ్చే ప్రతీ

ఆలోచన ఆ క్షణంలోనే రాధకు తెలుస్తుంది. అందుకే కన్నయ్యకు జ్వరంగా ఉంది అని గ్రహించి ఇలా కన్నయ్యను చూడడానికి వచ్చింది. రాధ వచ్చి కన్నయ్య పాదాలవద్ద కూర్చుంది. ఆ రాధమ్మ కళ్ళు ఎంత గొప్పగా మెరుస్తున్నాయో చూడండి! ఎంతో అందమైన పరికిణీ చక్కటి రంగైన రవికతో ఎంతో తేజస్సుతో మెరిసిపోతూ తన కాళ్ళ వద్ద కూర్చున్న రాధను చూసి కన్నయ్య చిరునవ్వు నవ్వాడు.

రాధ అటూ ఇటూ కాళ్ళు ఊపుతూ ఎంతో ఉత్సాహంగా తాము దారిలో చూసిన విశేషాలన్నీ కబుర్లు చెప్తోంది. కన్నా! ఈ రోజు ఎందుకో యమున ఎంతో ఉధృతంగా ప్రవహిస్తోంది తెలుసా? ఆ అలలు ఎంత ఎత్తున ఎగిరిపడుతున్నాయో తెలుసా? అంది. కన్నయ్య అవునా! అంటూ ఆశ్చర్యం నటిస్తూ అన్నీ వింటున్నాడు. అది నటన అని రాధకు మనస్సులో తెలియదా!

ఇంతలో రాధ కొంచెం ముందుకు జరిగి అక్కడున్న పింఛం తీసుకుని తన తలపై గుచ్చుకుంది. ఆ మురళిని తీసుకుని కన్నయ్య కుడి చెంపకు తాకించి తన పెదవుల వద్ద పెట్టుకుని ఎంతో మధురంగా ఊదసాగింది. ఈ అద్భుత వేణునాదం వినపడిన పక్క గదిలో కబుర్లు చెప్పుకుంటున్న యశోద, కీర్తి ఇంత జ్వరంలో కన్నయ్య ఎలా వేణువు ఊదుతున్నాడా! అనుకుంటూ ఇటు వచ్చారు. ఇక్కడ చూస్తే ఊదుతున్నది కన్నయ్య కాదు రాధ! ఆ దృశ్యం చూసి అందరూ ఆశ్చర్యపోయారు.

తలపై నెమలి పింఛం పెట్టుకుని కాలు మీద కాలు వేసుకుని కన్నయ్య కాళ్ళ వద్ద కూర్చుని వేణువు ఊదుతున్న రాధను చూస్తే వీరికి ఎంతో ముచ్చట వేసింది. ఈ వేణునాదం విన్న కన్నయ్య ఒక్కసారి ఎంతో శక్తి వచ్చినట్లు లేచి నవ్వుతూ మంచం మీద కూర్చున్నాడు. రాధ వేణుగానం వింటూ చిన్ని కన్నయ్య ఎంతో తన్మయత్వం చెందాడు. రాధా! ఇంత అద్భుతంగా వేణువు ఊదావు! ఇక్కడితో నా జ్వరం పూర్తిగా తగ్గిపోయింది అన్నాడు.

యశోదమ్మ వచ్చి కృష్ణుడి నుదుటిమీద చెయ్యివేసి చూస్తే పిల్లవాడికి నిజంగానే జ్వరం చాలా తగ్గింది. రాధ వంక చూస్తూ ఏదో మాయచేసావు రాధా! ఇన్నాళ్ళకు ఏ మందుకు తగ్గని కన్నయ్య జ్వరం ఇదిగో నీ మురళీ గానంతో వెంటనే తగ్గింది అని అంది. అందరూ ఎంతో సంతోషించారు. రాధలో ఉన్న శక్తి అంత గొప్పది. రాధ రావడంతో కన్నయ్య జ్వరం ఆ సాయంత్రానికల్లా పూర్తిగా తగ్గిపోయింది. యశోదమ్మ ఎంతో సంతోషపడింది. కీర్తితో వదినా! ఎలాగో వచ్చారు కదా! రేపే మన కన్నయ్య పుట్టినరోజు నక్షత్రం ఒక వారం రోజులు ఉండి వెళ్ళండి అని అంది. కీర్తి అందుకు సరే అంది. అది విన్న రాధ కృష్ణులు ఎంతో సంతోషపడ్డారు. కన్నయ్య స్నేహితులు, రాధ స్నేహితురాళ్ళు కూడా ఎంతో సంతోషించారు.

ఆ రోజు సాయంత్రం అందరూ కబుర్లు చెప్పుకుని రేపు రోహిణీ నక్షత్రం నాడు కన్నయ్య జన్మదినం ఎలా ఆటపాటలతో గడపాలా! అని ఆలోచిస్తున్నారు. కన్నయ్య గోకులంలో ఉన్నన్ని రోజులు ప్రతీ నెలా వచ్చే రోహిణీ నక్షత్రం నాడు గోకులవాసులందరూ ఎంతో ఆనందంతో సంబరాలు జరుపుకునేవారు. ప్రతీ ఇంట్లో ఎన్నో పిండివంటలు చేసుకునేవారు. వారి ఇళ్ళల్లోని చిన్న పిల్లలందరినీ కృష్ణుడిలాగా అలంకరించేవారు. వారికి ఆ రోజు మరింత ఎక్కువగా వెన్న పెట్టేవారు. ఆరోజు ప్రతీ ఇంట్లో ఉన్న చిన్న పిల్లవాడు కృష్ణుడిలాగా కనిపించేవాడు. ఆ రోజంతా గోకులవాసులందరూ ఆ కృష్ణయ్య ఆట పాటలతో, ఆ కృష్ణయ్య నామ స్మరణతోనే ఉత్సాహంగా గడిపేవారు.

# 17

ఆ రోజు కృష్ణయ్య పుట్టినరోజు. అది శ్రావణమాసం. ప్రకృతి అంతా ఎంతో శోభాయమానంగా ఉంది. శ్రావణమాసంలో వచ్చిన ఆనాటి రోహిణీ నక్షత్రం నాడు గోకులవాసులందరూ కృష్ణయ్య పుట్టినరోజుని ఎంతో ఆనందంతో జరుపుకుంటున్నారు. ఇంటి గడపలకి మామిడి తోరణాలు కట్టారు. ఇంక నందుడి ఇల్లు అయితే ఎంతో అద్భుతంగా అలంకరించబడింది. మామిడి ఆకులతో పాటు రంగు రంగుల తోరణాలు కూడా కట్టారు. యశోదమ్మ ఎన్నో పిండివంటలు చేసింది.

కన్నయ్యకు గోష్టం నుంచి తెచ్చిన పాలు ఇచ్చింది. జ్వరం పూర్తిగా తగ్గిపోయి కన్నయ్య చాలా ఉత్సాహంగా ఉన్నాడు. యశోదమ్మ కూడా చాలా సంతోషంగా ఉంది. ఇంక రాధ హడావుడి అయితే చెప్పనక్కర్లేదు. కొన్ని తోరణాలు తాను ఎగిరి ఎగిరి అందుకొని కట్టింది. ఇంట్లోని తలుపులన్నిటికి నెమలి పింఛాలు అతికించింది. రాధ ఎంతో గొప్ప చిత్రకారిణి కూడా! ఎంతో

అద్భుతంగా బొమ్మలు వేస్తుంది కన్నయ్య పడుకునే గదిలో ఎదురుగా గోడమీద తాను తెచ్చుకున్న రంగులతో ఒక అద్భుతమైన వేణువు చిత్రం వేసింది. కృష్ణయ్య అది చూసి ఎంతో మురిసిపోయాడు. యశోద, కీర్తి ఎంతో అద్భుతంగా ఉన్న ఆ చిత్రాన్ని చూసి రాధకు ఇంత బాగా వచ్చా! అని ఆశ్చర్యపోయారు.

అందరూ ఏవో పనుల్లో పడ్డారు. ఇంతలో రాధ మళ్ళీ కన్నయ్య ఉన్న గదిలోకి వచ్చి గోడకు తాను వేసిన వేణువు చిత్రం వంక చూడసాగింది. ఆ చిత్రం చూస్తూ నిజంగా తానే వేశానా! అని ఆశ్చర్యపోయింది. ఇంతలో అక్కడకి వచ్చిన కన్నయ్య కూడా రాధ పక్కనే నుంచొని ఆ చిత్రం చూస్తున్నాడు. ఇంతలో ఆశ్చర్యంగా గోడ మీద ఉన్న ఆ వేణువు చిత్రం నుంచి దివ్యమైన వేణుగానం వినపడసాగింది. రాధ ఆశ్చర్యంగా కన్నయ్య వంక చూసింది. కన్నయ్య చిరునవ్వు నవ్వాడు. ఈ వేణునాదం రాధకు తప్ప ఇంకెవ్వరికీ వినపడడం లేదు.

అందరూ ఎవరి పనుల్లో వారు అటూ ఇటూ తిరుగుతున్నారు ఆ దివ్య వేణునాదానికి రాధ ఎంతో ఆనందపడింది. కన్నయ్య చిరునవ్వు నవ్వుతూ రాధ వంక చూసాడు. ప్రపంచంలోని ప్రేమతత్వం అంతా ఆ చూపులోనే కనిపించింది. రాధ కూడా కన్నయ్యను ఎంతో ప్రేమ నిండిన కళ్ళతో చూసింది. అసలు కళ్ళలో ఈ విశ్వంలోని ప్రేమతత్వం మొత్తం నిలుపుకుని చూడడం అంటే అది కేవలం రాధ ఒక్కదానికే అంత అద్భుతంగా సాధ్యం! అంతటి మహత్తరమైన ప్రేమనిండిన కళ్ళతో చూడడం కేవలం రాధాకృష్ణులకే సాధ్యం! ప్రపంచంలోని స్వచ్ఛమైన ప్రేమికులందరూ ఇలా చూపులతోనే ఒకరినొకరు ఆరాధిస్తూ ఉంటారు. ఇదంతా వారిపై రాధాకృష్ణుల ప్రేమ తత్వ ప్రవాహం అంత ఎక్కువగా ఉండటమే!

రాధా కృష్ణుల ప్రేమ ఎంతో స్వచ్ఛమైనది, ఎంతో మధురమైనది. వారి కనులలో ఆ దివ్యప్రేమ భాసించినట్లుగా ఇంకెవ్వరికీ సాధ్యం కాదు. అందుకే వీరిద్దరూ ఈ ప్రపంచంలోని ప్రేమికులందరికీ ఆరాధ్య స్వరూపాలు.

రాధాకృష్ణుల అనుగ్రహంతోనే ప్రేమికులు ఒకరి ఎడల మరొకరు స్వచ్ఛమైన ప్రేమను ప్రకటించుకోగలుగుతారు. ఆ ప్రేమలో ఉన్న మాధుర్యాన్ని ఎంతో అద్భుతంగా అనుభవించగలుగుతారు.

ఇంతలో గుమ్మం బయట అమ్మా! అని ఎవరిదో గొంతు వినపడింది ఎవరు వచ్చారా? అనుకుంటూ యశోదమ్మ వెళ్ళింది రాధ కూడా యశోదతోపాటే ఉంది. బయట ఇద్దరు వేద పండితులు అత్యంత తేజస్సుతో మెరిసిపోతూ నుంచొని ఉన్నారు. యశోద, నందులు వారిద్దరినీ లోపలకి రండి స్వామీ! అని ఆహ్వానించారు.

వారిలో ఒక బ్రాహ్మణుడు ఈ రోజు కృష్ణయ్య పుట్టినరోజు కదా! ఆశీర్వదించి వెళ్తాము అని అన్నాడు. యశోద చాలా సంతోషం స్వామి అంది. ఇరువురు కృష్ణయ్య పడుకున్న మంచం వద్దకు వచ్చారు. కృష్ణయ్య వీరిని చూడగానే లేచి కూర్చున్నాడు. ఆ వచ్చిన ఇద్దరు బ్రాహ్మణులు ఒక్కసారిగా కన్నయ్యకు నమస్కారం పెట్టారు. యశోదమ్మ ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది! కంగారు పడుతూ ఇదేంటి స్వామీ! చిన్న పిల్లవాడికి నమస్కారం పెడుతున్నారు, ఆయుక్షీణం కదా! అంది.

వారిద్దరు ఒక్క క్షణం ఏదో తొట్రుపాటు పడుతున్నట్లు చూసి ఏదో పరధ్యానంలో నమస్కరించాము తల్లీ! అని వెంటనే ఆశీర్వచన మంత్రాలు చదవడం ప్రారంభించారు. కన్నయ్య వారి ఎదురుగా నుంచొని వారికి నమస్కరిస్తూ ఆ మంత్రాలు వింటున్నాడు. నందునికి వారు చదువుతున్న ఆశీర్వచనం అర్థం కావట్లేదు. కాస్త కొత్తగా అనిపించింది. ఇంతకు ముందు ఎప్పుడూ విన్నట్లుగా అనిపించలేదు. కొంచెం ఆశ్చర్యం వేసింది. బహుశా! వీరిద్దరూ ఎంతో గొప్ప పండితులై ఉంటారు! అని అనుకున్నాడు. ఆశీర్వచనం పూర్తి అవ్వగానే యశోదమ్మ వారిని కాసేపు కూర్చోమని చెప్పింది. యశోద, నందులిద్దరూ వారికి సత్కారాలు చేశారు. యశోదమ్మ లోపలినుంచి తియ్యటి పాయసం తెచ్చి వారికి పెట్టింది. యశోద నందులిద్దరూ వీరికి దక్షిణ కానుకలు తీసుకురావడానికి ఇంటిలోనికి వెళ్ళారు.

అప్పుడు కన్నయ్య చిరునవ్వు నవ్వుతూ ఆ వేద పండితులతో అంతా కుశలమే కదా! అన్నాడు. వారిద్దరూ చిరునవ్వు నవ్వుతూ అందరం కుశలమే వాసుదేవా! అన్నారు. ఆ వచ్చిన ఇద్దరూ ఎవరో కాదు! బ్రహ్మ, మహేశ్వరులే! ఇది కృష్ణయ్యకు, అక్కడ కొంచెం దూరంగా ఉన్న రాధకు తప్ప మరెవరికీ తెలియదు. అసలు గోకులంలో కృష్ణయ్య తత్వాన్ని బాగా గ్రహించిన ముఖ్య వ్యక్తి రాధయే. రాధ ఇదంతా చూసి సంతోష పడింది. ఇంతలో యశోద, నందులు వచ్చి వీరిద్దరికీ దక్షిణ తాంబూలాలు సమర్పించి నమస్కారం చేశారు. వారిద్దరూ అందరిపైన అక్షతలు వేస్తూ రాధపైన కూడా వేసారు. ఇక వెళతాము కన్నయ్యా! అని చెప్పి అటు తరువాత రాధవైపు తిరిగి రాధకు కూడా చెప్పి వెళ్ళారు. ఇలా ఆ బ్రాహ్మణులిద్దరూ ఈ చిన్న పిల్లలైన కన్నయ్యకి, రాధకి ఎందుకు చెప్పారో యశోదమ్మకు అర్థం కాలేదు చాలా ఆశ్చర్యపోయింది.

ఆ రోజు పగలంతా కన్నయ్య, రాధ, గోపబాలురితో, స్నేహితులతో కలిసి ఎంతో గొప్పగా, ఎంతో సంతోషంగా ఆడుకున్నారు. గోపాలకులందరూ కోలాటాలు ఆడారు. నెమళ్ళు నృత్యం చేసాయి, కుందేళ్ళు ఆనందంతో పరుగెడుతున్నాయి. కన్నయ్య, రాధ స్నేహితులతో, స్నేహితురాళ్ళతో కలిసి వైభవంగా నృత్యం చేశారు. అందరూ కలిసి కోలాటాలు ఆడారు. తరువాత సాయంత్రానికి అందరూ ఇళ్ళకు చేరుకున్నారు.

ఆ రోజు రాత్రి రాధాకృష్ణులిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ యమున ఒడ్డుకు చేరుకున్నారు. ఆ ఒడ్డున గల ఒక రాతిపై కూర్చున్నారు. అప్పుడు రాధ కన్నయ్యతో ఇలా అంది. కన్నా! నాకు ఒక విషయం చెప్పవా! ఆ రోజు నువ్వు మధుర నుంచి గోకులానికి పుట్టగానే అర్థరాత్రి వేళ వచ్చావు కదా! మరి నీ తండ్రి వసుదేవుడు అంత అర్థరాత్రి వేళ యమునను ఎలా దాటాడు? ఎక్కడ దాటాడు? ఆ ప్రదేశం ఎక్కడ ఉందో! నాకు చూపించవా అంది. అప్పుడు కన్నయ్య పద చూపిస్తాను అని కొంత ముందుకి తీసుకువెళ్ళాడు.

రాధ కన్నయ్యతో పాటు ఎంతో ఉత్సాహంగా చెంగు చెంగున ఎగురుతూ నడుస్తోంది. వీరిద్దరూ అలా యమున ఒడ్డున చేతిలో చేయివేసుకుని కబుర్లు చెప్పుకుంటూ నడుస్తూ ఉంటే యమున లోని చేప పిల్లలు కళ్ళు పెద్దవి చేసుకుని వీరిద్దరి వంక ముచ్చటగా చూడసాగాయి. రాధ వాటిని చూసి ఎంతో ముచ్చటపడుతోంది ఇంతలో సన్నటి తుంపర ప్రారంభమయింది. అవును కన్నయ్యా! ఆ రాత్రి చాలా పెద్ద వర్షం పడిందిట కదా! అంది. అవును రాధా! ఆ రోజు రాత్రి ఎంతో పెద్ద వర్షం పడింది అన్నాడు కన్నయ్య.

అయ్యో! నువ్వు ఆ వర్షంలో తడవలేదా? అని ఏమి ఎరుగనట్లు కొంచెం భయం నటిస్తూ అడిగింది రాధ. లేదు! నేను తడవలేదు అని ఒకచోట ఆగి ఇదిగో రాధా! ఇక్కడే నా తండ్రి నన్ను గోకులానికి ఆ అర్థరాత్రినాడు తీసుకువచ్చాడు అని అన్నాడు. రాధ ఎంతో ముచ్చటగా చూస్తూ కన్నయ్య మనం ఇక్కడ కొంచెం నదిలోకి నడుద్దామా అంది. అమ్మో! మునిగిపోతేనో అన్నాడు కన్నయ్య. రాధ చిరునవ్వు నవ్వుతూ కన్నా! నీ సంగతి నాకు తెలియదా! గోవర్ధన గిరి ఎత్తినవాడవు నువ్వు ఈ యమునలో మునగడమా అని గట్టిగా నవ్వింది.

అప్పుడు కన్నయ్య రాధతో ఇలా అన్నాడు రాధా! ఆ రాత్రి ఏం జరిగిందో తెలుసా! నా తండ్రి వసుదేవుడు ఒక గంపలో నన్ను పెట్టుకుని అవతల ఒడ్డునుంచి యమునను దాటడానికి ప్రయత్నిస్తూ ఉంటే భీభత్సమైన గాలి, ఎంతో పెద్ద వర్షం ప్రారంభమయ్యాయి. నా తండ్రి ఎంతో భయభ్రాంతుడయ్యాడు. శ్రీమన్నారాయణా! నీవే శరణు అంటూ ఎలుగెత్తి గట్టిగా స్మరిస్తూ యమునలో కాలుపెట్టి ముందుకు నడిచాడు. కొద్ది కొద్దిగా ముందుకు వెళుతున్న కొద్దీ నీటి ఉధృతి విపరీతంగా పెరగసాగింది. ఆ ప్రవాహం ఒక్కసారిగా నా తండ్రి గొంతు వరకు వచ్చింది. కానీ తాను దృఢసంకల్పంతో ముందుకు సాగుతున్నాడు. నేను తడవకుండా ఆదిశేషుడు నాపైన పడగపెట్టి మాతోనే వస్తున్నాడు. యమున అంత ఉధృతంగా ఎందుకు ప్రవహిస్తోందో! అప్పుడు నాకు అర్థమయింది. ఎప్పటినుంచో నా

రాకకై ఎదురుచూస్తున్న యమున నన్ను చూసి ఆనందం పట్టలేక నన్ను తాకాలని చూస్తోంది. ఎంతో ఉవ్విళ్ళూరుతోంది! అని నేను గ్రహించాను. వెంటనే నేను ఆ బుట్టలోనుంచి నా కాలు కొంచెం బయటకు పెట్టాను. అంతే! యమున ఒక్కక్షణం ఉప్పొంగి నా పాదాలను తాకి ఒక్కసారిగా ఉధృతి తగ్గి చాలా తక్కువ స్థాయికి వచ్చింది. అక్కడితో నా తండ్రి ఎంతో సునాయాసంగా యమునను దాటి ఆ రాత్రి గోకులానికి వచ్చాడు. అని కన్నయ్య ఆ రాత్రి జరిగిన విశేషాలన్నీ రాధకు వివరంగా చెప్పాడు.

కన్నయ్య ఆ విధంగా తాను జన్మించిన నాటి రాత్రి తాను గోకులానికి ఎలా వచ్చింది రాధకు వివరంగా చెప్పాడు. ఆనాడు రోహిణీ నక్షత్రం. దైవికంగా ఈ రోజు కూడా రోహిణీ నక్షత్రమే! ఇదంతా విని రాధ ఎంతో ఆనందించింది. రాధ ముచ్చట తీర్చడం కోసం కన్నయ్య రాధ చెయ్యి పట్టుకుని యమునలోకి కొంచెం నడిచాడు. యమున ముచ్చటపడి వీరిద్దరికీ దారి ఇచ్చింది. అలా కొంచెం దూరం ఆ నీటిలో నడిచి తిరిగి వెనుక ఒడ్డుకు వచ్చారు. అక్కడే ఒక రాతి బండపై కూర్చుని ఇద్దరూ అనేక విశేషాలు చెప్పుకున్నారు. వారిద్దరికీ ఈ లోకానికి ఈ ద్వాపరయుగంలో ఇక్కడ ఎందుకు జన్మించారో? ఆ కారణం అంతా వివరంగా తెలుసు. కానీ లౌకికంగా వారు తమకు ఏమీ తెలియదన్నట్లు గోకుల వాసుల మధ్య సామాన్య మానవులు లాగా జీవించేవారు. ఆనాటి రాత్రి వారిరువురు చాలాసేపు అనేక విశేషాలు ముచ్చటించుకొని తరువాత ఇంటికి చేరుకున్నారు.

ఈ సృష్టిలో రాధాకృష్ణుల ప్రేమ అత్యంత మహోన్నతమైనది. కృష్ణయ్య అత్యంత మనోహరుడు. సృష్టి మొత్తాన్ని తనవద్దకు ఆకర్షించుకునే సంకర్షణుడు శ్రీకృష్ణుడే! అలాగే రాధ కూడా ప్రేమ స్వరూపిణి. రాధా నామాన్ని పలికితే శరీరమంతా పులకిస్తుంది. ఆ నామాన్ని ధ్యానం చేస్తే మనం అలౌకిక ఆనందాన్ని పొంది ఎంతో ఉన్నత స్థితిలోకి వెళ్తాం. ఈ నామాన్ని పలికిన మరుక్షణంలోనే శుకమహర్షి తాను ఒక యోగ సమాధిలోకి

వెళ్ళిపోతానని గ్రహించి పరిక్షిత్తుకు ఏడు రోజులలో భాగవతం చెప్తున్నప్పుడు ఐదు అధ్యాయాల రాసలీల ప్రవచనంలో రాధానామాన్ని ఏమాత్రం ప్రస్తావించకుండా జాగ్రత్త పడ్డాడు.

రాధలోను, శ్రీకృష్ణుడులోను ఉన్నది సమానమైన పరమ ప్రేమభావం. భగవంతుని భక్తుడు తను చేసే నిత్య కర్మలన్నింటిలోను ఆ పరంధామునితోనే జీవిస్తుంటాడు. ఆ విధంగా ఆ భక్తుడు ఒక మహాయోగిగా మారతాడు. అందుకే గోపికలందరూ పరమ యోగులే! ఒకనాడు గోపికలకు కృష్ణుడు శ్రీమన్నారాయణులాగా చతుర్భుజాలతో దర్శనమిచ్చాడు. అప్పుడు వారందరూ శ్రీమహావిష్ణువుని స్తుతించ సాగారు.

అప్పుడు అక్కడ రాధాదేవి తక్షణమే ప్రత్యక్షమైంది. అలా రాధాదేవి రాగానే శ్రీమన్నారాయణుడు తిరిగి శ్రీకృష్ణ రూపంలోకి మారిపోయాడు. రాధాదేవి శ్రీకృష్ణుని యొక్క ప్రేమ స్వరూపిణి. అప్పుడు గనుక రాధ అలా రాకపోతే గోపికలందరూ విష్ణు మాయలోపడి దైవ భావనతో కూడా ఏవైనా కోరికలు కోరడానికి సిద్ధమయ్యేవారు. అటువంటి లౌకిక కోరికలు మహాయోగులైన గోపికలకు విష్ణు మాయచేత కలగకుండా ఉండడానికి అక్కడకు వెంటనే రాధ వచ్చింది. అక్కడితో వారు ఎదురుగా ఉన్న శ్రీమన్నారాయణునిలో యోగీశ్వరుడైన ఆ శ్రీకృష్ణ పరమాత్మనే దర్శించారు.

రాధ శ్రీకృష్ణుడి ప్రేమ స్వరూపిణి. రాధ అనే పేరు ఒక్కసారి పలికితేనే మన శరీరమంతా ఒక అద్భుత దివ్య భావనతో నిండిపోతుంది. అలాగే కృష్ణ నామానికి కూడా అనేక అర్థాలు ఉన్నాయి. ఒక అర్థం తన నామాన్ని స్మరించినంత మాత్రమునే ఎంతో ఆనందాన్ని, మనస్సుకు ప్రశాంతతను ఇచ్చేవాడు అని అర్థం. అందుకే మన మనస్సులో ఏదైనా అశాంతి ఏర్పడితే కృష్ణా! అని వీలునన్నిసార్లు పలికితే వెంటనే మనస్సు ఎంతో తేలిక పడుతుంది. రాధాకృష్ణుల ప్రేమతత్వాన్ని పూర్తి అనుభవంలోకి తెచ్చుకుంటే మనకు అంతులేని ఆనందం కలుగుతుంది. మనకు ఏ లౌకిక విషయాల యందు ఆసక్తి ఉండదు.

నిత్యం రాధాకృష్ణుల గాధను వినేవారికి జీవితం ఎంతో ఆనందంగా గడుస్తుంది. వారికి కలిగే ఏ లౌకిక కష్టాలు ఎటువంటి బాధను ఇవ్వవు. వారు జీవించినంత కాలం ఎంతో ప్రశాంతంగా జీవిస్తారు. మురళిపైన శ్రీకృష్ణులవారు అమృతం కురిపిస్తుంటే రాధా! రాధా! రాధా! రాధా! అంటూనే వినిపిస్తుంది. జగత్తు మొత్తం ప్రేమమయం అవుతుంది. రాధాదేవి అనుగ్రహం లేకపోతే మనం అసలు ఆ ప్రేమతత్వం అర్థం చేసుకోలేము. అందుకే మహాభక్తులు నిత్యం రాధా నామస్మరణతో బృందావనంలో సంచరిస్తుంటారు. ఆ రాధా నామస్మరణచేత భక్తులు గోలోక ప్రాప్తిని పొందుతారు. రాధేశ్వరి అనుగ్రహపాత్రుడు శ్రీకృష్ణులవారు. ఆ శ్రీకృష్ణుని అనుగ్రహపాత్రురాలు రాధాదేవి. రాధలోను, కృష్ణుడిలోను ఉన్నది అత్యున్నత ప్రేమాభావం. వారిద్దరి అనుగ్రహం లేనిదే మనకు ఆ దివ్య ప్రేమతత్వం అర్థం కాదు. అందుకే మనం ఎప్పుడూ రాధాకృష్ణుల అనుగ్రహానికై ప్రార్థిస్తూ ఉండాలి. అది లభించితే అంతటి ఆనందం మరొకటి ఉండదు.

# 18

ఆ రోజు కృష్ణుడు ఉదయం లేచినప్పటినుంచి ఎందుకోగాని అంత ప్రశాంతంగా లేడు. లేవగానే రాత్రంతా ఏదో ఆలోచిస్తూనే ఉన్నవాడిలా సరిగ్గా నిద్రలేమి వాడిలా ఉన్నాడు. ఆ మర్నాడే ఇక తాను అక్రూరుడు, బలరాముడితో కలిసి మధురకు ప్రయాణమవ్వాలి. ఇక్కడితో తన ఈ అవతారంలో ఒక పెద్ద మలుపు తిరగబోతోంది. ఇక ఇప్పటినుంచీ జరుగబోయే సంఘటనల్నీ ఆ చిన్ని కన్నయ్య మనస్సులో మెదులుతున్నాయి. ముందు ముందు రోజులలో తాను చెయ్యవలసిన పనులు, దుష్టశిక్షణ, శిష్టరక్షణ అప్పటికి రెండు రోజులనుంచే ఆ జగన్నాధుని మనస్సులో మెదులుతున్నాయి. కానీ ఇవేమీ ఆ అమాయక గోకుల వాసులకు తెలియవు కదా! అసలు ఈ కన్నయ్య ఎవరు? ఈ భూమి మీదకు వచ్చింది ఎందుకు? అన్న విషయాలు అక్కడ ఎవరికి తెలుసు? కేవలం పది సంవత్సరాల వయస్సు గల ఆ పిల్లవాడు రాబోయే నూరు సంవత్సరాలలో ఎన్నో

మహోన్నత కార్యాలు చేస్తాడు, ఎంత రాజనీతిజ్ఞతతో వ్యవహరిస్తాడో! తన ఎంతటి మహోన్నత ప్రణాలికతో ధర్మాన్ని రక్షిస్తాడో! ఇవేమీ ఆ అమాయక బృందావన వాసులకు తెలియవు. వారికి తెలిసిందల్లా వారితో ఆడిన ఆటలు, చూపిన లీలలు, వారందరిపై కురిపించిన మధుర ప్రేమ మాత్రమే. కన్నయ్య ఆరోజు ఉదయాన్నే యశోదమ్మ ఇచ్చిన పాలు తాగి వెన్న తిని కొన్ని పిండివంటలు తిని తన స్నేహితులను కలవడానికి బయలుదేరాడు. అమ్మా! ఇక రేపే మధురకు ప్రయాణం కదా! ఒక్కసారి నా స్నేహితులందరినీ కలిసి వస్తాను అన్నాడు. అలాగే నాయనా! వెళ్ళిరా అంది యశోదమ్మ.

కన్నయ్య మధురకు వెళ్తున్నాడు ఎప్పుడు తిరిగి వస్తాడో? అని యశోదమ్మకు కాస్త బెంగగా ఉంది. కన్నా! నువ్వు మధురలో పనులన్నీ చూసుకుని తిరిగి త్వరగా బృందావనానికి వచ్చేయాలి తెలుసా! అని ప్రతీ నిమిషానికి ఒకసారి చెప్తోంది. అంతటి తల్లి ప్రేమ ఆ యశోదది నందునికి కూడా కన్నయ్య వెళ్తున్నాడనే కొంచెం బెంగగా ఉంది. కానీ అది బయటపడనీయడంలేదు. యశోదమ్మ కన్నయ్యతో కన్నా! నువ్వు తిరిగి పదిరోజులలో వచ్చేయాలి. అక్కడ ఏ అల్లరి చెయ్యకూడదు. నీ మేనమామ దగ్గర కొన్నాళ్ళు ఉండి తిరిగి మధురలో విశేషాలన్నీ నాకు చెప్పాలి అని అంది. అలాగే అమ్మా! వచ్చిన తరువాత ఆ విశేషాలన్నీ నీకు తప్పక చెప్తాను అన్నాడు కన్నయ్య. నేను, బలరాముడు ఎటువంటి అల్లరి పనులు చెయ్యము కొన్నాళ్ళు ఉండి వచ్చేస్తాం. మా గురించి మీరేమి బెంగపడకండి అని చెప్పి స్నేహితులను కలవడానికి బయటకు వచ్చారు.

కన్నయ్య రేపు మధుర వెళుతున్న వార్త బృందావనం అంతా తెలిసి అందరూ ఒక్కసారిగా నిరుత్సాహపడ్డారు. ఇంక రేపటినుంచి కన్నయ్య మాతో ఆడుకోవడానికి ఉండడా! మా ఇంటికి వచ్చి అల్లరి చేయడా! అనుకున్నారు. కొందరు గోపికలైతే విపరీతమైన విరహానికి లోనయ్యారు. కన్నయ్య కొన్ని రోజులలో వస్తాడు అని చెప్పినా ఆ గోవిందుని విడిచి ఒక్క క్షణమైనా ఉండలేని మధుర ప్రేమ వారిది. కన్నయ్య బయటకు వచ్చి తన

స్నేహితులను కలిసాడు. వారందరూ ఎంతో బెంగ పడుతూ కనపడ్డారు. ఆ ఉదయం నుంచి సరిగా ఏమి తినలేదు కూడా రోజూ తాగే పాలు కూడా తాగలేదు. అయ్యో! మీరందరూ ఇలా ఉంటే ఎలా నేను త్వరలో వచ్చేస్తాను మళ్ళీ మనందరం చక్కగా ఆడుకుందాం! అని వారిని బుజ్జగించాడు కన్నయ్య. ఇంతలో అటుగా ఇద్దరు గోపికలు వచ్చారు కన్నా! నిన్ను విడిచి ఒక్కరోజు కాదు కదా! ఒక్క గంట కూడా మేము ఉండలేము. నువ్వు లేని ఈ బృందావనం ఎంతో మూగబోతుంది. కన్నా! నువ్వుమాత్రం త్వరగా తిరిగి వచ్చేయాలి అని ఎంతో ప్రాధేయపడ్డారు.

ఇంతలో అటుగా వెళుతున్న రెండు ఆవులు కన్నయ్య వద్దకు వచ్చి కన్నీరు కార్చసాగాయి. బహుశా వాటికి కూడా కన్నయ్య తమని వదిలి వెళ్ళిపోతున్నాడని మనస్సులో గ్రహించినట్లున్నాయి. కన్నయ్య వాటిని నెమ్మదిగా నిమిరాడు.

కన్నయ్య మధుర ప్రేమకు బృందావనంలోని మూగజీవులన్నీ నిత్యం ఎంతో ఆనందపడుతుండేవి. అటువంటి కన్నయ్య తిరిగి ఎప్పుడు వస్తాడో? అని వాటన్నింటికీ ఎంతో బెంగ పట్టుకుంది. కేవలం జీవులే కాదు బృందావనంలోని ప్రతీ చెట్టు, ప్రతీ మొక్క, ప్రతీ ఆకు కూడా ఎంతో బాధ పడుతున్నాయి. రోజూ తమను స్పృశించి తమతో ఎంతో చక్కగా ఆడుకునే కృష్ణయ్య తమను విడిచి వెళ్ళిపోతున్నాడు అని ఎంతో బాధపడుతున్నాయి. వారందరిలో ఉన్న చైతన్యమే ఈ పురుషోత్తముడు. గోవిందుడు లేని బృందావనం వారు ఒక్కరోజు కూడా ఊహించుకోలేకపోతున్నారు.

కృష్ణయ్య ఒక్కొక్కరినీ ఓదారుస్తూ బృందావనంలోని అటవీ ప్రాంతానికి వెళ్ళాడు. అక్కడ ఒక చెట్టు క్రింద రాధ వేయి కన్నులతో ఎదురుచూస్తోంది. కన్నయ్య రాధను సమీపించగానే రాధ చిరుకోపంతో మూతి ముడుచుకుంది. కన్నా! నువ్వు రేపు మధురా నగరం వెళుతున్నావు అని తెలిసింది! నిన్ను విడిచి నేను ఎలా ఉండగలను? నిత్యం నిన్ను తప్ప వేరే ఏది తలవను. నీ నామం, నీ రూపం నా మనస్సులో నిత్యం

ప్రకాశిస్తూంటాయి. నువ్వు బృందావనంలో లేవనే ఆలోచన కూడా నేను చెయ్యలేకపోతున్నాను. నన్ను వదలి నువ్వు ఎలా వెళ్ళిపోతున్నావు. నాకు తెలుసు నువ్వు మళ్ళీ ఇప్పుడే రావు. ఏవో మాయ మాటలు చెప్తావు. అందరినీ మాయలో పడేయడం నీకు తెలిసిన విద్యయే కదా! ఇక్కడివారందరినీ వదిలి వెళుతున్నావు. నువ్వు లేని నేను ఎలా బ్రతుకుతాను అని రాధ కన్నీరు మున్నీరు అయింది.

అప్పుడు కన్నయ్య రాధను దగ్గరకు తీసుకుని రాధా! అసలు నేను నిన్ను విడిచి వెళ్ళడం ఏమిటి? నేను ఎప్పుడూ ఉండేది నీ హృదయంలోనే! అలాగే నీవు ఉండేది నా హృదయంలోనే! ఇద్దరమూ ఒకటే తత్వం ప్రేమతత్వం! అదే రెండు రూపాలుగా లోక కళ్యాణార్థం ఒక మహాయజ్ఞం కోసమై భాసిల్లుతున్నదని నీకు తెలియనిదా! రాధా! నేను ఎక్కడ ఉన్నా నువ్వు తల్చుకున్న క్షణంలో నీ మనస్సులో ఆ క్షణంలో నేను ఎక్కడ ఉన్నానో? ఏం చేస్తున్నానో? నీకు తెలుస్తుంది. అలాగే నేను కూడా నిత్యం నిన్ను నా హృదయంలో దర్శిస్తూనే ఉంటాను. ఈ సర్వ ప్రాణికోటిని ప్రేమ రూపంలో అనుగ్రహిస్తున్నది నీవే కదా! ఈ జగమంతా నాలోని నీ తత్వం కోసమే. ఈ అద్భుత అనుభూతిని అనుభవించడానికే నన్ను ఆరాధిస్తున్నారు నా వైపు ఆకర్షితులౌతున్నారు. యోగులందరూ గోపికల రూపంలో నాపట్ల ఆకర్షితులౌతున్నది నాలోని నీ ప్రేమ తత్వానికి ఆకర్షింపబడే కదా! ఇది నీకు తెలిసినదే కదా! అన్నాడు కన్నయ్య.

ఇదంతా నాకు తెలియదు కన్నయ్య! నిన్ను చూడకుండా నేను ఉండలేను. నువ్వు ఇక్కడ బృందావనంలో ఉండవలసిందే ఇది నీ రాధ ఆజ్ఞ అనుకో! అని రాధ అంది. అప్పుడు కృష్ణుడు రాధతో సరే అలాగే రాధా! నువ్వు కోరుకున్నట్లు నేను ఇక్కడే ఉండిపోతాను. ఇక మధురకు వెళ్ళను ఈ జన్మంతా ఇక్కడే బృందావనంలోనే ఉండిపోతాను సరేనా రాధా! అన్నాడు. ఇలా కృష్ణయ్య అన్నాడో లేదో! తక్షణం అక్కడ వారి ఎదురుగా బ్రహ్మ, ఇంద్రుడు, కుబేరుడు, వరుణుడు ఆదిగా గల దేవతలందరూ ప్రత్యక్షమయ్యారు. వారు

రాధతో ఇదేమి వైపరీత్యం తల్లీ కాస్త మా మాట ఆలకించు. శ్రీకృష్ణుడు అవతరించిందే దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం కదా! ఆ స్వామి చెయ్యవలసిన అనేక కార్యాలు ముందున్నాయి. ఇంకా ద్వాపరయుగం పరిసమాప్తి అయ్యే కాలం దగ్గరపడుతోంది. ఆ పురుషోత్తముని ప్రియసఖి అయిన శ్రీమహాలక్ష్మివి! ఇదంతా నీకు తెలియంది కాదు కదా! ఆ గోవిందుడులోని శక్తి మొత్తం నువ్వే కదా తల్లీ! రాక్షసులను సంహరించి దుర్మార్గులను మట్టుపెట్టి భూదేవి భారం తగ్గించడానికి వచ్చినవాడు ఈ పురుషోత్తముడు! దయచేసి మా మొర ఆలకించి నువ్వు ఈ స్వామిని ముందుకు వెళ్ళకుండా ఆపవద్దు అని పరిపరి విధాల వేడుకున్నారు.

అప్పుడు రాధా దేవి శాంతించి సరే కృష్ణా! నువ్వు ముందుకు వెళ్ళు నువ్వు వచ్చిన కర్తవ్యం నిర్వహించు అని అన్నది. ఓ దేవతలారా! ఇంక మీరు నిశ్చింతగా మీ లోకాలకు మీరు వెళ్ళవచ్చు అని అన్నది. రాధ అలా అనగానే బ్రహ్మ, ఇంద్రుడు, కుబేరుడు, వరుణుడు ఆదిగా గల దేవతలందరూ సంతోషించి రాధాకృష్ణులిద్దరికీ నమస్కరించి అదృశ్యమయ్యారు. తమ తమ లోకాలకు వెళ్ళిపోయారు. అప్పుడు రాధ కన్నయ్యతో కన్నా! నీ కర్తవ్య నిర్వహణలో నువ్వు ముందుకు వెళ్ళు. నేను నిత్యం ఇక్కడ బృందావనంలో ఇదిగో! ఈ వృక్షం కిందనే కూర్చుని నిన్ను ధ్యానిస్తూ ఉంటాను. అయితే నువ్వు నాకు ఒక మాట ఇవ్వాలి నేను ఈ భౌతిక శరీరం వదిలి వేసే రోజున నువ్వు నా వద్దకు రావాలి. నా యందు దయచేసి ఈ కోరికను మాత్రం మన్నించు కృష్ణా! అంది రాధ. కన్నయ్య రాధతో అలాగే తప్పకుండా సఖి! నేను తప్పకుండా నువ్వు ఈ భౌతిక శరీరం వదిలి వెళ్ళే రోజున నీవద్దకు వస్తాను సరేనా దేవి! అని రాధను హృదయానికి హత్తుకున్నాడు.

కృష్ణయ్య రాధను అలా దగ్గరకి తీసుకోవడంలో అప్పటిదాకా ఎంతో ఉద్రుతంగా ఉన్న ప్రకృతి అంతా కాస్త శాంతించింది. కృష్ణయ్య రాధ చెక్కిలిపై సుతిమెత్తని ముద్దు ఇచ్చాడు. రాధ కన్నయ్య రెండు చెక్కిలపై చేతులు వేసి నుదుటిపై ఎంతో ప్రేమతో ముద్దు పెట్టింది. కృష్ణా! రోజూ నువ్వు! ఎక్కడ

ఉన్నా ఏ పనులలో ఉన్నా ప్రతి రోజు నిద్ర లేవగానే ఈనాడు ఇక్కడ నేను ఇచ్చిన ముద్దు గుర్తుతెచ్చుకో! ఇది నీకు ఆరోజు మొత్తం ఎటువంటి పరిస్థితి అయిన ఎదుర్కునే శక్తి ఇస్తుంది. అయినా నేను నీకు శక్తి ఇచ్చేదేమిటి ఈ సర్వసృష్టికి ఆధారభూతుడవు నీవే కదా! అంది. అప్పుడు కన్నయ్య అలాగే దేవీ! అని రాధ దగ్గర సెలవు తీసుకుని ఇంటికి బయలుదేరాడు.

ఆ తరువాత రోజు ఉదయాన్నే రథం ఎక్కి కృష్ణుడు, బలరాముడు అక్రూరుడితో కలిసి మధురకు బయలుదేరారు. వీరు అలా వెళుతుంటే బృందావనం మొత్తం మూగబోయింది. గోపకాంతలు అందరూ కన్నీటి ధారలు కారుస్తున్నారు. రథం అలా వేగంగా వెళుతూ ఉంటే ఆ వెనుకే ఎన్నో లేడి పిల్లలు, ఆవు దూడలు, నెమళ్ళు, జింకలు, కుందేళ్ళు వేగంగా అనుసరిస్తూ రాసాగాయి. వాటన్నింటికి కన్నయ్య వదిలి వెళుతుంటే ఎంతో బాధగా ఉంది. అలా వస్తున్న ఆ జీవులన్నింటినీ కన్నయ్య ఒక్క నిమిషం రథం ఆపమన్నాడు. రథం దిగి వాటిని చేతితో నిమిరి మీరందరూ ఇలా బాధపడకండి. నేను తప్పకుండా మళ్ళీ త్వరలో వస్తా! అయినా నేను ఎక్కడకి వెళుతున్నాను మీ అందరి హృదయాలలో ఎప్పుడూ ఉంటాను కదా! అని వాటిని ఓదార్చాడు. ఇక ముందుకు రాకండి! అని చెప్పి రథం తిరిగి ఎక్కాడు. అక్కడతో ఆ మూగ జీవులన్నీ కన్నీరు కారుస్తూ అక్కడే ఉండిపోయాయి.

ఇలా కొంతదూరం వెళ్ళగానే అక్కడ దారికి అడ్డంగా పడుకున్న కొన్ని వందలమంది గోపకాంతలు నిలబడ్డారు. అక్కడితో రథం ఆగక తప్పలేదు. అప్పుడు కన్నయ్య మళ్ళీ రథం దిగి వారి దగ్గరకి వెళ్ళాడు. వారందరూ ఏక కంఠంతో కన్నయ్యా! నిత్యం నిన్ను మా హృదయాలలో నింపుకుని నీవే సర్వస్వంగా భావిస్తాం! అటువంటి మమ్మల్ని వదలి నువ్వు ఇలా వెళ్ళడం నీకు భావ్యం కాదు. ఈ విరహం మేము ఏ మాత్రం తట్టుకోలేము. నువ్వు ఇలా ఈ బృందావనం వీడి వెళ్ళిపోతే మేమందరం ఎలా జీవించాలి? అని కన్నయ్యను వెళ్ళవద్దని ఎన్నో విధాల ప్రాధేయపడ్డారు. కన్నయ్య అప్పుడు వారిని ఊరడించి మిమ్మల్ని నేను వదిలింది ఎప్పుడు?

భౌతికంగా వెళుతున్నానే కానీ ఎప్పుడూ మీ హృదయంలోనే ఉంటాను. మీరందరూ ఎప్పుడూ నా హృదయంలోనే ఉంటారు. మన ఆటపాటలు నిత్యం నాకు గుర్తుకు వస్తూనే ఉంటాయి. ఆ ఆనందం ఎప్పటికీ మర్చిపోను. మీరు నాపై చూపిన ప్రేమ ఒక అమృత ప్రవాహం. అది ఎప్పటికీ ప్రవహిస్తూనే ఉంటుంది. మీరందరూ నాకెంతో ప్రియమైన వారు. నేను చెయ్యవలసిన అతి ముఖ్యమైన పనులు కొన్ని ఉన్నాయి అందుకోసం నన్ను ముందుకు వెళ్ళనివ్వండి! నా రథానికి అడ్డు తొలగి దారి ఇవ్వండి! అని అన్నాడు.

అప్పుడు గోపికలందరూ కృష్ణుని మాట విని పక్కకి తప్పుకొని రథం ముందుకి వెళ్ళడానికి దారి ఇచ్చారు. అక్కడితో కృష్ణుడితో, బలరాముడితో కలిసి రథం ముందుకు సాగింది. అయితే వీరందరి విరహం ఒక ఎత్తు అయితే రాధ విరహం మరొక ఎత్తు. ఆ రోజు ఉదయాన్నే లేచిన రాధ బృందావనంలోని అడవిలోకి వెళ్ళి తమాల వృక్షం వద్దకు చేరి కన్నయ్యను ధ్యానం చేస్తూ కూర్చుంది. కన్నయ్యకు మనస్సులోనే వీడ్కోలు చెప్పింది. అక్కడ రథంలో మధుర వైపుగా వెళుతున్న కన్నయ్య కూడా రాధ అడవిలో ఉన్నవైపు తిరిగి మనస్సులోనే తన ప్రియసఖికి వీడ్కోలు చెప్పాడు. అటు తరువాత రథం వేగంగా ముందుకు సాగిపోయింది.

# 19

కృష్ణుడు మధురకి వెళ్ళిన తరువాత రాధ ఎంతో బాధ పడుతూ ఎవ్వరితో మాట్లాడకుండా ఎంతో ముభావంగా ఉండేది. రోజూ బృందావనంలోని అటవీ ప్రాంతానికి వెళ్ళి తానూ, కన్నయ్య నిత్యం కూర్చుని కబుర్లు చెప్పకునే ప్రదేశాలన్నీ ఆ స్వామినే తలచుకుంటూ తిరుగుతూ గంటలు గంటలుగా ధ్యానంలో మునిగిపోయి ఉండేది. రాధాకృష్ణులిద్దరూ ఒక్కరే కదా! శ్రీకృష్ణుడు మురళి ఊదుతూ ఉంటే ఆ దివ్య తరంగాలు రాధా! రాధా! అంటూ వినిపిస్తాయి. రాధ మూర్తీభవించిన ప్రేమతత్వం. రాధాకృష్ణుల ప్రేమ ఈ లోకానికే ఎంతో ఆదర్శం. ఎన్ని యుగాలైనా నిలిచేది రాధాకృష్ణుల అపూర్వ ప్రేమయే. ఈ సృష్టి మొత్తానికి ఆలంబన ఆ ఇద్దరి ప్రేమమూర్తుల ప్రేమతత్వమే.

ఒకప్పుడు బృందావనంలోని నీలా నికుంజంలో ఒక తూనీగ ఉండేది. ఆ తూనీగ సామాన్యమైన తూనీగ కాదు. ఒక భగవదంశతో

జన్మించిన కీటకం అది.ఆ తూనీగకు రాధ అంటే ఎంతో ప్రాణం. పగలు రాత్రి రాధా! రాధా! అంటూ ఎప్పుడూ ఆ రాధాదేవినే స్మరిస్తూ, ఆరాధిస్తూ ఉండేది. ఒకనాడు ఆ తూనీగను చూసి రాధ తనని ఇంతగా ఆరాధించడం చూసి ఎంతో ముగ్ధురాలై దానిని చేతిలోకి తీసుకుని నెమ్మదిగా నిమిరింది. నువ్వు నా నామాన్ని ఎప్పుడూ స్మరిస్తున్నావు ఇది నాకు ఎంతో సంతోషమే కానీ ఇంతకంటే కోటిరెట్లు ఆనందాన్నిచ్చే మరొక నామం ఉంది తెలుసా! అదే కృష్ణ నామం! ఆ నామాన్ని కీర్తించు ఆ నామాన్నే స్మరించు ఆ దివ్య నామాన్నే ధ్యానించు అది నీకు ఎంతో దివ్య అనుభూతిని ఇస్తుంది అని అంది.

ఇంతలో అక్కడకి శ్రీకృష్ణ భగవానుడు వచ్చాడు. ఒక్కసారిగా ప్రత్యక్షమైన శ్రీకృష్ణులవారిని చూసి రాధ, తూనీగ ఆశ్చర్యపోయారు. అప్పుడు కన్నయ్య ఆ తూనీగను చేతితో తీసుకుని ఎంతో ప్రేమతో దాని వీపుమీద నిమిరాడు. ఆహా! సాక్షాత్తూ రాధాకృష్ణుల స్పర్శ లభించిన ఆ తూనీగ ఎంతటి అదృష్టవంతురాలో కదా! రాధ చేతిలోనుంచి ఆ తూనీగను తీసుకున్న కన్నయ్య దాని మధుర ప్రేమను చూసి ఎంతో మురిసిపోయాడు. అప్పుడు ఆ తూనీగ కృష్ణా! కృష్ణా! అంటూ పలక సాగింది. మళ్ళీ రాధా! రాధా! అంటోంది ఎందరో యోగులు ఎంతో తపస్సు చేస్తే గాని దక్కని రాధాకృష్ణుల దివ్య ప్రేమామృతం ఈ తూనీగకు లభించింది.

ఆనాటి ఆ తూనీగనే అంతటి దివ్యానుగ్రహాన్ని పొందడం చేత రాసతత్వవేత్తగా, యోగీశ్వరుడిగా, మహాభాగవతోత్తముడిగా, వ్యాస భగవానునికి పుత్రునిగా, శ్రీ శుకమహర్షిగా జన్మించాడు. శ్రీకృష్ణ లీలలను దివ్యంగా ప్రచారం చేసిన పరమ పురుషుడయ్యాడు. ఎవరు నిరంతరం కృష్ణయ్య  ధ్యానంలో ఉంటారో! ఎప్పుడూ ఆ కృష్ణ నామామృతాన్నే పూర్తిగా అనుభవిస్తూంటారో! వారి వాక్కే ఆ కన్నయ్య వాక్కు అవుతుంది. అటువంటి మహనీయుల స్పర్శనే ఆ కన్నయ్య స్పర్శ కూడా అవుతుంది. రాధాతత్వాన్ని ఎప్పుడూ ధ్యానిస్తూ ఉంటాడు కాబట్టి ఆ మహనీయుడి స్పర్శ రాధా స్పర్శయే అవుతుంది.

ఆరోజు రాధాదేవి తమాలి వృక్షం దగ్గర కూర్చుని కన్నయ్య గురించి ఎంతో బాధ కలిగి తీవ్రంగా కన్నీరు కారుస్తోంది. ఆమె ఒక యోగినిలా అనిపిస్తోంది. శ్రీకృష్ణ నామామృతాన్ని, రూపామృతాన్ని నిత్యం గ్రోలే మహా యోగి. మహాశక్తి కన్నయ్యలో ఉన్న దివ్య శక్తి ఈ రాధయే కదా! అప్పుడు అక్కడకి నారద మునీంద్రులవారు వచ్చారు. ధ్యానంలో ఉన్న రాధకు నారద మునీంద్రులవారు రావడం గ్రహింపుకు వచ్చింది. కనులు తెరచి ఆ మహర్షికి నమస్కరించింది.

ఓ మహాత్మా! నాకు ఆ కన్నయ్యే సర్వస్వం అని మీకు తెలుసు కదా! ఏమిటి నాకీ విరహం! ఎన్నాళ్ళు నాకీ ఎడబాటు! ఇక జీవితంలో నేను కన్నయ్యను ఎప్పటికీ కలవలేనా! అని ఎంతో బాధతో అడిగింది. ఆ మాటలకు నారదుడు సమాధానమిస్తూ అమ్మా! నువ్వు సర్వము తెలిసిన జగన్మాతవు! శక్తిస్వరూపిణివి! నీకు తెలియనిది ఏముంది చెప్పు. నీవు సాక్షాత్తూ ఆ శ్రీమహాలక్ష్మివే కదా! అయినా నీకోసం మళ్ళీ ఆ విషయం మరొక్కసారి గుర్తుచేస్తాను. నీకు కన్నయ్యకు ఈ విధంగా ఎడబాటు ఎందుకు కలిగిందో? చెప్తాను అని అన్నాడు. అలా అన్న నారదులవారు రాధాకృష్ణులు ఈ జన్మలో ఎందుకు దూరంగా ఉండవలసిందో వివరంగా చెప్పాడు.

పూర్వజన్మలో ఒకనాడు శ్రీకృష్ణులవారు యమునా నదీ తీరంలో విరజాదేవితో విహరిస్తూ ఉంటాడు. ఆ విషయం తెలుసుకుని రాధాదేవి అప్పుడు అక్కడకి వస్తుంది. తన పరివారంతో ముందుకు వెళ్ళబోతున్న రాధాదేవిని అక్కడ కాపలాగా ఉన్న శ్రీదాముడు అడ్డగిస్తాడు. ఇది గ్రహించిన శ్రీకృష్ణుడు వెంటనే అంతర్ధానమయ్యాడు. అప్పుడు రాధ ఎంతో బాధపడుతూ తిరిగి వెనక్కి వెళ్ళిపోయింది. విరజానది స్త్రీ రూపం ధరించి ఆ పురుషోత్తమునిలో ఐక్యమైంది. విరజాదేవికి శ్రీకృష్ణుడి వలన ఏడుగురు కుమారులు జన్మించారు. ఆ పురుషోత్తముని సంకల్పంతో జన్మించిన వీరంతా ప్రత్యేక కార్యాల కోసమే జన్మ తీసుకున్నవారు.

పిల్లలను చూసుకుని విరజా ఎంతో ఆనందపడిపోయింది. నిత్యం వారితోనే ఆడుతూ పాడుతూ కాలం గడిపేది. వారిని చూస్తూ ఎంతో మురిసిపోయేది. అలా పిల్లలతో ఆనందంతో మునిగితేలుతున్న విరజాదేవిని చూసి శ్రీకృష్ణుడు అక్కడినుంచి అదృశ్యమయ్యాడు. అక్కడితో విరజాదేవి ఎంతో విరహానికి లోనై ఈ పిల్లల వలనే కదా! నాకెంతో ప్రాణప్రదమైన కన్నయ్యను కూడా నేను మర్చిపోయాను అని ఆ పిల్లలని మీరు భూమిపై సప్త సముద్రాలుగా జన్మిస్తారు. అంతే కాక ఆ జలాలు మానవులు త్రాగడానికి కూడా పనికిరావు అని ఎంతో బాధతో శపించింది. అక్కడితో ఆ ఏడుగురు సప్తసముద్రాలుగా మారిపోయారు. అప్పుడు ఎంతో బాధపడుతున్న విరజాదేవిని శ్రీకృష్ణుడు వచ్చి ఎంతో ఓదారుస్తాడు. మనిద్దరికీ ఎప్పటికీ విరహం ఉండదు. నువ్వు ఎప్పుడూ నాతోనే ఉంటావు అని అంటాడు.

ఇంతలో రాధ తనని కలవడానికి వచ్చి బాధపడి తిరిగి వెళ్ళిపోయిన సంగతి గ్రహిస్తాడు. గ్రహించి ఆమె వద్దకు వెళ్ళాడు. అయితే రాధ అప్పటికే ఎంతో అవమాన భారంతో బాధపడుతూ కృష్ణా! నువ్వు ఆ విరజను విడిచి ఉండలేవు కదా! నువ్వు అక్కడికే వెళ్ళు! అని బాధతో అంది. ఇది విన్న శ్రీదాముడు రాధతో ఓ రాధాదేవీ! నీకు కన్నయ్య దాసుడనే భావంతో ఆ కన్నయ్యనే ఇంత చులకన చేసి మాట్లాడుతున్నావు. శ్రీకృష్ణుడు ఎవరనకున్నావు? ఈ సృష్టి మొత్తం ఉన్నది ఆ దివ్యశక్తియే! అందరి హృదయాలలో ఉన్నది ఆ దివ్యప్రేమ మూర్తియే! అటువంటి ప్రేమ మూర్తిని ఇలా తేలికగా మాట్లాడుతావా! నువ్వు తప్పక ఫలితం అనుభవిస్తావు. మీ ఇద్దరికీ నూరు సంవత్సరాలు విరహం కలుగు గాక! అప్పుడు గాని నీకు అర్థం కాదు అని శపిస్తాడు.

అప్పుడు రాధ శ్రీదాముడితో రాధాకృష్ణులు అంటే ఎవరనుకున్నావు! ఇద్దరూ ఒక్కరే అని నీకు తెలియదా? మాకు ఇంతటి ఘోర శాపం ఇచ్చిన నువ్వు రాక్షసుడవై జన్మించు అని శాపమిచ్చింది. అటు తరువాత కాసేపటికే ఇద్దరి ఆవేశం తగ్గుతుంది. అప్పుడు శ్రీకృష్ణులవారు

అక్కడ ప్రత్యక్షమవుతారు. ఆ స్వామి రాధతో రాధా! ఇదంతా కూడా జగన్నాటకంలో భాగమే! మనం ఇద్దరం రాబోయే శ్వేతవరాహకల్పంలో ద్వాపరయుగంలో భూభారం తగ్గించడం కోసం భూమిపై జన్మిస్తాము. అప్పుడు మనం ఇద్దరం ఈ విరహ భారం అనుభవిస్తాము. అయితే ఆ వియోగకాలంలో కూడా నేను నీకు దర్శనమిస్తాను. మొదటి పన్నెండు సంవత్సరాలు మనం కలిసి ఉంటాము. పూర్తి సాన్నిహిత్యాన్ని ప్రేమ మాధుర్యాన్ని అనుభవిస్తాం. సృష్టికి మన ప్రేమ అంటే ఎంత మహత్తరమైనదో తెలియపరుస్తాం. రాధాకృష్ణులుగా జన్మించి ప్రేమ తత్వానికి నిర్వచనంగా నిలుస్తాం! నువ్వు అస్సలు బాధ పడకు అని శ్రీదాముడివైపు తిరిగి ఓ శ్రీదామా! ఇదంతా పెద్ద మహత్తర కార్యంలో భాగం! నువ్వు అసుర రూపంలో రాసమండలంలోకి ప్రవేశించి నన్ను హేళన చేస్తావు. అప్పుడు నాచేతిలో నీకు ముక్తి లభిస్తుంది. శాప విమోచనం కలిగి తిరిగి నీ దివ్యరూపం పొందుతావు అని చెప్పాడు.

ఈ కథంతా నారదుడు రాధాదేవితో చెప్పి అమ్మా! ఇదంతా నీకు తెలియనిది కాదు. ఆ జగన్నాటక సూత్రధారుని లీలలో ఇదంతా భాగమే మీ ఇద్దరు లక్ష్మీనారాయణులే కదమ్మా! నూరు సంవత్సరాల విరహంలో కూడా మీ ఇద్దరు ఒకరి హృదయాలలో ఒకరు నిత్యం నివసిస్తూ, నర్తిస్తూ, దైవిక ప్రేమను ఈ సృష్టికి నిర్వచిస్తారు. నిత్యమైన ప్రేమకు భౌతిక ఎడబాటు ఏమాత్రం అడ్డుకాదని లోకానికి తెలియపరుస్తారు. అందుకు నీవు ఇలా బాధ పడొద్దు తల్లీ! కృష్ణుడు లేనిది ఎక్కడ? నిత్యం నీ హృదయంలోనే కదా! ఆ స్వామి ఉండేది! ఇంతటి అదృష్టం మరెవరికి దక్కింది తల్లీ! అలాగే ఆ పరధామునిలో గల ప్రేమతత్వం నీవే కదా తల్లీ! మీ ఇద్దరు ఒకే ప్రేమతత్వానికి రెండు భౌతిక రూపాలు కదా తల్లీ! అని అన్నాడు.

నారద మహర్షి మాటలు విన్న తరువాత రాధ కాస్త శాంతించింది. మహర్షికి ఎంతో ఆనందంతో నమస్కరించింది. అప్పుడు నారదులవారు అదృశ్యమయ్యారు. రాధకు తమ వియోగ విషయం, పరమార్థం తెలిసింది.

కానీ వియోగం వియోగమే కదా! అని అనుకుంది. ఆ చెట్లపై ఉన్న పక్షులన్నీ కింద విరహస్థితిలో ఉన్న రాధను చూసి ఎంతో బాధపడ్డాయి. అప్పుడు రాధ వాటన్నింటినీ ఓదార్చి వాటికి కృష్ణతత్వం వివరంగా చెప్పి వాటిని శాంతపరిచింది. అక్కడ నుంచి సాయంత్రం బయలు దేరి తిరిగి ఇంటికి చేరింది. ఆ రాత్రి రాధ కన్నయ్యను హృదయం నిండా నింపుకుని ప్రశాంతంగా నిద్రపోయింది.

# 20

ఒకరోజు శ్రీకృష్ణుల వారు రుక్మిణీదేవితో ఏవో కబుర్లు చెప్తూ కాసేపటికి పడుకున్నారు. రుక్మిణికి వెంటనే నిద్రపట్టింది కానీ కృష్ణయ్యకు ఎంతకూ నిద్ర పట్టడంలేదు. అర్థరాత్రి దాటి చాలాసేపయింది. అప్పుడు కృష్ణయ్య నెమ్మదిగా రుక్మిణిని లేపాడు. అదేమిటి స్వామీ! ఇంత రాత్రయిన మీరు ఇంకా నిద్రపోలేదు. మీ ఒంట్లో బాగానే ఉంది కదా! ఏదైనా బాధగా ఉందా? అని అడిగింది రుక్మిణి. అప్పుడు కృష్ణయ్య దేవీ రుక్మిణీ ఈ రోజు మన ఇంటికి బృందావనం నుంచి నా ప్రియసఖి రాధ వచ్చింది కదా! ఆమెకు రాత్రిపూట వెచ్చటి పాలు త్రాగడం అలవాటు. అయితే అవి గోరువెచ్చటివి మాత్రమే! అలాగని చల్లగా కూడా ఉండకూడదు. ఈ రోజు మనం ఆమెకు పాలు ఇవ్వడం మర్చిపోయాము. అక్కడితో రాధకు నిద్రపట్టడం లేదు. అందువలన నాకు కూడా నిద్ర పట్టడం లేదు నువ్వు వెళ్ళి రాధకు గోరువెచ్చటి పాలు ఇచ్చిరా! అన్నాడు.

అయ్యో స్వామీ! ఎంత పొరపాటు జరిగింది? ఇప్పుడే రాధవద్దకు వెళ్ళి తప్పక ఇస్తాను అని వంటింట్లోకి వెళ్తూ మనస్సులో ఇలా తలచింది. ఆహా! ఈ రాధ ఎంత అదృష్టవంతురాలు. సాక్షాత్తూ శ్రీకృష్ణులవారి హృదయంలో నిత్యం నివసించే అమృత మూర్తి. ఇన్ని సంవత్సరాలు కన్నయ్యను భౌతికంగా విడిచి ఉన్నా మా అందరికంటే ఈమె ప్రేమనే మహత్తరమైనది. మేమందరం నిత్యం భౌతికంగా స్వామితోనే ఉన్నా రాధ ప్రేమ ముందు మా ప్రేమ ఏపాటిది. నాది భక్తి పూర్వక ప్రేమ. ఆమెది త్యాగ పూర్వక ప్రేమ అని ఇలా రాధ ప్రేమ గురించి, ఆ ప్రేమ ఔన్నత్యాన్ని గురించి తలుస్తూ రుక్మిణీ దేవి పాలని తీసుకుని వెళ్ళి రాధ ఉన్న శయన మందిరంలోకి వెళ్ళి ఆమె చేతికి పాల గిన్నె ఇచ్చింది. రాధ చిరునవ్వు నవ్వుతూ పాలు తీసుకోగానే రుక్మిణి తిరిగి కృష్ణ మందిరానికి వచ్చింది.

కన్నయ్య రాధాదేవికి పాలు ఇచ్చి వచ్చాను ఆమె ఈపాటికి ఆ పాలు తాగి నిద్రపోతూ ఉండవచ్చు. ఇక మీరు కూడా నిశ్చింతగా పడుకోండి. అయినా ఈ రోజు మీరు కొంచెం అలసినట్లున్నారు. కాసేపు పాదాలు పడతాను అని రుక్మిణి మంచం దిగి కన్నయ్య పాదాల వద్దకు వచ్చింది. అంతే కన్నయ్య పాదాలను చూసిన రుక్మిణి హతాశురాలైంది! ఎప్పుడూ ఎంతో సుతిమెత్తగా కనిపించే ఆ గోవిందుని పాదాలు పూర్తిగా ఎర్రబడి కాలిన బొబ్బలతో ఉబ్బిపోయి ఉన్నాయి! ఒక్కసారిగా నిర్ఘాంత పోయింది రుక్మిణి. స్వామీ! ఏమిటిది ఏదైనా మూలికలు తెచ్చి వెంటనే రాస్తాను ఎంత బాధపడుతున్నావో కదా నా కృష్ణా! అయ్యో ఎంత ఎర్రగా బొబ్బలెక్కాయో! అది కూడా ఇంత పెద్దగా ఈ రాత్రివేళ ఇలా ఎలా బొబ్బలెక్కాయి? లేదా పగలు కూడా ఉన్నాయా నేను గమనించలేదా? పగలంతా ఈ బొబ్బల బాధతోని తిరుగుతున్నావా గోవిందా! అంటూ ఎంతో బాధతో అడిగింది.

అప్పుడు కృష్ణుడు రుక్మిణితో ఇలా అన్నాడు దేవీ! నువ్వు రాధ ప్రేమ ఔన్నత్యం గురించి తన్మయత్వం చెంది ఆమెకు ఎంతో వేడిగా కాచిన పాలు ఇచ్చావు. ఆ తన్మయత్వంలో ఆ వేడి పాలు చల్లార్చి ఇవ్వడం మర్చిపోయావు!

రాధ నన్నే స్మరిస్తూ నన్నే ధ్యానిస్తూ వేరే దేనిమీదా ధ్యాసలేక నీవిచ్చిన ఆ వేడి పాలను అలాగే తాగింది. రాధ హృదయంలో ఎప్పుడూ నా పాదపద్మాలనే స్మరిస్తూ ధ్యానిస్తూ ఉంటుంది. అందుకనే నన్నే ధ్యానిస్తూ తాగిన ఆ పాల వేడికి ఇక్కడ నా పాదాలు బొబ్బలెక్కాయి అన్నాడు. కృష్ణయ్య ఇలా చెప్పగానే రుక్మిణి కనుల వెంట నీరు కారింది. అయ్యో! ఎంత పని చేసాను ఆ రాధది నిజంగా ఎంత దివ్యమైన భక్తి. ఎంత తప్పుచేశాను అని మనస్సులోనే రాధను క్షమించమని వేడుకుని నమస్కరించింది.

రాధాదేవి భక్తి అంతటి మహోన్నతమైనది. ఆమెకు కృష్ణుడిపైగల ప్రేమానురాగాలు ఎంతో గొప్పవి. ఒకసారి బృందావనంలో రాధ కృష్ణుని కోసం ఎంతో భక్తితో, ఆర్తితో తులసీవ్రతం చేసింది. రాధ ఎంతో నియమనిష్టలతో, పూర్తి ఏకాగ్రతతో చేసిన తులసీవ్రతానికి తులసి మాత ఎంతో సంతోషపడి అభీష్ట ఫల సిద్ధిరస్తు అని ఆశీర్వదించింది.

ఆ వ్రతం ఆచరించిన కాసేపటికి అక్కడకి అద్భుత అందంతో మెరిసిపోతున్న ఒక స్త్రీ మూర్తి వచ్చింది. ఆ గోపికాంగన రూపాన్ని చూసిన రాధాదేవి నువ్వు ఎవరమ్మా? ఇంతకు ముందు నిన్ను బృందావనంలో నిన్ను చూసినట్లు గుర్తులేదు. ఇంత అందమైన స్త్రీమూర్తిని నేను ఎప్పుడూ చూడలేదు. నిన్ను చూస్తుంటే నా ప్రియసఖుడైన కృష్ణయ్యే గుర్తుకు వస్తున్నాడు అంది. అప్పుడు ఆ గోపాలిక నేను నంద నగరంలో ఉంటాను. నీవు ఎంతో అద్భుతంగా భక్తి శ్రద్ధలతో తులసీవ్రతం చేసావని తెలిసి వచ్చాను. నిన్ను చూసాక ఎంతో ఆనందం కలిగింది. ఇంక సాయంత్రం వేళ అవుతోంది ఇక ఇంటికి వెళతాను రేపు ఉదయం మళ్ళీ వస్తాను అని చెప్పి వెళ్ళింది.

రాధ కళ్ళలో ఎందుకో ఎంతో అనురాగంతో కన్నీటి ధారలు కారాయి. అప్పుడు ఆ గోపాదేవి రాధను దగ్గరకు తీసుకుని రేపు ఉదయమే తప్పక వస్తాను కదా! అని చెప్పి వెళ్ళింది.

అలా చెప్పినట్లుగానే ఆ దివ్య సుందర గోపకాంత ఉదయాన్నే రాధ ఇంటికి వచ్చింది. ఈమెను చూసిన రాధ ఎంతో సంబర పడింది అప్పుడు గోపాదేవి అమ్మా రాధా! నేను ఇంకా త్వరగా వద్దామని అనుకున్నాను. కానీ ఏది నన్ను ఆ కొంటె కృష్ణుడు వదిలిపెడితేనో! ఇంత అందమైన దానిని నేను ఎప్పుడూ చూడలేదు నిన్ను నాకు అర్పించుకో! అని అల్లరి చేసాడు. ఆ చిన్ని బాలుడు ఇలా మాట్లాడటం ఏమిటి అని నేను ఆశ్చర్యపోయాను. నాకు ఎంతో కోపం కూడా వచ్చింది నేను ససేమిరా అన్నాను. అప్పుడు ఆ కొంటె కన్నయ్య నా తలపై ఉన్న నా పెరుగు కుండను కింద పడవేసి కొంచెం పెరుగు తిని పరుగెత్తి వెళ్ళిపోయాడు. అంతటి కొంటెవాడినా నువ్వు వరించినది? అతడు నీకు ఏమాత్రం తగడమ్మా! నీవు ఎంత అద్భుత సౌందర్య రాశివి? అతడు!! మహా అల్లరి వాడు. నువ్వు ఎంతో గొప్ప ధనవంతురాలివి! అతడు ఏదో ఆవులు తోలుకునే సామాన్యుడు! అతడిని నువ్వు వరించడం ఏమిటి? ఆ ఆలోచన మానుకో అని అంది.

ఇది విన్న రాధ ఎంతో కోపంతో ఓ గోపాదేవీ! నీకు శ్రీకృష్ణుని గురించి సరిగ్గా తెలిసినట్లు లేదు అతడు ఎవరనుకున్నావు? భువనైక మనోహర మూర్తి! భూభారం తగ్గించడం కోసం అవతరించిన సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడు! అతడు చిన్న బాలుని రూపంలో ఉన్నాకూడా నవ యవ్వన దివ్య మనోహర మూర్తిగా గాను దర్శనమివ్వగలడు. తన భక్తులంటే తనకు ఎంతో ప్రేమ. ఈ సృష్టిలో బ్రహ్మరుద్రులైనా కన్నయ్యకు తన భక్తుల తరువాతనే. తన భక్తులను ఎన్నో విధాల అనుగ్రహించడం ఆ గోవిందుడికి ఎంతో ప్రీతికరం అన్నది.

అప్పుడు గోపాదేవి అవునా రాధా! మరి నువ్వు ఆ గోవిందుని ఇంతగా కొలుస్తున్నావు కదా! నీవు అతడి గురించి ఇంత గొప్పగా చెప్పినప్పుడు నీ ముందు ప్రత్యక్షం అవ్వాలి కదా! అన్నది. వెంటనే రాధ కనులు మూసుకుని తీవ్రంగా కన్నయ్యనే ధ్యానించింది. అక్కడితో ఆ గోపాదేవి రూపంలో వచ్చిన కన్నయ్య తన నిజరూపంతో రాధ ఎదుట

ప్రత్యక్షమై తన ప్రియసఖిని కౌగిలించుకున్నాడు. రాధ ఎంతో ఆనందంతో కన్నయ్య చరణాల వద్ద వాలిపోయింది ఇంతటి అద్భుతమైనది ఆ రాధాకృష్ణుల అద్భుత ప్రేమ.

మహాభారత యుద్ధం ముగిసిన కొన్ని రోజుల తరువాత ఒకనాడు కన్నయ్య తన శయన మందిరంలో ఏదో ఆలోచిస్తూ పడుకున్నాడు. ఇంతలో రుక్మిణీ దేవి అటుగా వచ్చి ఏమిటి స్వామీ! ఆలోచిస్తున్నారు అని అంది. దేవీ! ఇక కాసేపట్లో మన రాధ ఇక్కడకు రానుంది. చాలా అలసిపోయి ఎవరూ గుర్తుపట్టలేనంతగా ఉంది. ఆమె మన వద్ద కొన్ని రోజులు ఉంటుంది. నువ్వు ఆమెను జాగ్రత్తగా చూసుకొనవలసింది అన్నాడు. అలాగే స్వామీ! తప్పకుండా అన్నది రుక్మిణి.

కృష్ణయ్య అలా చెప్పిన కాసేపటికే రాధ వచ్చింది. రుక్మిణి రాధను దగ్గరకు తీసుకుని నువ్వు ఇక్కడ అంతఃపురంలో సంతోషంగా ఉండవచ్చునమ్మా! నీకు ఏం కావలసినా ఏమి సంశయించకుండా నన్ను అడుగు అంది రుక్మిణి. అటు తరువాత రాధ నాలుగైదు రోజులు అక్కడే ఉంది.

ఒకనాటి ఉదయం ఆమెకు ఏదో స్ఫురించినట్లై ఒక్కసారిగా అంతఃపురం విడిచి దగ్గరలో ఉన్న అటవీ ప్రాంతానికి వెళ్ళింది. అక్కడ ఒక పెద్ద చెట్టుకింద కూర్చుని కన్నయ్యను ధ్యానిస్తూ ఉంది. ఇది గ్రహించిన కన్నయ్య ఎవ్వరికీ చెప్పకుండా అడవిలో ఆమె ఉన్న ప్రాంతానికి వచ్చాడు. తననే ఎంతో ప్రేమతో ధ్యానిస్తూ ఉన్న తన ప్రియసఖిని చూసేటప్పటికి కృష్ణయ్యకు కనుల వెంట నీరు కారింది. అప్పుడు రాధ కనులు తెరిచి వచ్చావా కన్నా! అన్నది! నీ రాధ ఇన్ని సంవత్సరాలు నీకోసం వేచి చూసి ఎంతగా అలసిపోయిందో చూడు! అని అంది.

అప్పుడు కన్నయ్య ఆమెను కౌగిలించుకుని అవును సఖీ! నూరు సంవత్సరాల వియోగం! ఇదంతా ఒకనాటి శాప మహిమ కదా! అయినా

మనిద్దరం నిత్యం ఒకరి హృదయాలలో మరొకరు ఉంటూనే ఉన్నాం కదా! అన్నాడు. అవును కృష్ణా! ఒకటా రెండా నూరు సంవత్సరాలు! నువ్వు లేకుండా నిన్ను చూడకుండా నూరు సంవత్సరాలు! ఎన్ని వసంతాలు! ఎన్ని వేల రాత్రుళ్ళు! ఎన్ని వెన్నెల రాత్రుళ్ళు? ఆ బృందావనంలో మనం తిరిగిన ప్రతీ ప్రదేశం చూసుకుంటూ మనం ఆడుకున్న ఆటలన్నీ మళ్ళీ గుర్తుతెచ్చుకుంటూ ప్రతిరోజూ నీ తలపులలోనే నూరు సంవత్సరాలు గడిపాను. ఒక్కరోజైనా ఒక్క క్షణం కూడా నిన్ను మర్చిపోలేదు కృష్ణా! నా ఆలోచనలలో ఎప్పుడూ నీవే!

రాధ ఇంకా ఇలా చెప్పసాగింది. రోజూ ఉదయాన్నే బృందావనానికి వెళ్ళేదాన్ని. ఒక్కోరోజు అక్కడ నా పక్కనే ఉన్న కుందేళ్ళలో నువ్వే కనిపించావు. మనం ఇక్కడ ఆడుతున్నప్పుడు ఆ కుందేళ్ళు మనతో ఎలా పరుగెత్తాయో గుర్తు తెచ్చుకునేదాన్ని. అవి నా ముఖంలోకి చూస్తూ ఒకొక్కసారి నా బాధను అర్థం చేసుకున్నట్లు కనపడేవి. అప్పుడు వాటిని బాధపెట్టడం ఇష్టం లేక వెంటనే వాటిని దగ్గరకు తీసుకుని వాటిలో నిన్ను చూస్తూ ఎంతో ఆనందపడుతున్నట్లు నటిస్తూ ఆ కుందేళ్ళని ఎంతో ఆనందపరిచేదాన్ని. మరి నీ రూపం కనబడితే ఆనందమే కదా! అలా తలచుకోగానే ఆ చుట్టూ ఉన్న అన్ని కుందేళ్ళలో నీరూపమే కనపడేది. కృష్ణా ఇలా ఒకరోజు కుందేళ్ళలో, ఒకరోజు నెమళ్లలో, ఒకరోజు లేడిపిల్లలలో, ఒకరోజు జింకపిల్లలలో, ఒకరోజు చెట్లమీద ఉన్న చిలుకలలో మరొకరోజు ఆవుదూడలలో ఇలా ప్రతీ జీవిలో నిన్నే చూసుకుంటూ ఈ నూరు సంవత్సరాలు గడిపాను.

కృష్ణా! ఒకరోజు ఏమైందో తెలుసా? నేను ఉదయాన్నే బృందావనానికి వచ్చాను. ఆ రోజు రోహిణీ నక్షత్రం నీ పుట్టినరోజు కూడా. నిన్నే తలుస్తూ ఆ తమాలి వృక్షం కింద కూర్చున్నాను. ఒక్కసారిగా మనమిద్దరం ఆ రోజులలో ఇక్కడ బృందావనంలో నీ పుట్టినరోజు ఎలా జరుపుకునే వాళ్ళమో! గుర్తువచ్చి ఎంతో ఆనందం, ఎంతో బాధ రెండూ

వచ్చాయి! నా కనులవెంట ఇటు ఆనందం, అటు బాధ కలిసి నీరు కారసాగింది. అప్పుడు ఒక్కసారిగా ఒక నెమళ్ళ గుంపు వచ్చి నా చుట్టూ నాట్యమాడుతూ తమ పింఛాలను నా మీదకు ఎగిరేలా చేసాయి. అలా చాలాసేపు చేసాయి వాటిని చూడగానే ఆ నెమళ్ళన్నిటిలో నువ్వే కనిపించావు. కాసేపటికి అన్ని నెమళ్ళు నృత్యం ఆపేసాయి. ఆశ్చర్యంగా ఒక్క నెమలి మాత్రం నృత్యం చేస్తూనే ఉంది. ఎంతో అలసిపోతూ ఉంది కాని నృత్యం ఆపడంలేదు.

అప్పుడు నాకు అర్థమయ్యింది కృష్ణా! ఆ నెమలికి నా ముఖంలో ఇంకా కొంచెం నువ్వు లేవన్న నిరాశ కనిపించింది. నేను ఆ విషయం వెంటనే గ్రహించాను. ఆ నెమలికి నాలోని ఈ ఆలోచనకూడా తెలియకుండా ఉండడానికి వెంటనే ఆ నెమలి ఎదురుగా వెళ్ళి కిలకిలా నవ్వుతూ నృత్యం చేసాను. ఆ నెమలిలో నువ్వే కనపడ్డావు కృష్ణా! మరి నా ముఖంలో కొంచెం నిరాశనయినా నువ్వు తప్ప ఎవ్వరూ పూర్తిగా గ్రహించగలరు! అందుకే ఆ నెమలితో పాటు ఆ నెమలిలో నిన్నే చూస్తూ అలసిపోయేదాకా అలా నృత్యం చేస్తూనే ఉన్నాను.

కృష్ణా! అప్పుడు ఏమైందో తెలుసా? అలా అలసి అలసి స్పృహ తప్పి పడిపోయాను. అలా ఎంతసేపు ఉండిపోయానో తెలీదు. ఇంతలో ఎవరో నా మీద నీళ్ళు గుమ్మరిస్తున్నారు. అక్కడితో స్పృహలోకి వచ్చి చూస్తే నా శరీరంమీద రెండు ఏనుగులు తమ తొండాలతో యమున నుంచి నీరు తీసుకువచ్చి నామీద కురిపిస్తున్నాయి. ఆ మూగజీవులు నా బాధ చూడలేకపోయాయి అని అంది.

రాధ ఇలా చెప్తుంటే కృష్ణయ్య రాధతో రాధా! నువ్వు ఎంత బాధపడ్డావో ఇన్ని సంవత్సరాలు నన్ను విడిచి నీ మనస్సు ఎలా ఉందో నేను ప్రతిక్షణం గ్రహిస్తూనే ఉన్నాను. ఇప్పుడూ నా హృదయంలో నువ్వే ఉన్నావు. గోలోకం నుంచి నాకోసం వచ్చినదానవు. ఒక కారణ నిమిత్తం మనకీ ఎడబాటు జరిగింది గానీ నిన్ను ఎలా మర్చిపోతాను. నేను ఎక్కడ ఏ కార్యంలో

నిమగ్నమై ఉన్నా, ఎందరి సమక్షంలో ఉన్నా, ఎప్పుడూ నా హృదయంలో నిన్ను స్మరిస్తూ దర్శిస్తూ ఉండేవాడిని అన్నాడు.

అప్పుడు రాధ కృష్ణా! నేను ఒకొక్కసారి బృందావనానికి వచ్చి ఉదయం నుంచి రాత్రి వరకూ ధ్యానంలోనే ఉండిపోయేదాన్ని. నిన్నే మనస్సులో నింపుకుని ధ్యానిస్తూ ఉండిపోయేదాన్ని. అలా ఎన్ని వసంత ఋతువులు, ఎన్ని శరదృతువులు గడిచాయి. ఎన్ని శరత్‌పూర్ణిమ రాత్రులలో యమున ఒడ్డున నిన్ను తలుస్తూ గడిపానో తెలుసా?

ప్రతీ నెలా రోహిణీ నక్షత్రం నాడు ప్రత్యేకంగా అలంకరించుకుని ఈ బృందావనంలోని ప్రతీ చెట్టులో, ప్రతీ పక్షిలో, ప్రతీ కుందేలులో, ప్రతీ నెమలిలో, ప్రతీ లేడిలో, ప్రతీ జింకలలో... ఇలా ప్రతీ జీవిలో నిన్ను చూస్తూ ఈ నూరు సంవత్సరాలు గడిపాను. ఇక అలసిపోయాను కృష్ణా! నాలోని ప్రతీ అణువు ఇన్ని సంవత్సరాలుగా నీ నామం స్మరిస్తూ, నీరూపం ధ్యానిస్తూ ఇదిగో చూడు నీలాగానే మారిపోయాను.

నాలోని ప్రతీ అణువణువులోను ఉన్నది నీవే కదా! ఇంక నీవు లేనిది ఎక్కడ? నా హృదయంలోనే కాదు నా అణువణువులోను ఉన్నది నువ్వే! ఇంతకు మించిన ఆనందం ఏముంటుంది కృష్ణా! ఈ విశ్వం మొత్తం వ్యాపించి ఉన్న నీవు నా ప్రతీ అణువులోను ప్రకాశిస్తున్నావంటే ఇంతకుమించిన బ్రహ్మానందం ఇక ఏముంటుంది? అంది రాధ. నిరంతరం నీ స్మరణలోనే కాలం గడిపాను. ఇక ఈ భౌతిక శరీరాన్ని విడిచిపెడుతున్నాను. చివరిసారిగా ఒక్కసారి నా కోసం వేణువు ఊదవా అని అడిగింది.

కన్నయ్యకు మనస్సులో జరగబోతున్న సంగతి అర్థమయింది. రాధ నోటినుంచి కృష్ణా! కృష్ణా! అంటూ వినబడుతూ ఆ పిలుపు నెమ్మదిగా స్థాయి తక్కువ కాసాగింది. ఇక రాధ ఈ లోకం వీడి వెళ్ళిపోనున్నది అని గ్రహించాడు. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకూడదని అనుకున్నాడు. తన

ప్రియసఖి, తనలోని ప్రతి అణువు తానే అయినా ఆ రాధ చివరి కోరిక వెంటనే తీర్చాలి అని తలిచాడు. ఓ తప్పకుండా రాధా! నీకోసం ఎంతో అద్భుతంగా వేణువు ఊదుతాను విను అని అన్నాడు. ఆ చెట్టుకిందే ఒక రాతి మీద కూర్చుని వేణువు ఊదసాగాడు. రాధ కృష్ణుని  ఒడిలో తల పెట్టుకుని కింద కూర్చుంది.

కన్నయ్య ఎంతో మధురంగా వేణువు ఊదుతుంటే రాధ ఆనందంగా వింటూ ఆమె కనులవెంట నీరు కారసాగాయి. అలా పూర్తి తన్మయత్వంతో తన ప్రియసఖుడైన కృష్ణుని వేణుగానం వింటూ ఆ పురుషోత్తముని ఒడిలోనే లోకం విడిచి, అతనిలో ఐక్యమైంది. అక్కడితో కృష్ణయ్య ఎంతో బాధపడి ఒక్కసారి రాధ తలపై నిమిరి తన వేణువును ఒక్కసారి తన బుగ్గపై ఆనించుకుని తిరిగి రాధ చెక్కిలిపై నెమ్మదిగా ఆనించి దూరంగా పొదల్లోకి విసిరివేసాడు. అదే ద్వాపరయుగంలో శ్రీకృష్ణులవారు చివరిసారిగా ఊదిన వేణుగానం. ఆ తరువాత కన్నయ్య కాసేపు అక్కడే కూర్చుని తన ప్రియసఖి రాధలోని ప్రేమతత్వాన్ని తలుచుకుంటూ ఉండిపోయాడు.

ఈ దృశ్యమంతా చూసిన చెట్లపై ఉన్న పక్షులు కూడా కన్నీరు కార్చాయి. బృందావనంలో రాధాకృష్ణుల అపూర్వ ప్రేమ తెలియని జీవి ఏముంటుంది? నూరు సంవత్సరాల పాటు ఆ కన్నయ్య ఎడబాటుని భరిస్తూ తమతో నిత్యం ఆ కన్నయ్య అక్కడే ఉన్నాడని తలుస్తూ ఆడుకున్న అక్కడి చెట్లు, మూగ జీవాలు ఈ రోజున నిజంగా మూగబోయాయి. ఒక ప్రేమ మూర్తి తను ఆరాధించిన ఆ భగవంతుని నూరు సంవత్సరాలు మళ్ళీ కలవకపోయినా ప్రేమ నిండిన హృదయంతో నిత్యం అక్కడే ఆటలాడుతూ గడిపిన దృశ్యాలన్నీ ఆ చెట్లన్నీ గుర్తు తెచ్చుకున్నాయి.

ఇది జరిగి కొన్ని వేల సంవత్సరాలైనా ఇప్పటికీ ఆ వనంలో సాయంత్రం అయ్యేసరికి రాధాకృష్ణులు నిత్యం సంచరిస్తూనే ఉంటారు. ఎన్నో

కబుర్లు చెప్పుకుంటూ ఉంటారు. ఈ విధంగా రాధాకృష్ణుల ప్రేమ ఎంతో అపూర్వమై లోకానికి ఆదర్శంగా నిలిచింది.

ఏ జీవి అయినా వారి మధుర ప్రేమను తలచుకున్న క్షణంలోనే మనస్సు ఎంతో ఆనందంతో నిండిపోతుంది. మనందరం నిత్యం ఆ ప్రేమ మూర్తులని మన హృదయాలలోనే నింపుకుని మన జీవితాలను ఆనందమయం చేసుకోవాలి.

ఆ రాధాకృష్ణుల దివ్య ప్రేమతత్వాన్ని అర్థం చేసుకోవాలి, అనుభవించగలగాలి అంటే వారి సంపూర్ణ అనుగ్రహం మనకు లభించాలి. ఎవరైతే ఈ "శ్రీకృష్ణ దర్శనం" పూర్తి ఆర్తితో, పూర్తి ప్రేమతో చదువుతారో వారికి దివ్యమైన అనుభూతి కలుగుతుంది. ఈ మాట సాక్షాత్తూ ఆ శ్రీకృష్ణ స్వామియే నాకు సెలవిచ్చారు. "శ్రియా రాధాయ సహితః కృష్ణః, శ్రీకృష్ణః" అంటే సాక్షాత్తూ శ్రీదేవి, శ్రీమహాలక్ష్మి అయినటువంటి రాధతో కూడి ఉన్న కృష్ణుడే శ్రీకృష్ణుడు అని అర్థం. అటువంటి శ్రీకృష్ణుల వారి యందు అపూర్వ భక్తి, ప్రేమ కలిగి ఉండడం ఒక అపూర్వ యోగం. గోపికలందరూ పరమ యోగులే! మనం కూడా ఆ కృష్ణతత్వంలో పరవశించాలని రాధాకృష్ణుల ప్రేమామృతాన్ని ఆస్వాదించి యోగులు అవ్వాలని... ఆ రాధాకృష్ణుల అనుగ్రహంతో ఈ "శ్రీకృష్ణ దర్శనం" చదివిన ప్రతీ ఒక్కరు దివ్య రసానుభూతిని పొంది యోగులౌతారని ఆశిద్దాము.

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు!






అనేక దేవతల అనుగ్రహంతో 32 పుస్తకాలు రచించిన విశ్వపతికి ఈ మధ్య శ్రీకృష్ణదర్శన భాగ్యం కలిగింది. ఆ చిన్ని కన్నయ్య విశ్వపతిని తనతోపాటు ద్వాపరయుగంలోకి తీసుకువెళ్ళి తాను గోకులంలోను, బృందావనంలోను చేసిన కొన్ని అద్భుత లీలలను దర్శింపచేసాడు. ఆ దివ్య లీలలలోని కొన్నింటి సమాహారమే ఈ శ్రీకృష్ణ దర్శనం! పదండి! కన్నయ్యతో మనం కూడా గోకులానికి, బృందావనానికి వెళ్ళి అద్భుత అనుభూతులను అనుభవిద్దాము. ఇంతకుమించిన అద్భుత ఆనందం వేరే ఏముంటుంది?